www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆకాశ దేశం నుంచి అవనికి సందేశం

22.6 కోట్ల కి.మీ. దూరాన ఉన్న సైకీ వ్యోమనౌక నుంచి నాసాకు 10 నిమిషాల లేజర్ డేటా 11

ఈ ప్రాజెక్టు ఆపరేషన్స్ చీఫ్.. మీరా శ్రీనివాసన్

రోదసి నుంచి 'ఆప్టికల్' డేటా బదిలీ దిశగా

పెద్ద మైలురాయి.. భవిష్యత్తు ప్రయోగాల్లో కీలకం

శుక్రవారం | 3-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 34 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా. 11.24 తదుపరి ఏకాదశి; నక్షత్రం: శతభిషం రా. 12.06 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ. 8.30-9.59; దుర్ముహూర్తం: ఉ. 8.23-9.14, మ. 12.37-1.28; అమృతఘడియలు: సా. 5.24-6.54; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫోన్ ట్యాపింగ్.. కేసీఆర్ కోసమే!

పోలీసులకిచ్చిన వాంగ్మూలంలో రాధాకిషన్ వెల్లడి

ఆయన కుటుంబసభ్యులు, పార్టీలో సన్నిహితుల రహస్య కార్యకలాపాలనూ మేము చక్కబెట్టాం

విపక్ష నేతలు, కేసీఆర్‌కు ఇబ్బందిగా ఉన్నవారు, వారి సన్నిహితుల ఫోన్లపై ప్రణీత్‌కుమార్ నిఘా

ఆ వివరాలతో వాళ్లను లొంగదీసుకునేవాళ్లం

చిన్న విమర్శ చేసినా.. 'పెద్దాయన'కు చిరాకు..!

అందుకే నిరసనలు, ఆందోళనలు అణచివేశాం

ఆదేశాలన్నీ సీపీ ద్వారా వచ్చేట్లు చూసుకున్నాం

వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్

లోక్‌సభ ఎన్నికల తర్వాత ట్యాపింగ్ కేసు పార్ట్-2



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో తొలిసారి మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చింది. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, పార్టీలో ఆయన సన్నిహితుల వ్యవహారాలను చక్కబెట్టేందుకే తామంతా కలిసి పనిచేశామని టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్డీ) రాధాకిషన్‌రావు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రణీత్‌కుమార్ అందించే వివరాలతో.. కేసీఆర్ రాజకీయ ప్రత్యర్థులను, వారికి ఆర్థిక సాయం అందించేవారిని బెదిరించి లొంగదీసుకునేవారమని, సివిల్ తగాదాల్లో సెటిల్మెంట్లు చేసేవారమని, ఎన్నికల్లో వారి నగదు తరలింపును అడ్డుకునేవారమని చెప్పారు. బీఆర్ఎస్ డబ్బు రవాణాకు సహకరించేవారమని తెలిపారు. గత నెల 3 నుంచి 10వ తేదీ వరకు దర్యాప్తు అధికారులు

మిగతా 14వ పేజీలో...

కేసీఆర్‌కు ఎందుకు నోటీసులివ్వరు? 14

ట్యాపింగ్ కేసులో స్పష్టంగా కేసీఆర్ పాత్ర

ఇది రాధాకిషన్‌రావు స్టేట్‌మెంట్‌లో ఉంది

కేసీఆర్‌ను కాపాడేందుకు ఓ మంత్రి చీకటి ఒప్పందం

బీఆర్ఎస్ మనిషికే కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ టికెట్

నేను, రేవంత్, హరీశ్ ట్యాపింగ్ బాధితులం: బండి

కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్

ట్యాపింగ్ కేసును మాకు ఆపాదిస్తున్నారు

బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయకుండా పార్టీలను అడ్డుకోండి

హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు

వడ దడ

15 జిల్లాల్లో నేడు, రేపు వడగాలులు

భారత వాతావరణ కేంద్రం హెచ్చరిక

5 జిల్లాల్లో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

ఎండకు మిర్యాలగూడలో పగిలిన రోడ్డు

వడదెబ్బతో ఆరుగురి మృత్యువాత



నల్లగొండలో కోళ్లపై నీళ్లు పోస్తున్న షాపు నిర్వాహకుడు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో సూరీడు శివాలెత్తిపోతున్నాడు. ఎండలు, వడగాలుల తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు. నాలుగు రోజుల క్రితం వరకు 45 డిగ్రీల మేర నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం రికార్డు స్థాయిలో 46.6కు చేరుకున్నాయి. నల్లగొండ జిల్లా అనుముల(హాలియా) మండలం ఇబ్రహీంపేటలో గురువారం రాష్ట్రంలోనే అత్యధికంగా 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) తెలిపింది. ములుగు జిల్లాలో 46.5, జగిత్యాల జిల్లా నేరెళ్ల, వెల్గతూర్, సూర్యాపేట జిల్లా మునగాల, నల్లగొండ జిల్లా నాంపల్లిలో 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబాబాద్, మంచిర్యాల జిల్లా జన్నారంలో 46.3, వరంగల్‌తో పాటు పెద్దపల్లి జిల్లా సుగ్లాంపల్లి,

మిగతా 3వ పేజీలో...

దుబాయ్‌లో మళ్లీ జోరు వాన 11

పలు విమాన సర్వీసులు రద్దు



సిద్దిపేటలో నిర్వహించిన ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. మంత్రి కొండా సురేఖ, కోదండరామ్

మామ అల్లుడు పాపాల భైరవులు

నలభై ఏళ్లుగా సిద్దిపేటను పట్టి పీడిస్తున్నారు

ఆ బ్రహ్మరాక్షసుల నుంచి విముక్తి కలిగిస్తా

కొమురెల్లి మల్లన్న సాక్షిగా రుణమాఫీ అమలు

హరీశ్‌రావుతో రాజీనామా చేయించి

సిద్దిపేటలో కొత్త ఎమ్మెల్యేను గెలిపిస్తా

దుబ్బాకకు రఘునందన్ తెచ్చింది గాడిద గుడ్డే

మొన్న కేసీఆర్‌కు బై చెప్పాం.. ఇక మోదీకి..!

సిద్దిపేట, ఆసిఫాబాద్, కుత్బుల్లాపూర్ సభలు, రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి

సిద్దిపేట, ఆసిఫాబాద్, హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల నుంచి సిద్దిపేట నియోజకవర్గాన్ని మామ అల్లుడు పాపాల భైరవుల్లాగా పట్టి పీడిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. ఏనుగులు తినే మామ పోతాపోతా పీనుగులను తినే అల్లుడిని తెచ్చి పెట్టిండని ఎద్దేవా చేశారు. మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా గురువారం రాత్రి సిద్దిపేటలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. అరుంధతి సినిమాలో బొమ్మాళిలాగా సిద్దిపేటను పట్టిపీడిస్తున్న బ్రహ్మరాక్షసుల నుంచి విముక్తి కలిగించడానికే ఈ గడ్డ మీద

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన 5 గ్రామాలను తీసుకొస్తాం! 12

హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు బెంచ్..

పాలమూరు, మేడారానికి జాతీయ హోదా..

తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో

నేడు విడుదల చేయనున్న సీఎం రేవంత్

అమిత్ షా ఫేక్ వీడియో కేసు 12

టీ కాంగ్రెస్ ఐటీ సెల్ ఇన్‌చార్జి మన్నె సతీశ్ అదుపులోకి


అరెస్టు చేసిన సీసీఎస్ బృందం

మరోసారి గాంధీభవన్‌కు ఢిల్లీ పోలీసులు



3

కవిత బెయిల్ పిటిషన్‌పై తీర్పు 6కు వాయిదా



27న 'నల్లగొండ' పట్టభద్రుల ఉపఎన్నిక

నోటిఫికేషన్ జారీ

9వ తేదీ దాకా నామినేషన్లు

తొలిరోజు మూడు దాఖలు

నేడు కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న నామినేషన్ 12

కాళేశ్వరం బ్యారేజీలను ఎలా కాపాడుకోవాలి?

సూచనల కోసం ఎన్‌డీఎస్‌ఏ కమిటీకి రాష్ట్ర సర్కారు వినతి 3

ఢిల్లీ మహిళా కమిషన్‌లోని 223 మంది తొలగింపు

అందరూ కాంట్రాక్టు ఉద్యోగులే

లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం 11

భర్తీ ప్రక్రియ అక్రమం అని వెల్లడి

నా తప్పుంటే జైలుకు వెళ్తా

లేదంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తారా?



క్రిశాంక్‌ను కాదు.. జైలుకు పంపాల్సింది రేవంత్‌నే

బీజేపీ కనుసన్నల్లో ఎన్నికల కమిషన్: కేటీఆర్

బడేభాయ్ బడా మోసం.. ఛోటాభాయ్ దొంగమాటలు

హైదరాబాద్ నగరంలో కరెంటు, తాగు నీటి కష్టాలు

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రోడ్ షో

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, యూసుఫ్‌గూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): "ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించి సీఎం రేవంత్ ఫేక్ నోటీసులు పోస్టుచేశారు.. ఆ తప్పును బయటపెట్టినందుకే బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌పై అక్రమ కేసు మోపి జైల్లోపెట్టారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. తాను చెప్పింది తప్పయితే చంచల్‌గూడ జైలుకైనా వెళ్తానని.. కాదంటే సీఎం రేవంత్‌రెడ్డి వెళ్తారా? అని సవాల్ విసిరారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. రేవంత్ తన ఎక్స్ ఖాతాలో ఫేక్ నోటీసును పోస్ట్ చేశారని మండిపడ్డారు. ఫోర్జరీ డాక్యుమెంటు పెట్టిన సీఎంపై

మిగతా 3వ పేజీలో...



శివమొగ్గ ఎన్నికల సభలో రాహుల్, ఖర్గే, సిద్దరామయ్య

రాహుల్‌ను ప్రధాని చేయాలని పాక్ తహతహ!

భారత్‌లో బలహీన ప్రభుత్వం

ఉండాలన్నదే శత్రుదేశం యోచన

పాకిస్థాన్ మద్దతుదారు కాంగ్రెస్

ఆ నేతల నోట ఓట్ల జిహాద్ మాట

ప్రధాని మోదీ ఆరోపణలు 11

మాస్ రేపిస్టుకు మోదీ మద్దతు

400 మంది మహిళలపై ప్రజ్వల్ అత్యాచారం

అతడికి మద్దతుగా మోదీ ప్రచారం చేశారు

అన్నీ తెలిసీ జేడీఎస్‌తో పొత్తు : రాహుల్ గాంధీ

ప్రజ్వల్‌కు లుక్ అవుట్ నోటీసు జారీ చేసిన సిట్

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ 400మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడి, వీడియోలు చిత్రీకరించాడని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గురువారం కర్ణాటకలోని

మిగతా 11వ పేజీలో...

బోధన్, ముత్యంపేట చక్కెర కర్మాగారాలకు మోక్షం

వన్‌టైం సెటిల్‌మెంట్ కింద బ్యాంకులకు పాత బకాయిల చెల్లింపు

రూ.43 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఎన్నికల తర్వాత తెరచుకోనున్న ఫ్యాక్టరీలు

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

చెరకు రైతులు, కార్మిక వర్గాల్లో హర్షం

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లుగా మూతబడి ఉన్న బోధన్, ముత్యంపేట చక్కెర పరిశ్రమలకు మోక్షం లభించనుంది. ఈ రెండు పరిశ్రమలూ లోక్‌సభ ఎన్నికల తర్వాత పునఃప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్ కింద ఉన్న బోధన్, ముత్యంపేట చక్కెర పరిశ్రమలకు

మిగతా 3వ పేజీలో...

నేటి మ్యాచ్	రాత్రి 7.30 గం. వేదిక: ముంబై
ముంబై X కోల్‌కతా	



నలుగురు స్పిన్నర్లు ఉండాల్సిందే

రోహిత్ శర్మ

ముంబై: భారత టీ20 వరల్డ్‌కప్ టీమ్‌లో నలుగురు స్పిన్నర్లను ఎంపిక చేయడాన్ని కెప్టెన్ రోహిత్ శర్మ పూర్తిగా సమర్థించుకున్నాడు. సెలెక్షన్ విషయంలో టీమిండియా మేనేజ్‌మెంట్ ఎంతో స్పష్టతతో ఉన్నట్టు చెప్పాడు. జట్టు ఎంపికపై ఎదురవుతున్న విమర్శలకు సమాధానం చెప్పేందుకు గురువారమిక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో రోహిత్‌తోపాటు సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ కూడా పాల్గొన్నాడు. 'విండీస్‌లో ఆడేందుకు నలుగురు స్పిన్నర్లు కావాల్సిందే. దానికి తగిన కారణాలు ఉన్నాయి. మాకు వెస్టిండీస్ పిచ్‌లపై ఆడిన అనుభవం ఉంది. అక్కడ ఉదయం 10 గంటలకు మ్యాచ్ ఆరంభమవుతుంది. గయానా, ఆంటిగ్వా వికెట్లు స్లో బౌలర్లకు సహకరిస్తాయ'ని రోహిత్ చెప్పాడు.

అది కఠిన నిర్ణయమే : అగార్కర్

ఫామ్‌లోలేకున్నా పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు జట్టులో చోటు కల్పించడం సరైన నిర్ణయమేనని అగార్కర్ చెప్పుకొచ్చాడు. 'ఫిట్‌నెస్ ఉంటే హార్దిక్‌కు ప్రత్యామ్నాయమే లేదు. ఓ మిడిలార్డర్ బ్యాటర్‌ను తీసుకోవడం కోసం టాప్‌లో ఆడుతున్న కేఎల్ రాహుల్‌ను పక్కనబెట్టాల్సిన పరిస్థితి. అలాగే రింకూను పక్కనబెట్టడం కఠిన నిర్ణయమే' అని అగార్కర్ అన్నాడు.

సలీమాకు పగ్గాలు

మహిళల హాకీ జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : వెటరన్ గోల్‌కీపర్ సవితా పూనియాపై వేటు పడింది. భారత మహిళల హాకీ జట్టు కెప్టెన్‌గా ఆమెను తొలగించి..మిడ్‌ఫీల్డర్ సలీమా టేటేకు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు..బెల్జియం, ఇంగ్లండ్ అంచె ప్రొ.హాకీ లీగ్‌లో తలపడే 24 మంది సభ్యుల భారత జట్టును గురువారం ప్రకటించారు. సవిత సారథ్యంలో జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. అలాగే స్వదేశంలో జరిగిన ప్రొ.లీగ్ హాకీ మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటలేకపోయింది. తెలుగమ్మాయి ఈదుల జ్యోతి (ఫార్వార్డ్) జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంది.

ఆఖరి బంతి థ్రిల్లర్

భువీ మాయతో గట్టెక్కిన హైదరాబాద్

జైస్వాల్, పరాగ్ పోరాటం వృథా

నితీశ్ కుమార్ హాఫ్ సెంచరీ



భువనేశ్వర్ (3/41)

రైజర్సే విన్నర్



నితీశ్ (76 నాటౌట్)

హైదరాబాద్: థ్రిల్లర్ సినిమాను తలపించేలా సాగిన సన్‌రైజర్స్ హైదరాబాద్-రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. భారీ ఛేదనలో రియాన్ పరాగ్ (49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 77), జైస్వాల్ (40 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 67) దూకుడుతో మ్యాచ్ రాజస్థాన్‌దే అని అంతా భావించారు. అయితే చివరి బంతికి రెండు పరుగులు కావాల్సిన వేళ పోవెల్ (27) వికెట్‌తో పేసర్ భువనేశ్వర్ ప్రత్యర్థికి గట్టి ఝలక్ ఇచ్చాడు. దీంతో ఒక్క పరుగు తేడాతో నెగ్గి సొంతగడ్డపై సన్‌రైజర్స్ ఊపిరిపీల్చుకుంది. రాజస్థాన్‌కిది రెండో ఓటమి. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 201 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (42 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్సర్లతో 76 నాటౌట్), హెడ్ (44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 58), క్లాసెన్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 42 నాటౌట్) రాణించారు. అవేశ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 200 పరుగులు చేసి ఓడింది. భువనేశ్వర్‌కు మూడు.. కమిన్స్, నటరాజన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా భువనేశ్వర్ నిలిచాడు.

ఆఖర్లో తడబాటు: స్లో పిచ్‌పై భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన రాజస్థాన్‌కు తొలి ఓవర్‌లోనే పేసర్ భువనేశ్వర్ గట్టి షాక్ ఇచ్చాడు. నాలుగు బంతుల తేడాలోనే ఓపెనర్ బట్లర్, కెప్టెన్ శాంసన్‌లను డకౌట్లుగా పెవిలియన్‌కు చేర్చాడు. ఈ స్థితిలోనూ ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఓపెనర్ జైస్వాల్, రియాన్ పరాగ్ మూడో వికెట్‌కు 134 పరుగుల భారీ భాగస్వామ్యంతో ఆర్ఆర్‌కు అండగా నిలిచారు. అయితే చివర్లో జట్టు తడబడడంతో మూల్యం చెల్లించుకుంది. మూడో ఓవర్‌లోనే పరాగ్ 4,6,4తో 15 రన్స్ అందించాడు. నాలుగో ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించిన జైస్వాల్.. తర్వాతి ఓవర్‌లోనూ 4,4,6తో చెలరేగాడు. దీంతో పవర్‌ప్లేలో స్కోరు 60/2కి చేరగా.. ఇదే జోరుకు పదో ఓవర్‌లోనే వంద రన్స్‌తో నిలిచింది. అలాగే ఇద్దరూ 11వ ఓవర్‌లోనే అర్ధసెంచరీలను సైతం పూర్తి చేసుకున్నారు. అయితే 78 బంతులపాటు సాగిన వీరి జోరుకు పేసర్ నటరాజన్ బ్రేక్ వేశాడు. స్కూప్ షాట్‌కు యత్నించిన జైస్వాల్ బౌల్డ్ అయ్యాడు. అలాగే 16వ ఓవర్‌లో కమిన్స్ మూడు పరుగులే ఇచ్చి పరాగ్‌ను అవుట్ చేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దీనికి తోడు ఓ భారీ సిక్సర్‌తో ఆకట్టుకున్న హెట్‌మయెర్ (13)ను నటరాజన్ వెనక్కి పంపాడు. 19వ ఓవర్‌లో కమిన్స్.. జురెల్ (1) అవుట్ చేయగా, పోవెల్ సిక్సర్‌తో సమీకరణం ఆరు బంతుల్లో 13 రన్స్‌కు మారి ఉత్కంఠ తారస్థాయికి చేరింది. అయితే పోవెల్ పోరాటంతో ఐదు బంతుల్లో 11 రన్స్ వచ్చాయి. ఇక చివరి బంతికి రెండు రన్స్ కావాల్సిన వేళ పోవెల్‌ను భువీ ఎల్బీ చేయడంతో రైజర్స్ సంబరాల్లో మునిగింది.

నెమ్మదిగా ఆరంభమైనా..: టాస్ గెలిచిన రైజర్స్ బ్యాటింగ్ ఎంచుకోవడంతో ఇక తొలి బంతి నుంచే విధ్వంసం ఆరంభమైనట్టే అని అంతా భావించారు. కానీ అంచనాలకు భిన్నంగా ఆరంభంలో వీరి ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగింది. మధ్య ఓవర్ల నుంచి ఆఖరి వరకు నితీశ్ కుమార్ స్ట్రోక్‌ప్లే ధాటికి రైజర్స్ భారీ స్కోరే అందుకుంది. హెడ్, క్లాసెన్ సహకరించారు. అయితే మొదట రాజస్థాన్ బౌలర్ల కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులకు ఓపెనర్లు హెడ్, అభిషేక్ తమ దూకుడును తగ్గించాల్సి వచ్చింది. దీంతో రైజర్స్ ఈ సీజన్‌లోనే పవర్‌ప్లేలో అత్యల్ప స్కోరు (37)ను నమోదు చేయడంతో పాటు అభిషేక్ (12), అన్మోల్‌ప్రీత్ (5) వికెట్లను సైతం కోల్పోయింది. పరిస్థితిని గమనించిన హెడ్, నితీశ్ వికెట్‌ను కాపాడుకునే క్రమంలో జాగ్రత్తగా ఆడారు. కానీ ఆర్ఆర్ ఆధిపత్యం తొలి ఎనిమిది ఓవర్ల పాటే సాగింది. అప్పటికి రైజర్స్ స్కోరు 48/2 మాత్రమే. ఈ దశలో నిరాశగా మ్యాచ్‌ను తిలకిస్తున్న ఉప్పల్ ఫ్యాన్స్‌కు తొమ్మిదో ఓవర్‌లో హెడ్ 6,6,4తో ఊపు తెచ్చాడు. చాహల్ వేసిన ఈ ఓవర్‌లో 18 పరుగులు వచ్చాయి. అక్కడి నుంచి రైజర్స్ లయ అందుకుంది. ఆ తర్వాత నితీశ్ కూడా గేరు మార్చి అశ్విన్, అవేశ్ ఓవర్లలో ఒక్కో సిక్సర్ బాదడంతో స్కోరులో వేగం పెరిగింది. అటు హెడ్ 37 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అలాగే ఈసారి చాహల్ మరో ఓవర్‌ను లక్ష్యంగా చేసుకున్న నితీశ్ 6,4,6,4తో ఏకంగా 21 రన్స్ రాబట్టడంతో రైజర్స్ వంద పరుగులను కూడా పూర్తి చేసింది. కానీ ఈ జోరుకు బ్రేక్ వేస్తూ 15వ ఓవర్‌లో హెడ్‌ను అవేశ్ వైడ్ యార్కర్‌తో క్లీన్‌బౌల్డ్ చేయడంతో మూడో వికెట్‌కు 96 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక 30 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన నితీశ్ మాత్రం అశ్విన్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో దూకుడును కొనసాగించాడు. అటు క్లాసెన్ కూడా జోరు పెంచి చాహల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదడంతో 17 రన్స్ వచ్చాయి. అలాగే చివరి రెండు ఓవర్లలోనూ అతడి మూడు ఫోర్లు, ఓ సిక్స్ ధాటికి 25 రన్స్ రావడంతో పాటు జట్టు స్కోరు 200 మార్క్ దాటింది.

1 ఉప్పల్ మైదానంలో మూడో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం (134) నమోదు చేసిన జైస్వాల్-పరాగ్.

1 ఒక్క పరుగు తేడాతో సన్‌రైజర్స్ గెలవడం ఐపీఎల్‌లో ఇదే తొలిసారి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	10	8	2	0	16	0.622
కోల్‌కతా	9	6	3	0	12	1.096
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
హైదరాబాద్	10	6	4	0	12	0.072
చెన్నై	10	5	5	0	10	0.627
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	10	4	6	0	8	-1.113
ముంబై	10	3	7	0	6	-0.272
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) అవేశ్ 58, అభిషేక్ (సి) జురెల్ (బి) అవేశ్ 12, అన్మోల్‌ప్రీత్ (సి) జైస్వాల్ (బి) సందీప్ 5, నితీశ్ (నాటౌట్) 76, క్లాసెన్ (నాటౌట్) 42, ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం: 20 ఓవర్లలో 201/3 ;** వికెట్లపతనం: 1-25, 2-35, 3-131; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-33-0, అశ్విన్ 4-0-36-0, అవేశ్ ఖాన్ 4-0-39-2, సందీప్ శర్మ 4-0-31-1, చాహల్ 4-0-62-0.

రాజస్థాన్: జైస్వాల్ (బి) నటరాజన్ 67, బట్లర్ (సి) యాన్సెన్ (బి) భువనేశ్వర్ 0, శాంసన్ (బి) భువనేశ్వర్ 0, పరాగ్ (సి) యాన్సెన్ (బి) కమిన్స్ 77, హెట్‌మయెర్ (సి) యాన్సెన్ (బి) నటరాజన్ 13, పావెల్ (ఎల్బీ) భువనేశ్వర్ 27, జురెల్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 1, అశ్విన్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు : 13: మొత్తం 20 ఓవర్లలో 200/7 ;** వికెట్లపతనం: 1-1, 2-1, 3-135, 4-159, 5-181, 6-182, 7-200; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-41-3, యాన్సెన్ 4-0-44-0, కమిన్స్ 4-0-34-2, నటరాజన్ 4-0-35-2, ఉనాద్కట్ 2-0-23-0, నితీశ్ 1-0-12-0, షాబాజ్ 1-0-11-0.

'అవుటాఫ్ దిస్ వరల్డ్'..



టీ 20 ప్రపంచ కప్ గీతం విడుదల

న్యూఢిల్లీ: మరో నెల రోజుల్లో పురుషుల టీ20 ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. వెస్టిండీస్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ అధికారిక గీతాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గురువారం విడుదల జేసింది. గ్రామీ అవార్డు విజేత సీన్ పాల్, సోకా సూపర్ స్టార్ కెస్ సంయుక్తంగా 'అవుటాఫ్ దిస్ వరల్డ్' పేరిట ఈ గీతాన్ని రూపొందించారు. మైఖేల్ టానో మొంటానో నిర్మాణంలో గీతం రూపొందింది. జమైకా దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్, వెస్టిండీస్ క్రికెట్ స్టార్లు క్రిస్ గేల్, శివనారాయణ్ చందర్‌పాల్, స్టెఫానీ టేలర్, అమెరికా బౌలర్ అలీ ఖాన్ ఈ అధికారిక గీతానికి సంబంధించిన వీడియోలో తళుక్కున మెరిశారు.

క్వార్టర్స్‌లో భారత జట్లకు షాక్

థామస్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్

చెంగ్డూ (చైనా): భారత పురుషుల, మహిళల జట్లు థామస్, ఉబెర్‌కప్‌ల్లో ఇంటిదారి పట్టాయి. ముఖ్యంగా పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు షాక్ తగిలింది. గురువారం జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో టీమిండియా చైనాతో పోరులో 1-3తో తడబడింది. భారీ అంచనాలున్న ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి, ధ్రువ్ కపిల-సాయి ప్రతీక్‌లు ఓడగా.. లక్ష్య సేన్ ఒక్కడే ఊరటనిచ్చాడు. కాగా, బుధవారం ఇండోనేసియాతో మ్యాచ్ ఆడడంతో భారత ఆటగాళ్లు కొంత అలసిపోగా.. ఓ రోజు విశ్రాంతి లభించడంతో చైనా ప్లేయర్లు కోర్టులో పాదరసంలా కదులుతూ పైచేయి సాధించారు.

అమ్మాయిలు పోరాడారు.. కానీ..: ఉబెర్ కప్‌లో పీవీ సింధులాంటి సీనియర్ ప్లేయర్ దూరమైనా.. అద్భుత పోరాటంతో నాకౌట్‌కు చేరినా భారత మహిళల జట్టు అదే జోరును కొనసాగించలేక పోయింది. క్వార్టర్స్‌లో భారత్ 0-3తో జపాన్ చేతిలో పోరాడి ఓడింది. తొలి సింగిల్స్‌లో అస్మిత చలీహా, రెండో మ్యాచ్‌లో ఇస్రాని బారువా ఓటమిపాలయ్యారు. ఇక డబుల్స్ మ్యాచ్‌లో కొంజెంగ్‌బమ్-శ్రుతి మిశ్రా పరాజయం పాలవడంతో టీమిండియా ఓటమి పరిపూర్ణమైంది.

మనమ్మాయిలదే సిరీస్

మూడో మ్యాచ్‌లోనూ బంగ్లా చిత్తు

సిల్హెట్: బంగ్లాదేశ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత మహిళల జట్టు మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే గెలుచుకుంది. గురువారం జరిగిన మూడో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఏడు వికెట్లతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. తొలుత బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 117/8 స్కోరు చేసింది. దిలారా అక్తర్ (39), నిగర్ సుల్తానా (28) మాత్రమే రాణించారు. రాధా యాదవ్ రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో భారత్ 18.3 ఓవర్లలో 121/3 స్కోరు చేసి నెగ్గింది. షఫాలీ వర్మ (51) హాఫ్ సెంచరీతో మెరవగా, మంధాన (47) సత్తా చాటింది.

మెస్సీ, రొనాల్డోలను వెనక్కునెట్టిన కోహ్లీ

టాప్-100లో టాప్



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ పాపులారిటీ రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా 'ది ర్యాంకర్' అనే వెబ్‌సైట్ నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌లో 2024 టాప్-100 అథ్లెట్లలో కోహ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఈ క్రమంలో సాకర్ స్టార్లు మెస్సీ రొనాల్డోను కూడా కోహ్లీ వెనక్కునెట్టాడు. రొనాల్డో రెండో స్థానంలో, మెస్సీ మూడో స్థానంలో నిలిచారు.

కోఫోర్జ్ గూటికి సిగ్నిటీ

54 శాతం వాటా కొనుగోలు.. ఒక్కో షేరుకు రూ.1,415 చెల్లింపు

జూలై-సెప్టెంబరు త్రైమాసికం నాటికి డీల్ పూర్తి

Cigniti



రెండేళ్లలో 200 కోట్ల డాలర్ల కంపెనీ..

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల కంపెనీ సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వరకు వాటాను కొనుగోలు చేయనున్నట్లు నోయిడాకు చెందిన ఐటీ సంస్థ కోఫోర్జ్ గురువారం ప్రకటించింది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో చేపట్టనున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా సిగ్నిటీకి చెందిన ఒక్కో షేరుకు రూ.1,415 చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొంది. ఈ నెల 2న బీఎస్ఈలో సిగ్నిటీ షేరు ముగింపు ధర రూ.1,372.65తో పోలిస్తే 3 శాతం అధికమిది. సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వరకు ఈక్విటీ వాటా కొనుగోలుకు కంపెనీ ప్రమోటర్లు, ఎంపిక చేసిన వాటాదారులతో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకునేందుకు అంగీకారం లభించిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కోఫోర్జ్ వెల్లడించింది. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబరు)లో ఈ డీల్ పూర్తి కావచ్చని అంచనా. ఈ ఒప్పందం పూర్తయిన అనంతరం సెబీ నిబంధనల ప్రకారంగా సిగ్నిటీ టెక్నాలజీస్.. వాటాదారుల నుంచి షేర్ల కొనుగోలు కోసం కోఫోర్జ్ ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సి ఉంటుంది. తద్వారా సిగ్నిటీలో కోఫోర్జ్ వాటా 80 శాతం వరకు పెరగనుంది.

సిగ్నిటీ టెక్నాలజీస్ కొనుగోలుతో తమ కంపెనీ 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి 200 కోట్ల డాలర్ల విలువైన కంపెనీగా ఎదిగేందుకు దోహదపడుతుందని కోఫోర్జ్ భావిస్తోంది. అంతేకాదు, సంస్థ నిర్వహణ లాభాల మార్జిన్ సైతం 1.5-2 శాతం మేర మెరుగుపడవచ్చని అంచనా వేస్తోంది. అలాగే, రిటైల్, టెక్నాలజీ, హెల్త్‌కేర్ విభాగాల్లోకి విస్తరించడంతోపాటు ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్యం, పశ్చిమ యూఎస్ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఈ డీల్ దోహదపడనుంది.

రూ.2,100 కోట్ల సమీకరణ

కాగా కోఫోర్జ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ కోఫోర్జ్ పీటీఈ లిమిటెడ్.. 25 కోట్ల డాలర్ల రుణాల (సుమారు రూ.2,100 కోట్లు)ను సమీకరించేందుకు గాను హాంకాంగ్ అండ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, గిఫ్ట్ సిటీ బ్రాంచీతో ఒప్పందం కుదుర్చుకుంది. సిగ్నిటీ కొనుగోలు కోసం కంపెనీ ఈ మొత్తాలను వినియోగించనుంది.

డీల్‌కు సిగ్నిటీ బోర్డు ఓకే

కోఫోర్జ్‌కు 54 శాతం వాటాలను విక్రయించేందుకు గాను గురువారం నాడు సిగ్నిటీ టెక్నాలజీ బోర్డు ఆమోదం తెలిపింది. కంపెనీ ప్రమోటర్లు చక్కిలం వెంకట సుబ్రమణ్యం, రాజేశ్వరి చక్కిలం, చక్కిలం శ్రీకాంత్, పెన్నం సుధాకర్, సప్న పెన్నం ఈ మేరకు ఆమోదం తెలిపినట్లు బోర్డు పేర్కొంది. డీల్‌లో భాగంగా కంపెనీ ప్రమోటర్లు 32.47 శాతం వరకు ఈక్విటీని కోఫోర్జ్‌కు విక్రయించనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 32.77 శాతం వరకు ఉంది. కాగా 1998 సెప్టెంబరులో కార్యకలాపాలు ప్రారంభించిన సిగ్నిటీ టెక్నాలజీస్.. అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), ఆస్ట్రేలియా, కెనడా, చెక్ రిపబ్లిక్, దక్షిణాఫ్రికా,సింగపూర్ మార్కెట్లకు డిజిటల్ అస్యూరెన్స్, ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, క్వాలిటీ ఇంజనీరింగ్ సేవలందిస్తోంది.

కోఫోర్జ్ లాభంలో 95% వృద్ధి

ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికానికి (క్యూ4) కోఫోర్జ్ కన్సాలిడేటెడ్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 95 శాతం వృద్ధితో రూ.223.7 కోట్లకు చేరుకుంది. ఆదాయం 8.68 శాతం పెరిగి రూ.2,358.5 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ లాభం 16.46 శాతం వృద్ధితో రూ.808 కోట్లకు, ఆదాయం 14.52 శాతం పెరుగుదలతో రూ.9,179 కోట్లకు చేరుకుంది. ఈ మార్చి 31 నాటికి కోఫోర్జ్ ఉద్యోగుల సంఖ్య 24,726కు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను కోఫోర్జ్ వాటాదారులకు రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.19 డివిడెండ్‌ను ప్రకటించింది.

సిగ్నిటీ లాభంలో క్షీణత

క్యూ4లో సిగ్నిటీ టెక్నాలజీస్ లాభం దాదాపు 45 శాతం క్షీణించి రూ.27.14 కోట్లకు పరిమితం కాగా.. విక్రయాలు మాత్రం 7.22 శాతం పెరిగి రూ.455.64 కోట్లకు చేరుకున్నా యి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం 1.62 శాతం తగ్గి రూ. 165.59 కోట్లకు చేరుకోగా, అమ్మకాలు 10.16 శాతం పెరుగుదలతో రూ. 1,815.01 కోట్లుగా నమోదయ్యాయి.

బిజినెస్

ఇక విశ్లేషకులపై స్టాక్ ఎక్స్ఛేంజీల పర్యవేక్షణ

న్యూఢిల్లీ: రీసెర్చ్ అనలిస్టులు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లపై నియంత్రణ, పర్యవేక్షణకు సంబంధించిన నిబంధనావళిని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ప్రకటించింది. దీని కింద అనలిస్టులు, అడ్వైజర్ల పర్యవేక్షణకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అధికారం ఇస్తారు. స్టాక్ ఎక్స్ఛేంజీలకు రీసెర్చ్ అనలిస్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఆర్ఏఏఎస్‌బీ), ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఐఏఏఎస్‌బీ) పేరిట గుర్తింపు ఇస్తారు. ఈ గుర్తింపు సాధించాలంటే సంబంధిత ఎక్స్ఛేంజీ 15 సంవత్సరాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నదై ఉండాలి. అలాగే కనీస నికర విలువ రూ.200 కోట్లు కలిగి ఉండి, దేశవ్యాప్తంగా 20 నగరాల్లో టెర్మినల్స్, ఇన్వెస్టర్ సర్వీస్ సెంటర్లు నిర్వహిస్తూ ఉండాలి. అలాగే భౌతికంగా ఫిర్యాదుల పరిష్కార విభాగం, ఆన్‌లైన్‌లో వివాదాల పరిష్కార విభాగం నిర్వహిస్తూ ఉండాలి.

మార్కెట్‌కు జీఎస్‌టీ జోష్

128 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ఏప్రిల్ నెల జీఎస్‌టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయిని దాటడంతో పాటు తయారీ రంగం పనితీరు ఆశాజనకంగా ఉండటం స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం నింపింది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. దీంతో గురువారం సెన్సెక్స్ ఒకదశలో 330 పాయింట్ల వరకు పెరిగి 74,812 స్థాయికి ఎగబాకింది. చివరికి 128.33 పాయింట్ల లాభంతో 74,611.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43.35 పాయింట్ల వృద్ధితో 22,648.20 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 లాభపడ్డాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి 83.46 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ రేటు 0.91 శాతం పెరిగి 84.20 డాలర్ల వద్ద ట్రేడైంది.

మిశ్రమంగాముగిసిన గోద్రెజ్ షేర్లు: దేశంలోని ప్రముఖ వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన గోద్రెజ్ గ్రూప్ ఆస్తుల విభజన నేపథ్యంలో ఈ గ్రూప్ కంపెనీల షేర్లు మిశ్రమంగా ముగిశాయి. గోద్రెజ్ ఇండస్ట్రీస్ 7 శాతానికి పైగా క్షీణించగా.. గోద్రెజ్ ప్రాపర్టీస్ 4.37 శాతం, ఆస్టెక్ లైఫ్‌సైన్సెస్ 2.92 శాతం నష్టపోయాయి. కాగా, గోద్రెజ్ ఆగ్రోవెట్ షేరు దాదాపు 4 శాతం, గోద్రెజ్ కన్స్యూమర్ 1.11 శాతం పుంజుకున్నాయి.

ఆధార్ హౌసింగ్ ఇష్యూ ధర రూ.300-315

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈనెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.300-315గా నిర్ణయించింది. తద్వారా రూ.3,000 కోట్ల వరకు సమీకరించనుంది. ఐపీఓ ద్వారా ఈ సంస్థ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లకు చెందిన రూ.2,000 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

- ట్రావెల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ టీబీఓ టెక్ లిమిటెడ్ ఐపీఓ సైతం ఈ నెల 8న ప్రారంభమై 10న ముగియనుంది. ఐపీఓ ద్వారా సంస్థ రూ.1,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సంస్థ రూ.400 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన రూ.600 కోట్ల విలువైన 1.25 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.
- వాహన, వ్యాపార రుణాలందించే ఎస్‌కే ఫైనాన్స్ ఐపీఓకు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.2,200 కోట్లు సేకరించాలని సంస్థ భావిస్తోంది.

సైయెంట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్‌కు వాటా

సైయెంట్ లిమిటెడ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ 1.02 శాతానికి సమానమైన 11.33 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ షేర్లను రూ.204.10 కోట్లతో కొనుగోలు చేసినట్లు బల్క్‌డీల్ గణాంకాలు వెల్లడించాయి. సగటున ఒక్కో షేరును రూ.1,800కు ఈ మ్యూచువల్ ఫండ్ సంస్థ కొనుగోలు చేసింది. తాజా వాటా కొనుగోలుతో సైయెంట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ వాటా 1.08 శాతం నుంచి 2.1 శాతానికి పెరిగింది. గురువారం బీఎస్ఈలో సైయెంట్ షేరు 0.67 శాతం నష్టంతో రూ.1,794.30 వద్ద క్లోజైంది.

తగ్గిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం

ఎయిర్‌పోర్టుల నుంచి డేటా సెంటర్ల వరకు విభిన్న రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభం మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 37 శాతం క్షీణించి రూ.450.58 కోట్లకు పరిమితమైంది. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌పై రూ.627 కోట్ల బకాయిని ఏకకాలంలో చెల్లించడంతో పాటు కమర్షియల్ మైనింగ్‌లో ఏర్పడిన నష్టాలు లాభాన్ని ప్రభావితం చేసినట్టు కంపెనీ తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.722.48 కోట్లు కాగా మూడో త్రైమాసిక లాభం రూ.188.45 కోట్లుంది. న్యూ ఎనర్జీ, విమానాశ్రయ వ్యాపారాల్లో మంచి వృద్ధి నమోదైనా కమర్షియల్ మైనింగ్ విభాగం రూ.201.83 కోట్లు నష్టం నమోదు చేసింది. ఇదిలా ఉండగా 2030 నాటికి దేశంలో 1 గిగావాట్ సామర్థ్యం గల 9 డేటా సెంటర్లు కంపెనీ ఏర్పాటు చేయనుంది. ఎడ్జ్ కనెక్స్ జాయింట్ వెంచర్‌లో చెన్నై డేటా సెంటర్ ప్రస్తుతం పని చేస్తుండగా నోయిడా, హైదరాబాద్ డేటా సెంటర్ల నిర్మాణం 81-88 శాతం పూర్తయినట్టు కంపెనీ ప్రకటించింది.

హైదరాబాద్‌లో అవీవా ఎక్స్‌పీరియన్స్ సెంటర్


హైదరాబాద్: ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో కీలకంగా ఉన్న అవీవా.. హైదరాబాద్‌లో కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. కంపెనీకిది ఆరో సెంటర్. ప్రస్తుతం కంపెనీ ప్రపంచవ్యాప్తంగా ఐదు టెక్నాలజీ హబ్స్‌ను నిర్వహిస్తోంది. కంపెనీకి చెందిన ఈ అడ్వాన్స్‌డ్ ఆర్ అండ్ డీ ల్యాబ్స్‌లో 1,200కు పైగా టెక్నాలజిస్టులు పనిచేస్తున్నారు. అవీవా గ్లోబల్ వ్యాపారంలో భారత్ చాలా కీలకంగా ఉందని, ఇందులో హైదరాబాద్, బెంగళూరు నగరాల పాత్ర ఎంతో ముఖ్యమైనదని సంస్థ సీఈఓ సు క్వెన్స్ అన్నారు. హైదరాబాద్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఇండస్ట్రియల్ ఆర్ అండ్ డీ సహా భవిష్యత్ వ్యాపార అవసరాల కోసం డిజిటల్ ఇన్నోవేషన్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కోల్ ఇండియా లాభం రూ.8,682 కోట్లు

ప్రభుత్వ రంగంలోని మహారత్న కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.8,682 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.6,875.07 కోట్లతో పోల్చితే ఇది 26.2 శాతం అధికం. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం రూ.40,371.51 కోట్ల నుంచి రూ.39,654.50 కోట్లకు దిగజారింది. దేశంలోని బొగ్గు ఉత్పత్తిలో కోల్ ఇండియా వాటా 80 శాతం ఉంది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.37,369 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

డివిడెండ్: కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.5 తుది డివిడెండ్‌కు సిఫారసు చేసింది. ఇప్పటికే చెల్లించిన మధ్యంతర డివిడెండ్ రూ.20.50కి ఇది అదనం. అంటే ఒక్కో షేరు ముఖవిలువపై 255 శాతం (రూ.25.50) డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. కాగా ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కోల్ ఇండియా కేంద్ర ఖజానాకు, తాను కార్యకలాపాలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాలకు రూ.60,140 కోట్లు చెల్లించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,270 ▼	66,250 ▼	87,000 ▼
ముంబై	71,327	65,336	79,719

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	440
వరంగల్	427	గోదావరి	440
చిత్తూరు	494	విశాఖపట్నం	450
		దజను గుడ్లు రూ.48	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	గోదావరి	137
వరంగల్	129	విజయవాడ	137
కరీంనగర్	129	గుంటూరు	137
మహబూబ్‌నగర్	129	ఒంగోలు	137
కర్నూలు	129	చిత్తూరు	127
విశాఖపట్నం	129		

బోధన్, ముత్యంపేట చక్కెర కర్మాగారాలకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)




ఉన్న పాత బకాయిలను బ్యాంకర్లకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తామని ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు బ్యాంకులు అంగీకారం తెలిపాయి. దీంతో బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం రూ.43కోట్ల మేర నిధులు కూడా విడుదల చేసింది. చెల్లింపులు పూర్తి కాగానే ఫ్యాక్టరీలు తెరుచుకుంటాయి. ఇదే జరిగితే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి రైతులకిచ్చిన హామీ నెరవేరినట్టే. సెప్టెంబర్ 17లోగా చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్ ఇటీవల కూడా చెప్పారు.

ప్రభుత్వం ఏర్పడగానే కేబినెట్ సబ్ కమిటీ..

బోధన్, ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీలు 2015 డిసెంబర్ 8న మూతపడ్డాయి. ఈ పరిశ్రమలను పునఃప్రారంభించాలనే డిమాండ్‌తో ఆ ప్రాంత రైతులు ఎన్నో పోరాటాలు చేశారు. కానీ, గత ప్రభుత్వం ఈ పరిశ్రమల అంశంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకుంటామని మాజీ సీఎం కేసీఆర్ 2014 ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. కానీ, ఆయన అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, కో ఆపరేటివ్ విధానంలో ఫ్యాక్టరీలను నడుపుతామంటూ 2015, ఏప్రిల్‌లో విడుదల చేసిన ఉత్తర్వులను పక్కనబెట్టారు. ఇక, గతేడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో పాదయాత్ర చేసిన రేవంత్ రెడ్డి.. ముత్యంపేటలో ఒకరోజు రాత్రి బస చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చక్కెర పరిశ్రమలను పునరుద్ధరిస్తామని ఆ సమయంలో చెరుకు రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి.. పరిశ్రమల పునరుద్ధరణ నిమిత్తం ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన 2024 జనవరిలో మంత్రివర్గ ఉపసంఘాన్ని(కేబినెట్ సబ్ కమిటీ) నియమించారు. పలు చర్చల అనంతరం ఆర్థిక ఇబ్బందులు, పాత బకాయిలే బోధన్, ముత్యంపేట చక్కెర కర్మాగారాలకు ప్రధాన సమస్యలని ఆ కమిటీ తేల్చింది. దీంతో బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం సిద్ధం కావడంతో ఫ్యాక్టరీల పునరుద్ధరణకు అడుగులు పడ్డాయి. ఈ పరిశ్రమలు అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి లభించనుంది. ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టరీల పునరుద్ధరణకు ప్రభుత్వం చూపిన చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిక్కని చిరుత

- ఇప్పటికీ ఎయిర్‌పోర్టు పరిసరాల్లోనే..
- కొనసాగుతున్న గస్తీ ఆపరేషన్


కెమెరాలకు చిక్కిన చిరుత

హైదరాబాద్, శంషాబాద్ రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓ చిరుత పులి ఐదు రోజుల నుంచి అటవీశాఖ అధికారులకు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. అది ఎవరిపై ఎప్పుడు దాడి చేస్తుందోనని స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాల్లోకి గత నెల 28 తెల్లవారుజామున ఓ చిరుత వచ్చినట్లు అధికారులు గుర్తించారు. చిరుతను పట్టుకునేందుకు మంగళవారం నుంచి అధికారులు గస్తీ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. చిరుత ఆచూకీ తెలుసుకునేందుకు అధికారులు ఎయిర్‌పోర్ట్ పరిసర ప్రాంతాల్లో 25 అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుతను పట్టుకునేందుకు మేకలను ఎరగా వేసి 5 బోన్లను ఏర్పాటు చేశామని, బుధవారం మేక కోసం చిరుత బోన్ దగ్గరకు వెళ్లినా దానిపై దాడి చేయలేదని అధికారులు తెలిపారు. అయితే, చివరి యత్నంగా ప్రత్యేక బృందాలతో ట్రాంక్విలైజర్ ఇంజక్షన్లతో చిరుతను బంధిస్తామని పేర్కొన్నారు.

కాళేశ్వరం బ్యారేజీలను ఎలా కాపాడుకోవాలి?

- ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీకి తెలంగాణ లేఖ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కాపాడుకోవడానికి ఏయే చర్యలు తీసుకోవాలో తగిన సిఫారసులు/సూచనలు చేయాలని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీని తెలంగాణ కోరింది. వర్షాకాలానికి ముందే బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని నివేదించింది. ఈ మేరకు ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్‌కు తెలంగాణ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ లేఖ రాశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు సంబంధించిన ప్రాథమిక డేటాతో పాటు మేడిగడ్డలోని 6, 7, 8 బ్లాక్‌లకు సంబంధించిన ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్(ఈఆర్‌టీ)తో పాటు గ్రౌండ్ పినట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరీక్షల నివేదికలను కూడా అందించినట్లు గుర్తుచేశారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో) కూడా బ్యారేజీల రక్షణ కోసం సూచనలు చేయాలని లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఈ నెలలోనే గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉండటంతో బ్యారేజీల పునరుద్ధరణకు తగిన సిఫారసులు చేయాలని కోరారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా.. ఆ వెనువెంటనే అన్నారం, సుందిళ్లలో సీపేజీలు బయటపడ్డాయి. అయితే ప్రధానంగా సుందిళ్లలో సమస్య తీవ్రత తక్కువ ఉండగా.. అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలే డేంజర్ జోన్‌లో ఉన్నాయి. ఈ బ్యారేజీల్లో నీటి నిల్వలు తగ్గించుకోవాలని ఎన్‌డీఎస్‌ఏ గతేడాది అక్టోబరులో సూచించడంతో ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. ఇక బ్యారేజీల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఇటీవల జ్యుడీషియల్ విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ తెలంగాణ సర్కారుకు సూచనలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎన్‌డీఎస్‌ఏకు ప్రభుత్వం లేఖ రాసింది.

'ఇండిగో' ప్రయాణికుల ఆందోళన

- 25 నిమిషాల ముందే గేటు మూసివేశారని ఆగ్రహం

శంషాబాద్ రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఎయిర్‌పోర్టు నుంచి గురువారం తెల్లవారుజామున ఇండిగో విమానం అమెరికాకు వెళ్లేందుకు సిద్ధమైంది. అయితే, 25 నిమిషాల ముందే బోర్డింగ్ గేటు మూసివేశారని ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ప్రయాణికులు సమయానికి రాకుంటే గేటు వేస్తారని, ఇచ్చిన సమయానికి తప్పకుండా రావాల్సిందేనని ఎయిర్‌లైన్స్ అధికారులు చెబుతున్నారు. ఎవరికీ ఎలాంటి నష్టం చేయాలని తమ సంస్థ కోరుకోదని ఎయిర్‌లైన్స్ అధికారులు చెబుతున్నారు. సమయానికి రాలేకపోయిన ప్రయాణికులను మరో విమానంలో తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై జీఎంఆర్ అధికారులను వివరణ కోరగా అలాంటి ఘటన జరగలేదని చెప్పారు.

జీతాలకు డబ్బుల్లేవు.. దయచేసి నిధులివ్వండి

- తెలంగాణకు కృష్ణా బోర్డు లేఖ

హైదరాబాద్, మే 2(ఆంధ్రజ్యోతి): నిధులు లేక కృష్ణా బోర్డు నిర్వహణ కనాకష్టంగా మారింది. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దాంతో బోర్డు ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని, నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) కోరింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు కేఆర్ఎంబీ సభ్యకార్యదర్శి డీఎం రాయిపూరే లేఖ రాశారు. ఏపీపునర్వ్యవస్థీకరణ చట్టం- 2014లోని సెక్షన్-86(2) ప్రకారం బోర్డు నిర్వహణకు నిధులు సమకూర్చడం తెలుగు రాష్ట్రాల బాధ్యత అని లేఖలో గుర్తు చేశారు.

'కవ్వాల్' నుంచి పల్లెల తరలింపు

- 94 కుటుంబాలకు పునరావాసం: పీసీసీఎఫ్ డోబ్రియాల్

కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి మైసంపేట్, రాంపూర్ గ్రామాల తరలింపు ప్రక్రియ పూర్తయిందని అటవీ సంరక్షణ ప్రధానాధికారి (పీసీసీఎఫ్) ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. ఆ గ్రామాలకు చెందిన 94 కుటుంబాలను పునరావాసం కల్పించినట్లు చెప్పారు. మొదటి ప్రతిపాదనగా ఒక్కో కుటుంబానికి ఏకమొత్తంగా రూ.15 లక్షల పరిహారం అందించాలని అటవీ శాఖ నిర్ణయించగా దీనికి 48 కుటుంబాలు అంగీకరించి పరిహారం స్వీకరిస్తున్నాయి. ఇక రెండో ప్రతిపాదనకు అంగీకరించిన 94 కుంటుంబాలకు అవే రూ.15 లక్షల పరిహారంలో భాగంగా ఒక ఇంటి నిర్మాణంతో పాటు వ్యవసాయ భూమిని అందించేందుకు అటవీశాఖ అక్కడి గిరిజనులను ఒప్పించింది. ఈ రెండు గ్రామాల్లో 142 కుటుంబాలను పునరావాసం కోసం ఎంపిక చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.14.2 కోట్లు మంజూరు చేసింది.

కవిత బెయిల్ పిటిషన్‌పై
తీర్పు 6కు వాయిదా



న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. సీబీఐ, ఈడీ తనను అక్రమంగా అరెస్టు చేశాయని, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత వేర్వేరుగా బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐ కేసులో గత నెల 22న విచారణ జరిపిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును ఈ నెల 2వ తేదీకి రిజర్వ్ చేసింది. మనీలాండరింగ్ కేసులో మాత్రం తీర్పును ఈ నెల 6వ తేదీకి రిజర్వ్ చేసింది. సీబీఐ కేసులో గురువారం క్లారిటీ వస్తుందని భావించగా, న్యాయస్థానం మరోసారి తీర్పును వాయిదా వేసింది. ఈడీ కేసులో బెయిల్ పిటిషన్‌పై తీర్పు రోజునే (ఈ నెల 6వ తేదీ)సీబీఐ కేసులోనూ బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఇవ్వనున్నట్టు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ కావేరి బవేజా స్పష్టం చేశారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదని, కవిత మహిళ కాబట్టి పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం బెయిల్‌కు అర్హురాలని ఆమె తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, మరో న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. కుంభకోణంలో కవితదే కీలక పాత్ర అని, ఆమెకు సమాజంలో పలుకుబడి ఉందని, బెయిల్‌పై బయటికొస్తే సాక్షులను బెదిరిస్తారని, సాక్ష్యాలను ధ్వంసం చేస్తారని సీబీఐ, ఈడీ తరఫున న్యాయవాదులు వాదించారు. కవితను ఈడీ మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్టు చేసింది. 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచింది. 10 రోజుల పాటు ఈడీ కస్టడీలోకి తీసుకుని విచారించింది. ఆ తర్వాత జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో మార్చి 26న కవితను తిహాడ్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఆమె జైలులోనే ఉన్నారు. కవిత జైలులో ఉండగానే సీబీఐ విచారించింది. ఆ తర్వాత అరెస్టు చేసినట్టు ప్రకటించింది. కోర్టు అనుమతితో మూడు రోజులు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించింది. ఈ నెల 7వ తేదీతో కవిత జ్యుడీషియల్ రిమాండ్ ముగియనుంది.

నా తప్పుంటే జైలుకు వెళ్తా!

(మొదటి పేజీ తరువాయి)


జూబ్లీహిల్స్ రోడ్ షోలో ప్రసంగిస్తున్న కేటీఆర్, పక్కన సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్

కేసు పెట్టాలన్నారు. తప్పు చేసింది సీఎం అయితే... తమ పార్టీ నాయకుడు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టడం సరికాదన్నారు. 2023లో ఇచ్చిన నిజమైన నోటీసు ఓయూ విద్యార్థుల వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొట్టిందని.. ప్రభుత్వం తప్పులను సోషల్ మీడియాలో బయట పెడుతున్నందుకే క్రిశాంక్ మీద కక్షగట్టి అరెస్ట్ చేశారని మండిపడ్డారు. క్రిశాంక్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక.. మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలు చేస్తున్న ప్రధాని మోదీపై చర్యలు తీసుకునే ధైర్యం ఎన్నికల సంఘానికి లేదని.. అందుకే ఆయనకు బదులుగా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు నోటీసులిచ్చిందని.. కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ కనుసన్నల్లో నడుస్తోందని, అందుకే మోదీ, అమిత్‌షా, రేవంత్ దారుణమైన వ్యాఖ్యలు చేసినా చర్యలు చేపట్టడంలేదని, తమ పార్టీ అధినేతకు మాత్రం రెండురోజులు ఎన్నికల ప్రచారాన్ని నిషేధించిందని విమర్శించారు. నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడుతూ, ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న సీఎం రేవంత్‌పై కూడా చర్యలు చేపట్టడంలో ఈసీ ఎందుకు వెనుకంజ వేస్తోందని ఆయన ప్రశ్నించారు. వారిపై చర్యలు తీసుకోని ఎన్నికల కమిషన్ కేసీఆర్ విషయంలో మాత్రం.. ఆగమేఘాల మీద నోటీసులు ఇచ్చిందని మండిపడ్డారు. రేవంత్‌పై తాము 21కి పైగా ఫిర్యాదులు చేసినా ఈసీ పట్టించుకోలేదని ఆగ్రహం వెలిబుచ్చారు. "తుక్కుగూడ సభలో ఆయన మాట్లాడిన దుర్మార్గపు మాటలు నీతి సూక్తులు, ప్రవచనాలు, సుభాషితాలా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. రాజ్యాంగం ఇచ్చిన స్వయం ప్రతిపత్తిని అపహాస్యం చేసేలా ఈసీ వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల సంఘానికి వెన్నెముక ఉంటే మోదీకి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ పాలనలో చచ్చేదిన్

సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి టీ పద్మారావు గౌడ్‌కు మద్దతుగా గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం చేసిన కేటీఆర్.. అబద్ధపు హామీలతో 2014లో కేంద్రంలో బడే భాయ్ మోదీ అధికారంలోకి వస్తే.. ప్రజలను మోసం చేసి ఇక్కడ ఛోటా భాయ్ గెలిచాడన్నారు. "అచ్చేదిన్ కాదు.. బీజేపీ, కాంగ్రెస్ పాలనలో చచ్చేదిన్ వచ్చాయ"న్నారు. రేవంత్ రాహుల్ బాటలో కాక.. మోదీ బాటలో నడుస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ ఉన్నన్నాళ్లు లేని కరెంట్ కష్టాలు, మంచినీటి గోస ఇప్పుడు మొదలైందని, పదేళ్లు కనిపించని ట్యాంకర్లు నగరంలో ఇప్పుడు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. 10-12 ఎంపీ సీట్లు బీఆర్ఎస్‌కు ఇస్తే.. ఏడాదిలో రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులపై కేటీఆర్ విమర్శనాస్త్రాలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ కండువాతో గెలిచిన దానం నాగేందర్ ఇప్పుడు సిగ్గులేకుండా కాంగ్రెస్ కండువా కప్పుకొని వస్తున్నారని, రేపు ఎన్నికల్లో గెలిస్తే బీజేపీ కండువా కప్పుకోడన్న గ్యారంటీ ఏంటని ప్రశ్నించారు. రేవంత్‌తోపాటు కమలం పార్టీలో చేరే వారిలో ముందు వరుసలో నాగేందర్ ఉంటారన్నారు. "కిషన్ రెడ్డి నయాపైసా పని హైదరాబాద్‌కు చేయలేదు. వరదలు వస్తే రూపాయి సాయం తీసుకురాలేదు. మెట్రోకు పైసా నిధులు తీసుకురాలేదు. అక్కరకు రాని చుట్టం లాంటి బీజేపీని, కిషన్‌రెడ్డిని ఓడించాలి" అని నిప్పులు చెరిగారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

వడ దడ

(మొదటి పేజీ తరువాయి)


ఎండల తీవ్రతకు మిర్యాలగూడలో పగిలిన సీసీరోడ్డు

నల్లగొండ జిల్లా కేతేపల్లి, చందంపేట, మాడ్గులపల్లిలో 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. సూర్యాపేట జిల్లా మట్టపల్లిలో 46.1, నల్లగొండ జిల్లా, త్రిపురారం, మునుగోడు, పెద్దవూర, నల్లగొండ, కట్టంగూరు, పెద్దపల్లి జిల్లా వీణవంకలో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లా పమ్మిలో 45.8, జనగామలో 45.6, రాజన్నసిరిసిల్ల జిల్లా సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడురు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 45.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కుమరం భీం జిల్లా తిర్యాణిలో 45.4 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారామపట్నం, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో 45.3, హనుమకొండ, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 45.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిధి కాప్రా నాచారంలో అత్యధికంగా 43.6 నమోదవ్వగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసరలో 44.3, వికారాబాద్ జిల్లా పుట్టపహాడ్‌లో 44.3, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 వరకు, జీహెచ్ఎంసీ పరిధిలో 43 డిగ్రీలు ఉండవచ్చని టీఎస్‌డీపీఎస్ పేర్కొంది. మరోవైపు, హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించిన గరిష్ఠ ఉష్ణోగ్రతలకు టీఎస్‌డీపీఎస్ లెక్కలకు తేడా ఉంది. రాష్ట్రంలో గురువారం ఖమ్మంలో 45 డిగ్రీలు, భద్రాచలం 44.2, నిజామాబాద్, రామగుండంలో 44, నల్లగొండలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

నాలుగు రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక

తెలంగాణలో ఉష్ణోగ్రతలు ఇటీవల ఒక్కసారి పెరిగిపోయాయని భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) శాస్త్రవేత్త డాక్టర్ ఏ శ్రావణి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 15 జిల్లాల్లో శుక్ర, శని వారాల్లో వడగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. మరోవైపు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు రెడ్ అలర్ట్ ప్రకటిస్తూ ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో గురువారం సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన జిల్లాల్లో ఖమ్మం ప్రథమ స్థానంలో ఉంది. ఖమ్మం జిల్లాలో సాధారణం కంటే ఏకంగా 5.1 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. కొత్తగూడెం, హైదరాబాద్‌లో 3.1-5, హన్మకొండ, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రామగుండంలో 1.6-3డిగ్రీలు సాధారణం కంటే పెరిగాయని విశ్లేషించింది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలో సాధారణంతో పోలిస్తే 1.5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది.

మిర్యాలగూడలో సీసీ రోడ్డుకు పగుళ్లు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రతకు స్థానిక సీతారాంపురం కాలనీలోని సీసీ రోడ్డు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్క సారిగా పగిలిపోయింది. రెండు అడుగుల మేర రోడ్డు పగిలి పెచ్చులు పైకి లేచాయి.

వడదెబ్బతో ఆరుగురి మృతి

ఎండల తీవ్రతతో వడదెబ్బకు గురై రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఆరుగురు గురువారం ప్రాణాలు కోల్పోయారు. నల్లగొండ జిల్లా తిప్పలమ్మగూడెంనకు చెందిన తోటజాన్ రెడ్డి(60) , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చింతగుప్పకు చెందిన తోడెం వెంకటేష్(28), కరీంనగర్ జిల్లా లింగాపూర్‌కు చెందిన గజ్జెల సంజీవ్(48), ఆసిఫాబాద్ జిల్లా గబ్బాయి గ్రామానికి చెందిన పొరిశెట్టి శ్రీనివాస్(47), కామారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన నీరడి ఎల్లవ్వ(50), మెదక్ జిల్లా కొల్చారం గ్రామానికి చెందిన కుమ్మరి శాఖయ్య(48) వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయారు.

భూసేకరణకు నిధులిస్తాం..
ఎన్‌వోసీ ఇవ్వండి

- తుపాకులగూడెం బ్యారేజీ పనులపై ఛత్తీస్‌గఢ్‌కు తెలంగాణ లేఖ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై ములుగు జిల్లాలో నిర్మాణంలోఉన్న తుపాకులగూడెం(సమ్మక్క సాగర్)బ్యారేజీ కింద ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సముఖత వ్యక్తం చేసింది. భూసేకరణ చట్టం-2013 ప్రకారం పరిహారం ఇస్తామని, ఆ నిధులను బీజాపూర్ జాయింట్ కలెక్టర్ వద్ద జమ చేస్తామని, బ్యారేజీకి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాలని ఛత్తీస్‌గఢ్‌ను కోరింది. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ కార్యదర్శికి తెలంగాణ నీటిపారుదల కార్యదర్శి రాహుల్‌బొజ్జా ఓ లేఖ రాశారు. సమ్మక్కసాగర్ బ్యారేజీ పూర్తిస్థాయి నీటి మట్టం 83 మీటర్లు కాగా.. అక్కడి దాకా ముంపునకు గురయ్యే భూములకే పరిహారం చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ఛత్తీస్‌గడ్ వద్ద ప్రతిపాదనలు పెట్టింది. అయితే, 2022 జూలై 17. 19 తేదీల్లో బ్యారేజీ వద్ద గరిష్ఠ వరద 88 మీటర్ల దాకా నమోదైందని, ఆ మేరకు ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించాలని ఛత్తీస్‌గడ్ చాలాకాలంగా పట్టుబడుతోంది. ఇందులో భాగంగా తుపాకులగూడెం బ్యారేజీకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వవద్దని, ఆ బ్యారేజీ వల్ల తమ భూభాగంలో ముంపు సమస్య తీవ్రంగా ఉంటుందని కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కి ఛత్తీస్‌గఢ్ గతంలో ఫిర్యాదు చేసింది. ఈ బ్యారేజీకి అనుమతి కోరుతూ 2021 సెప్టెంబరులో తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్ దాఖలు చేయగా సీడబ్ల్యూసీలోని అన్ని విభాగాల అనుమతులు లభించినా ఛత్తీస్‌గఢ్ చేసిన ఫిర్యాదు వల్ల డీపీఆర్ ముందుకు కదల్లేదు. పైగా, ఛత్తీస్‌గఢ్ లేవనెత్తిన అభ్యంతరాలన్నీ తీర్చిన తర్వాత ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ తీసుకుని సమర్పించాలని సీడబ్ల్యూసీ తెలంగాణకు పలుమార్లు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ తాజాగా రాసిన లేఖకు ఛత్తీస్‌గఢ్ ఎలా స్పందిస్తుందో చూడాలి. కాగా, రూ.9257 కోట్లతో చేపట్టిన తుపాకులగూడెం బ్యారేజీ పనులు 95 శాతం మేర పూర్తయ్యాయి. ఈ బ్యారేజీలో నీటిని నిల్వ చేసి బ్యాక్‌వాటర్‌ను దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా పూర్వ ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలకు నీళ్లు ఇవ్వనున్నారు.

40% ఫిట్‌మెంట్‌తో
మెరుగైన పీఆర్సీ ఇవ్వాలి

- పీఆర్సీ చైర్మన్‌కు ట్రెసా విజ్ఞప్తి

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు 40శాతం ఫిట్‌మెంట్‌తో మెరుగైన పీఆర్సీ అమలు చేయాలని వేతన సవరణ కమిటీ (పీఆర్సీ) చైర్మన్ శివశంకర్‌ను ట్రెసా ప్రతినిధి బృందం కోరింది. గురువారం బీఆర్‌కే భవన్‌లో పీఆర్సీ కమిటీతో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ ఇతర ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలోని ఉద్యోగుల సమస్యలను ఆ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. 'గ్రూప్-2 ద్వారా ఎగ్జిక్యూటివ్ పోస్టులో ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్‌తో పోలిస్తే నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులో ఎంపికైన ఏఎస్‌ఓలకు పదోన్నతిలో తేడాలున్నాయి. వీటిపై అధ్యయనం చేసి సవరించాలి' అని విజ్ఞప్తి చేశారు. వీటిపై పీఆర్సీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని.. ప్రభుత్వానికి సిఫార్సు చేసి పరిష్కరిస్తామని హామీనిచ్చారని ట్రెసా ప్రతినిధులు వెల్లడించారు.

అనారోగ్యంతో ఉన్న విద్యార్థినికి
'నీట్'లో ప్రత్యేక వెసులుబాటు

- మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, మే 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ నీట్ పరీక్షకు హాజరుకానున్న ఓ విద్యార్థినికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాను, మూత్రవిసర్జనను నియంత్రించలేని స్థితిలో ఉన్నానని, అందువల్ల తప్పనిసరిగా డైపర్ ధరించాల్సివుండడంతో పాటు మాటిమాటికీ డైపర్ మార్చాల్సిన పరిస్థితి ఉన్నందున.. అందుకు అవసరమైన వెసులుబాటును కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థిస్తూ ఓ 19 ఏళ్ల యువతి హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ 4 ఏళ్ల వయస్సులోనే అగ్నిప్రమాదానికి గురవడంతో మూత్రవిసర్జనను నియంత్రించుకోలేని పరిస్థితి నెలకొందని న్యాయమూర్తి పేర్కొన్నారు. పిటిషనర్ పరీక్షకు డైపర్ ధరించి వెళ్లడంపైనా, డైపర్ మార్చుకొనేందుకు అవకాశం కల్పించడంపైనా అధికారులు ఆ బాలిక పరీక్షకు హాజరయ్యే కేంద్రం అధికారికి ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యలపై అవగాహన ఉంది

- మోదీతో నేరుగా మాట్లాడే సత్తా ఉంది
- విశ్వాసంతో గెలిపించండి: ఈటల


సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మల్కాజిగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): "నాకు సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉంది. అంతే కాదు.. ప్రధాని మోదీ దగ్గరికి వెళ్లి ఏదైనా మాట్లాడే సత్తా నాకు ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఇక్కడ ఎంతమంది గుర్తు పడతారు? వారికి సమస్యల పట్ల ఏ మాత్రం అవగాహన లేదు. అందుకే నాపై విశ్వాసంతో గెలిపించండి" అని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బైక్ మెకానిక్స్ అసోసియేషన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ పట్ల, ఇక్కడి ప్రజల పట్ల తనకున్నంత పట్టింపు ఇంకెవరికి లేదని చెప్పుకునే కేసీఆర్ ఇపుడు అధికారంలో లేరని, ఆ పార్టీ అభ్యర్థులు గెలిస్తే ఢిల్లీకి వెళ్లి ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే అవకాశం లేదని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యే అవకాశం అసలే లేదని చెప్పారు. తానేంటో, తన రాజకీయ జీవితం ఏంటో అందరికీ తెలుసని, తనపై విశ్వాసంతో గెలిపించాలని, బీజేపీకి ఓటేసేలా కష్టమర్లతో మాట్లాడి వివరించాలని ఈటల కోరారు. ఈ కార్యక్రమంలో బైక్‌మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉరపల్లి శ్రవణ్, సునీత చంద్రశేఖర్ యాదవ్, నాయకులు రాందాస్ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు డిగ్రీ షెడ్యూల్ విడుదల!

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు శుక్రవారం విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లను దోస్త్ ద్వారా భర్తీ చేస్తున్న సంగతి తెలిసిందే. దోస్త్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్ మార్కుల ఆధారం కళాశాలల్లో సీట్లను కేటాయిస్తారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల రుసుము చెల్లింపు గడువును పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అయితే అభ్యర్థుల అభ్యర్థన మేరకు పరీక్ష ఫీజు చెల్లింపుకు మే 4వ అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

టెట్ సమస్యకు త్వరలోనే పరిష్కారం

ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియకు అడ్డంకిగా మారిన టెట్ అర్హత సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బర్మాతో జాగ్రత్త!

అంతర్యుద్ధం జరుగుతున్న మయన్మార్‌లో సైనికప్రభుత్వం బాగా బలహీనపడిందని, పరిస్థితులు సైన్యానికి అనుకూలంగా లేవని థాయ్‌లాండ్ ప్రధాని ఇటీవల ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. మయన్మార్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పొరుగు దేశం అధినేత చేసిన ఈ వ్యాఖ్య యుద్ధ తీవ్రతకు అద్దంపడుతున్నది. గత ఏడాది చివరి మాసాల్లో ఆరంభమైన ఈ తిరుగుబాటు తీవ్రస్థాయికి చేరుకొని, అద్భుత విజయాలను సాధిస్తోందని మయన్మార్‌కు ఆవల, సైనిక జుంటాకు వ్యతిరేకంగా ఏర్పడిన ప్రవాస ప్రభుత్వ ప్రతినిధులు చాలాకాలంగా అంటున్నారు. అది నిజమేనని ఇప్పుడు దేశంలోపల ఉంటున్న పాత్రికేయులు, పౌరసమాజ ప్రతినిధులు కూడా ధైర్యంగా చెబుతున్నారు. సైనిక ప్రభుత్వం రోజులు లెక్కబెట్టుకుంటోందని, అది పతనమైన అనంతరం దేశంలో ఎటువంటి వ్యవస్థ ఏర్పడాలనే విషయంమీద ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి.

సైనిక ప్రభుత్వంమీద పోరాడుతున్న సకల శక్తులూ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకున్నాయన్న మాటలో అతిశయోక్తి ఉండవచ్చును గానీ, మయన్మార్‌లో దాదాపు అరవైశాతం భూభాగం సైన్యం ఏలుబడిలో లేదన్నది మాత్రం నిజం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సైనిక ప్రభుత్వం తన ఆధిపత్యం కోసం ఏర్పాటు చేసుకున్న అన్ని వ్యవస్థలనూ తిరుగుబాటుదారులు దెబ్బతీసి, తమ అధీనంలోకి తెచ్చుకున్నారని, కొన్ని ముఖ్యపట్టణాలు మాత్రమే సైన్యం నియంత్రణలో ఉన్నాయని వార్తలు వస్తున్నాయి. చాలా మిలటరీ స్థావరాలు, ఔట్ పోస్టులు సైన్యం చేతుల్లోనుంచి జారిపోయాయి. మయన్మార్–థాయ్‌లాండ్ సరిహద్దుల్లోని కీలకనగరాలు తిరుగుబాటుదారుల వశమవుతున్నందువల్లనే థాయ్ ప్రధాని ఆ వ్యాఖ్య చేసివుండవచ్చు. పెద్దసంఖ్యలో సైనికులు మరణించడం, యుద్ధభూమినుంచి పారిపోవడం, శత్రువులకు లొంగిపోవడం లేదా వారితో చేరిపోవడం ఇత్యాదివి సైనిక ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నాయి. కొత్తవారితో సైన్యాన్ని భర్తీచేసుకొనేందుకు మయన్మార్ స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ కౌన్సిల్ (ఎస్ఏసి) లేదా జుంటా చేస్తున్న ప్రయత్నాలు కూడా ఫలితాన్నివ్వడం లేదు. విధిగా సైన్యంలో చేరాల్సిందేనని ప్రత్యేక ఆదేశాలు యువతను మరింత ఆగ్రహానికి గురిచేశాయి.

ప్రజలు ఎన్నుకున్న ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని 2021 ఫిబ్రవరిలో కూల్చివేసి అధికారాన్ని హస్తగతం చేసుకున్న మిలటరీ ఈ అతిపెద్ద తిరుగుబాటును తట్టుకోలేకపోతున్నది. త్రీ బ్రదర్ హుడ్ అలయెన్స్ పేరిట మయన్మార్ జాతీయ ప్రజాస్వామ్య ఆర్మీ, అరాకన్ ఆర్మీ, తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ కలసికట్టుగా ఆరంభించిన ఈ పోరాటం అనంతరకాలంలో మరిన్ని జాతులు, గ్రూపుల చేరికతో ఇంకా బలపడింది. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని నిరంకుశంగా అణచివేసినందుకు సైనికప్రభుత్వంపై ఆగ్రహించి ఆయుధాలు చేపట్టినవారు కూడా అనేకమంది. గతంలో మిలటరీతో సయోధ్యగా ఉన్న వివిధ జాతులు, తెగలు కూడా ఈ యుద్ధ కాలంలో ప్రత్యర్థులతో కలిసిపోవడంతో మిలటరీ పాలకులు పెద్ద ఎత్తున ఎదురుదెబ్బలు తింటున్నారు. అనాదిగా వేర్వేరు లక్ష్యాలతో పోరాటాలు చేస్తున్న గ్రూపులన్నీ తమ మధ్య ఉన్న విభేదాలను పక్కనబెట్టి మిలటరీని దించాలన్న లక్ష్యంతో ఒక్కటైనాయి. వ్యాపార వాణిజ్యమార్గాలు కూడా తిరుగుబాటుదారుల అధీనంలోకి పోతున్నందున పొరుగుదేశాలతో సాగే వాణిజ్యం కూడా ప్రభావితమవుతున్నది.

మయన్మార్ సైనిక ప్రభుత్వంతో లోపాయికారీగా సయోధ్యతో వ్యవహరిస్తున్న భారత ప్రభుత్వం ఈ పరిణామాలపై బహిరంగంగా ఏమీ మాట్లాడటం లేదు. తిరుగుబాటుదారుల ధాటీని తట్టుకోలేక భారతదేశంలోకి పారిపోయివస్తున్న మయన్మార్ సైనికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. వారికి తాత్కాలికంగా ఆశ్రయం ఇచ్చి, తిరిగి సరిహద్దులు దాటిస్తున్నప్పటికీ, ఆంగ్‌సాన్ సూకీని అష్టకష్టాలూ పెడుతున్న మిలటరీ ప్రభుత్వంతో సానుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు తప్పడం లేదు. భారత ప్రభుత్వం ఈ కష్టకాలంలో తమకు అండగా నిలవడం లేదని మిలటరీ పాలకులకు కూడా ఆగ్రహం కలుగుతున్నదట. మరోపక్క, ఈ సైనిక ప్రభుత్వం పని అయిపోయిందనీ, తమను అధికారికంగా గుర్తించాలని ప్రవాస యూనిటీ గవర్నమెంట్ ప్రతినిధులు భారత్ సహా చాలా దేశాలకు విజ్ఞప్తులు చేసుకుంటున్నారు. దేశరాజధానిలోని సైనికస్థావరాల మీదే డ్రోన్‌దాడులు చేయగలిగేస్థాయికి పోరాటం చేరుకున్న తరుణంలో, పొరుగుదేశం పరిణామాలు కచ్చితంగా భారత్‌కు ఇబ్బంది కలిగించేవే.


ఈ 'ఓట్ల పండుగ' ఓటర్లదేనా?

పద్దెనిమిదవ సార్వత్రిక ఎన్నికల మొదటి రెండు విడతల పోలింగ్ ముగిసింది. ఇంకా ఐదు విడతల పోలింగ్ జరగవలసి వున్నది. ఇంతలో, ప్రచండ వేసవి గాడ్పులు, ఎన్నికల ప్రచార వేడి మిళితమై ఒక తీవ్ర ఉక్కపోతతో సతమతమవుతున్న దేశ ప్రజల ముందుకు అనుకోకుండా ఒక పెద్ద ప్రశ్న వచ్చింది: టీవీ స్టూడియోల లోను, విశాల సమాజంలోను రాజకీయ పార్టీల నాయకుల వాద ప్రతివాదాల హోరు ఎడతెగకుండా మిన్నంటుతున్నా కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ ప్రజాస్వామిక 'పండుగ'లో పాల్గొంటున్న వారి సంఖ్య అంచనాల కంటే ఎందుకు తక్కువగా ఉన్నది?

మండుతున్న ఎండా కాలం, పంట కోతల సమయం, సుదీర్ఘ వారాంతపు సెలవులు అనేవి పోలింగ్ శాతం తక్కువగా ఉండడాన్ని పాక్షికంగా మాత్రమే వివరిస్తాయి. నిజమేమిటంటే దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రజాస్వామిక లోటు (ప్రజాస్వామిక సంస్థలు, వ్యవస్థలు తమ కార్యాచరణల్లో ప్రజాస్వామ్య సూత్రాలకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉండకపోవడం, పర్యవసానంగా ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల ప్రజల్లో అనాసక్తి, నిర్లిప్తత పెరిగిపోవడం వల్ల నెలకొనే పరిస్థితి) గణనీయంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మన ప్రజాస్వామ్యం అసమగ్రంగా ఉన్నది. సామాన్యుల ఆరాటాలను ఆర్తీలు, నేతలు పట్టించుకోవడం లేదు. కనుకనే సగటు ఓటరు తన ప్రతినిధిగా ఏ పార్టీ అభ్యర్థిని ఎన్నుకోవాలనే విషయమై అంతకంతకూ ఉత్సుకతను కోల్పోతున్నాడు. పార్లమెంటు సభ్యుడుగా తన విధ్యుక్త ధర్మాలను చిత్తశుద్ధితో నిర్వర్తించగలడనే భరోసాను వివిధ పార్టీల అభ్యర్థులలో ఏ ఒక్కరూ ఇవ్వలేకపోవడమే అందుకు కారణంగా చెప్పవలసి ఉన్నది.

ఎన్నికల ముందు రోజుల్లో విజయోత్సాహంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్' అనే నినాదాన్ని ఇచ్చింది. 400 సీట్లతో తమ పార్టీ విజయం సాధించగలదని ఆ పార్టీ శ్రేణులు ఆత్మవిశ్వాసంతో చెప్పాయి. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం ఇప్పటికే ఖాయమైపోయిందని, అయితే 1984 సార్వత్రిక ఎన్నికలలో 414 నియోజకవర్గాలను గెలుచుకున్న రాజీవ్ గాంధీ రికార్డును ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధిగమించగలరా అన్న విషయం మాత్రమే మిగిలి వుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

ఎన్నికల ప్రచారం ఊపందుకుని, రెండు విడతల పోలింగ్ సైతం ముగిసిన ప్రస్తుత తరుణంలో అధికార, ప్రతిపక్షాలు రెండింటికీ ఓటర్ల విషయమై ప్రాథమిక వాస్తవాలు తెలిసివచ్చాయి. ఏ రాష్ట్రంలోనూ అటు అధికార పక్షం/ కూటమికి గానీ, ఇటు ప్రతిపక్షం / కూటమికి గానీ అనుకూల పవనాలు వీయడం లేదన్నది స్పష్టంగా కన్పిస్తున్నది. ఓటర్లు ఏ పక్షం వైపు మొగ్గు చూపడం లేదనేది విశదమయింది. (మొదటి విడతలో పోలింగ్ శాతం అంచనాల కంటే 3 శాతం తక్కువగా నమోదయింది). వెన్వెంటనే ప్రధాని మోదీ, ఓటర్లలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం ప్రారంభించారు. 2047 సంవత్సరం నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మిస్తామన్న హామీతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీ మొదటి దశ ఎన్నికలు ముగియగానే మాట మార్చింది. ఆశాభావ రాజకీయాల నుంచి భయాన్ని సృష్టించే రాజకీయాలకు మారింది. ఆశాభావం, భయం అసాధారణమైన సహచరులు. భయపూరిత రాజకీయాలు హానికరమైనవి, విధ్వంసకరమైనవి కాగా ఆశాభావ రాజకీయాలు సానుకూలమైనవి, నిర్మాణాత్మకమైనవి, సృజనాత్మకమైనవి.



> అసంఖ్యాక భారతీయులు గత ఐదేళ్లుగా కోవిడ్ మహమ్మారి, సుదీర్ఘ లాక్‌డౌన్‌లు, ధరల పెరుగుదల, ఉద్యోగాలు కోల్పోవడం, ఆదాయాలు పడిపోవడం మొదలైన సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారిలో సుభిక్ష భావన (ఫీల్‌గుడ్) సృష్టించడం ఎలా సాధ్యమవుతుంది? ఈ కారణంగానే రాజకీయ నాయకుల ప్రసంగాలు, హామీలకు వారు ప్రతిస్పందించడంలేదు. ఏ పార్టీ గెలిచినా నష్టపోతోంది తామేనన్న భావన కూడా వారిలో బాగా పెరిగిపోతోంది.

2024 సార్వత్రిక ఎన్నికలు ఒక ఆశాభావంతో ప్రారంభమయ్యాయి. అయితే ఈ ఆశాభావం శీఘ్రగతిన అర్ధ సత్యాలు, అబద్ధాలను నిర్భయంగా వ్యాపింపజేసే ఒక భయపూరిత వాతావరణంలోకి జారిపోయింది.

రాజస్థాన్‌లో ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ తన శ్రోతల్లో తీవ్ర సంకుచితత్వ భావాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ మానిఫెస్టో ముస్లిం లీగ్ మానిఫెస్టోలా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ వారు అధికారంలోకి వస్తే మీ ఆస్తులను స్వాధీనం చేసుకుని చొరబాటుదారులకు పునః పంపిణీ చేస్తారని మోదీ హెచ్చరించారు. అంతే కాకుండా స్త్రీల మెడల్లో ఉన్న మంగళసూత్రాలను సైతం తెంచుకుపోతారని కూడా ఆయన ఆరోపించారు. ఏ రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి ప్రధానమంత్రి ఇటువంటి ఆరోపణలు చేశారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పార్టీకి ప్రధాన మద్దతుదారులుగా ఉన్న హిందూత్వవాదులను రెచ్చగొట్టి, సుపరిచిత 'శత్రువు'కు వ్యతిరేక పోరాటంలో వారు పాల్గొనేలా చేయడమే ఆయన లక్ష్యం. ఎన్నికలలో బీజేపీ ఒక విజేతగా నిలవటంలో భారతీయ ముస్లింలు కీలక పాత్ర వహిస్తున్నారు. 1990ల్లో వారిని 'బాబర్‌కి ఔలద్' అని పరిహసించారు. ఇప్పుడు వారిని 'ఘస్ పేటియాస్' (చొరబాటుదారులు) అని నిందిస్తున్నారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

బీజేపీ మళ్లీ మతతత్వ వక్రీకరణలకు పాల్పడుతుండగా, కాంగ్రెస్ సైతం ఊహాత్మక భయాల ఆధారంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచార సభలలో భారత రాజ్యాంగం ప్రతిని ఎత్తిచూపుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు రిజర్వేషన్లను శాశ్వతంగా రద్దు చేసేందుకు రాజ్యాంగానికి సవరణలు చేస్తుందని హెచ్చరిస్తున్నారు. విద్వేషపూరిత ప్రసంగాలతో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండగా మండల్ 'సామాజిక న్యాయ'వాదుల మద్దతును కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ఆరాటపడుతోంది.

అయితే సగటు ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ ధోరణులు ఏవీ పట్టడం లేదు. ఆ పార్టీల ప్రచారాలకు వారు స్పందించడంలేదు. జీవనోపాధి సమస్యలతో సతమతమవుతున్న సగటు ఓటర్లు వాటి నుంచి బయటపడేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఆసేతు హిమాచలం పర్యటించండి– నాయకులు, సామాన్య పౌరుల మధ్య సంబంధరాహిత్యం ఎంతగా ఉన్నదో స్పష్టమవుతుంది. గత ఐదేళ్లుగా అసంఖ్యాక భారతీయులు, కోవిడ్ మహమ్మారి, సుదీర్ఘ లాక్‌డౌన్‌లు, ధరల పెరుగుదల, ఉద్యోగాలు కోల్పోవడం, ఆదాయాలు పడిపోవడం మొదలైన సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారిలో సుభిక్ష భావన (ఫీల్‌గుడ్) సృష్టించడం ఎలా సాధ్యమవుతుంది? ఈ కారణంగానే రాజకీయ నాయకుల ప్రసంగాలు, హామీలు వారి నేమాత్రం ఆకట్టుకోలేకపోతున్నాయి. నగరాలలో సాయం సంధ్యల్లో వివిధ సభలు, సమావేశాలలో పాల్గొనే వారికి 'ప్రభవిస్తున్న నవభారతం' అనేది ఒక ఉత్తేజకర చర్చనీయాంశం కావచ్చు గానీ దుర్భర పరిస్థితులు ఉన్న గ్రామీణ భారతంలో వాటర్ ట్యాంకర్ ఎనిమిది రోజులకు ఒకసారి మాత్రమే రావడం అనేది ఒక కఠోర వాస్తవం. మరి 'నవభారత్' గురించిన ఉద్ఘాటనలు సగటు పౌరులను ఎలా ఉత్తేజపరుస్తాయి? రాజకీయ నాయకుల ప్రసంగాలకు, సంఖ్యానేక ప్రజల వాస్తవ జీవన పరిస్థితులకు మధ్య తీవ్ర అంతరం ఉంటోంది. నేతల ఈ నిర్లక్ష్య వైఖరులే అత్యధిక ఓటర్లలో ఎన్నికల ప్రక్రియ పట్ల ఉదాసీనతను కాకపోయినప్పటికీ ఏ పార్టీ అభ్యర్థికి ఓటువేయాలనే విషయమై ఒక నిశ్చయానికి రాలేని మందకొడితనాన్ని కలిగిస్తున్నాయి.

మహారాష్ట్రనే చూడండి. పశ్చిమ భారతంలోని ఈ ప్రధాన రాష్ట్రంలో గత మూడేళ్లలో అనేక రాజకీయ ఉపద్రవాలు సంభవించాయి. ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. విధేయతలు మార్చుకోవడం, రహస్య పొత్తులు పెట్టుకోవడం మొదలైన పరిణామాలు రాష్ట్ర పాలనపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తల సైతం ఎన్నికల సంబంధిత వ్యవహారాలలో పాల్గొనేందుకు ఎంత మాత్రం ఆసక్తి చూపడం లేదు.

రాజకీయవేత్తలు తమ ఆస్తిపాస్తులను పెంచుకుంటూ పదవులను అధిష్ఠిస్తుండగా సగటు కంటే తక్కువ వర్షపాతంతో వ్యవసాయరంగంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై సంపన్నులు విలాస జీవితాలు గడుపుతుండగా ట్యాంకర్ మాఫియా గ్రామీణ మహారాష్ట్రలో ఒక పెద్ద బకెట్ నీటిని రూ. 200కి విక్రయిస్తోంది! రాజకీయ నాయకులు పెద్ద పెద్ద హామీలు ఇచ్చి వాటిని ఏ మాత్రం నెరవేర్చకపోతుండడంతో వారి పట్ల గ్రామీణ ప్రాంతాల ఓటర్లలో భ్రమలు తొలగిపోయాయి. ఇప్పుడు ఎన్నికల విషయంలో గ్రామీణ ఓటర్ల ఆలోచనలకు ఈ వాస్తవాలే ఆధారంగా ఉంటున్నాయి అంటే ఎన్నికల పట్ల వారి మనోవైఖరులు ఎలా ఉన్నాయనేది ఎవరికి వారే అర్థం చేసుకోవచ్చు. రాజకీయ నాయకులు, ముఖ్యంగా అధికారంలో ఉన్న వారి పట్ల వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 'మోదీ గ్యారంటీ'లకు సంబంధించిన పోస్టర్లు పల్లె పల్లెన ప్రతి వీధిలోనూ వెలసినా పాలకుల పట్ల వారి వ్యతిరేకతను తగ్గించలేకపోతున్నాయి. అవును, ప్రజల్లో ప్రబలిన ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే బీజేపీ వంద మందికి పైగా సిట్టింగ్ ఎంపీలను మార్చివేయడం జరిగింది.

ఈ వాస్తవాలు మరొక పెద్ద ప్రశ్నను మన ముందుంచుతున్నాయి : జీవన పోరాటంలో అలసిపోయిన ఓటర్ అసంతృప్త మనోవైఖరి నుంచి ఎన్నికలలో లబ్ధిపొందేదెవరు? నష్టపోయేదెవరు? బీజేపీ సహేతుకంగానే తన విజయంపై ఆత్మవిశ్వాసంతో ఉన్నది. పటిష్ఠ ఎన్నికల యంత్రాంగం, అందునా ప్రజల విశ్వాసాన్ని మరెవరికంటే ఎక్కువగా పొందుతున్న ఒక శక్తిమంతమైన నాయకుడి నిర్ణయాలు, నిర్దేశాలకు పని చేస్తుండడంతో తాము వరుసగా మూడోసారి కూడా విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు పూర్తి నమ్మకంతో ఉన్నాయి. కాంగ్రెస్ కూడా ఒక ఆశాభావంతోనే పోరాడుతున్నది. ఓటర్ల ఉదాసీనత, సరిసమాన స్థాయిలో పోటీ పడుతున్న నియోజకవర్గాలలో ప్రత్యర్థితో గట్టిగా పోరాడే అవకాశాన్ని కల్పిస్తుందనే ఆశ కాంగ్రెస్‌కు నిండుగా ఉన్నది. అయితే భారత ప్రజాస్వామ్య సంక్షోభం బీజేపీ వర్సెస్ ప్రతిపక్షం అనే ద్వంద్వత్వానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది చాలా విస్తృతమైనదీ, తీవ్రమైనదని చెప్పి తీరాలి. ఏమైనా ఎన్నికలలో ఏ పార్టీ గెలిచినా ఓటర్లే ఎక్కువగా నష్టపోతున్నారనే భావన ప్రజల్లో బాగా పెరిగిపోతోంది. పార్టీలు, నాయకుల పట్ల ప్రజల ఈ విశ్వాస రాహిత్యమే భారత ప్రజాస్వామ్య సంక్షోభానికి ఒక తిరుగులేని తార్కాణం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఒప్పులకుప్ప, ఒడిలో మీడియా!

ప్రధాన స్రవంతి మీడియాలో స్వతంత్ర గళాలను మూసేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు యూట్యూబ్‌లో ఉన్న స్వతంత్ర ఛానల్స్ వెంట పడుతోంది. 'బోల్ తా హిందుస్తాన్' అనే హిందీ న్యూస్ ఛానల్‌ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూట్యూబ్ నుంచి తొలగించారు. ఏప్రిల్ 4న కేంద్రంలోని ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ ఛానల్‌ని రద్దు చేస్తున్నట్లు యూట్యూబ్ నుంచి ఈమెయిల్ ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే రాత్రికి రాత్రి తీసివేయడం కూడా జరిగిపోయింది. ఈ ఛానల్‌కి 3 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 40వేల మంది ఫాలోవర్స్ ఉన్నారు. కొన్ని వారాల క్రితం ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ రద్దు చేశారు. ఇప్పుడు మొత్తం ఛానల్‌నే తీసేసారు. ఈ ఛానల్ అల్ప సంఖ్యాకుల, దళిత బహుజనుల సమస్యల మీద వార్తలు చేస్తుంది.

'బోల్ తా హిందుస్తాన్' తతంగం ఇంకా నడుస్తూనే ఉండగా మరో రెండు ఛానల్స్‌కి అదే రకం నోటీసు వచ్చింది. అవి 'నేషనల్ దస్తక్', 'ఆర్టికల్ 19'. ఈ ఛానల్స్ కూడా దళిత బహుజన విషయాల గురించి బలంగా కంటెంట్ చేస్తాయి. ఈ ఛానల్స్ చేసే కార్యక్రమాలను చూసి ప్రభుత్వం ఎందుకు ఇంతగా బెదురుతోంది? పార్లమెంట్ ఎన్నికల్లో హిందుత్వ రాజకీయాల ముసుగు ఈ ఛానల్స్ తొలగిస్తున్నాయనా? 'నేషనల్ దస్తక్' అనే ఛానల్‌కి దాదాపు 94 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ ఉన్నారు. ఇక ఛానల్‌ని చూసేవాళ్లు మరో 30 లక్షల మందికి షేర్ చేస్తూ ఉంటారు. ఈ ఛానల్ ప్రత్యేకించి దళిత్ బహుజన్ హక్కుల గురించి విస్తృతంగా కవరేజ్ ఇస్తుంది. దళిత బహుజన యువతని జర్నలిస్టులుగా తీసుకుంటుంది. ఇంటర్న్‌షిప్స్ ద్వారా కొన్ని వేలమందిని మీడియా ప్రొఫెషనల్స్‌గా తయారు చేస్తుంది. పెద్ద మీడియా సంస్థలు కవర్ చేయని వార్తలను ఈ ఛానల్ చేస్తుంది. యూపీ బీహార్ లాంటి రాష్ట్రాల్లో ఈ ఛానల్‌కి కొన్ని లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. సరిగ్గా మోడల్ కోడ్ ఉన్న సమయంలో, ఎలక్షన్ మధ్యలో ఇంత బలమైన ఛానల్‌ని మూసివేయడం ఎలక్షన్ కమిషన్‌కి ఏ మాత్రం తప్పుగా అనిపించట్లేదు. మూసివేయటానికి ఎటువంటి ప్రత్యేక కారణం ఇవ్వకుండా, ఎటువంటి ప్రక్రియా పాటించకుండా, కేవలం ఉల్లంఘన జరిగిన కార్యక్రమాన్ని తొలగించమనకుండా, మొత్తం ఛానల్‌నే మూసివేయడం ఎంత దౌర్జన్యం?



> మీడియా మీద అణచివేతను కేవలం 19(1)A కోణం నుంచి చూస్తే సరిపోదు. దీనికి ప్రబలంగా కుల మత కోణం కూడా ఉంది. అగ్రకుల పాత్రికేయులను వెంటాడటం వెనుక కూడా వారు దళిత బహుజనుల, అల్ప సంఖ్యాక వర్గాలకు మద్దతుగా నిలబడినప్పుడే జరుగుతున్నది. ఈ విషయాన్ని ప్రజాస్వామ్య వాదులం ఎంతమందిమి గుర్తిస్తున్నాం?

ఇదే క్రమంలో 'ఆర్టికల్ 19' అనే ఛానల్‌కి కూడా ప్రభుత్వం నుంచి ఇటువంటి బెదిరింపే వచ్చింది. గతంలో కేరళలోని 'మీడియా వన్' అనే సాటిలైట్ ఛానల్‌ని కూడా ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ లైసెన్స్ రెన్యూ చేయకుండా మూసివేసే పరిస్థితి కల్పించింది. జాతీయ భద్రత నెపంతో, కారణం బహిరంగంగా చెప్పకుండా ప్రభుత్వం కోర్టులో సీల్డ్ కవర్ అందించింది. సీఏఏకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, దాని తరవాత ఢిల్లీలో జరిగిన అల్లర్లను గురించి ఆ ఛానల్ చేసిన విస్తృత కవరేజ్‌లో– ఢిల్లీ పోలీస్ నిష్పాక్షికంగా తమ విధులు చేయలేదని, అల్లర్లలో ఆరెస్సెస్ పాత్ర ఉందని విమర్శలు చేయడం ప్రభుత్వానికి నచ్చక ఛానల్‌ని మూసేసింది. దీనిని దేశభద్రతతో ముడిపెట్టింది. చివరికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఛానల్‌ని దాదాపు సంవత్సరం తరవాత మళ్ళీ తెరవగలిగారు.

మొదటగా, 2014లో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణికి బలి అయ్యింది హిందుస్థాన్ టైమ్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ బాబీ ఘోష్. ఈయన 2016–17 మధ్య తాను ఎడిటర్‌గా ఉన్న కాలంలో హేట్ ట్రాకర్‌ని రూపొందించి, అందులో దేశవ్యాప్తంగా అల్ప సంఖ్యాకుల మీద జరిగిన విద్వేష దాడులను ఎప్పటికప్పుడు నమోదు చేయించాడు. 28 సెప్టెంబర్ 2015లో దాద్రిలో అఖ్లాఖ్‌ని గొడ్డు మాంసం కోసం గోహత్య చేశాడన్న తప్పుడు ఆరోపణలతో పట్టపగలు మూకదాడి చేసి, హత్య చేశాక ఈ హేట్ ట్రాకర్‌ని మొదలుపెట్టారు. ఇది ప్రారంభం అయిన కొన్నాళ్లకే బాబీ ఘోష్‌ని తీసేయమని యాజమాన్యం మీద ప్రభుత్వం నుంచి ఒత్తిడి మొదలైయింది. బాబీ ఘోష్ త్వరలోనే రాజీనామా చేసి వెళ్ళిపోయాడు. పత్రిక వెంటనే తమ వెబ్‌సైట్ నుంచి హేట్ ట్రాకర్‌ని తీసివేసింది. ఇక తరువాతి కాలంలో రవీష్ కుమార్, పుణ్య ప్రసూన్ బాజ్‌పాయి, అభిసార్ శర్మ వంటి దిగ్గజ జర్నలిస్టులను యాజమాన్యాల మీద ఒత్తిడి తెచ్చి ఉద్యోగాలు విడిచి వెళ్లే లాగా చేసింది కేంద్ర ప్రభుత్వం. ఎన్‌డిటీవీ లాంటి న్యూస్ సంస్థల్ని పెట్టుబడిదారీ మిత్రులు స్వాధీనం చేసుకునే పరిస్థితులని సృష్టించింది.

ఒక పక్క కుల వివక్షకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉన్న ఛానళ్లు, పత్రికల మీద, పాత్రికేయుల మీద విరుచుకుపడే ప్రభుత్వం సుదర్శన్ టీవీ, రిపబ్లిక్, టైమ్స్ నౌ, ఆజ్ తక్ వంటి ఛానళ్ల ప్రతిరోజూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే షోలు చేస్తుంటే చూసీ చూడనట్టు ఉంటోంది. గత కొన్ని నెలల్లో ఈ ఛానళ్లకి నేషనల్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ విద్వేషపూరిత షోలు చేస్తున్నారని జుర్మానాలు విధించటం చూస్తున్నాం. కానీ ప్రభుత్వం మాత్రం వాటిపై చర్య తీసుకోకపోగా, నియంత్రించే ఊసే లేదు.

గతంలో హత్రాస్‌లో ఒక దళిత మహిళను అగ్ర కులాల వాళ్లు అత్యాచారం చేసి, దారుణంగా హింసించి చంపిన ఘటన తరవాత, దానిని గురించి రిపోర్ట్ చేయడానికి వెళుతున్న సిద్దిక్ కప్పన్‌ను ఇంకా ఒక్క అక్షరం కూడా రాయకముందే అరెస్ట్ చేసి రెండేళ్ల పాటు జైల్లో మగ్గించింది కేంద్ర ప్రభుత్వం. ఈ సంఘటనలన్నిటికీ కామన్ విషయం దళిత బహుజనుల, అల్ప సంఖ్యాకుల రక్షణ, భద్రత, హక్కులు అని గమనించాలి. ఈ ప్రభుత్వం పదే పదే మనకు పంపుతున్న సందేశం – ఈ దేశంలో అగ్ర కులాల, బహు సంఖ్యాకుల ఆధిపత్యమే ఉండాలి. ఇతరుల సమస్యలు తలెత్తినా, గొంతులు లేచినా అణచివేత అనివార్యం. మీడియా మీద అణచివేతను కేవలం 19(1)A కోణం నుంచి చూస్తే సరిపోదు. దీనికి ప్రబలంగా కుల మత కోణం కూడా ఉంది. అగ్రకుల పాత్రికేయులను వెంటాడటం వెనుక కూడా వారు ఈ సామాజిక వర్గాలకు మద్దతుగా నిలబడినప్పుడే జరుగుతున్నది. ఈ విషయాన్ని ప్రజాస్వామ్య వాదులం ఎంత మందిమి గుర్తిస్తున్నాం? గుర్తిస్తే మన కర్తవ్యం ఏమిటి?

● ప్రొ. పద్మజ షా

లాభంలేని మూడో టీఎంసీ కోసం ముప్పైవేలకోట్లా...!?

'గోదావరి–కావేరి' అనుసంధానంపై కేంద్రంపై తప్పుడు ప్రచారం

కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలను లోపభూయిష్టంగా ప్లాన్ చేసి దిగువ బ్యారేజీ నుంచి ఎగువ బ్యారేజీలకు నీటిని ఎత్తిపోస్తూ నదీ ప్రవాహానికి వ్యతిరేకంగా ఎలా ప్లాన్ చేశారో మనం ఇంతకు ముందు భాగంలో చర్చించాం. ఈ డిజైన్‌లో మరో ప్రధాన సమస్య ఉంది. అదేమిటంటే, నీటిని ఎత్తిపోయడానికి విద్యుత్ అవసరం. గోదావరి నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన అవసరం తెలంగాణకు కచ్చితంగా ఉందన్నది జగమెరిగిన సత్యం. కానీ నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన విద్యుత్తును తగ్గించి చౌక మార్గాన్ని పరిశీలించాలి. కనీస విద్యుత్తును వాడుతూ ఎక్కువ నీటిని ఎలా ఎత్తిపోయవచ్చనే దానిపై నిపుణులు గతంలో అనేక విధానాలు, ఆలోచనలు ఇచ్చారు. ఉదాహరణకు తుమ్మిడిహట్టి బ్యారేజీ నుంచి నీటిని పొందాలంటే మేడిగడ్డ నుంచి అవసరమయ్యే విద్యుత్ కంటే చాలా తక్కువ విద్యుత్ అవసరమవుతుంది. అదేవిధంగా మేడిగడ్డ ప్రాంతం నుంచి నేరుగా నదీ ప్రవాహానికి లంబంగా ఉన్న లోతట్టు ప్రాంతాలకు నీటిని ఎత్తిపోసి ఉంటే ఎత్తిపోయడానికి అవసరమైన విద్యుత్ కచ్చితంగా తక్కువగా ఉండేది.

కాళేశ్వరం కహానీ 5



కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని పంపులను పంపింగ్ సీజన్‌లో ఒకేసారి ఆపరేట్ చేసే అవకాశం ఉన్నందున గరిష్ఠ విద్యుత్ డిమాండ్ రోజుకు 203.02 ఎంయూలుగా ఉన్నది. 2021–22లో మొత్తం రాష్ట్రంలో సగటు రోజువారీ విద్యుత్ (రోజుకు 196.06 ఎంయూ) కంటే ఇది ఎక్కువ. ఈ ప్రాజెక్టుకు ఏటా విద్యుత్ ఛార్జీల కింద రూ.10,374.56 కోట్లు అవసరం అవుతాయి. ఈ ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడంలో భాగంగా అనేక సంవత్సరాల పాటు ప్రతి ఏటా మరో రూ.11,000కోట్లను బ్యాంకులకు చెల్లించాల్సి ఉన్నందున ఇది రాష్ట్ర ఖజానాపై పెనుభారం.

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మనం చర్చించాల్సిన మరో అంశం మూడో టీఎంసీ గురించి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ మూడో టీఎంసీ కాంపోనెంట్ ద్వారా 65 రోజుల్లో రోజుకు 3 టీఎంసీల చొప్పున 195 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా ప్రణాళిక రూపొందించింది. అసలు కాళేశ్వరం డీపీఆర్‌లో రోజుకు 2 టీఎంసీల చొప్పున 98 రోజుల పాటు మొత్తం 195 టీఎంసీలు ఎత్తిపోసేలా ప్రణాళిక ఉంది. కేంద్ర జలసంఘం ఆమోదించిన హైడ్రాలజీ అధ్యయనం ప్రకారం మేడిగడ్డ వద్ద 120 వరద రోజుల్లో ఎత్తిపోయడానికి నీరు అందుబాటులో ఉంటుంది. అందువల్ల మేడిగడ్డ వద్ద 120 వరద రోజుల గోదావరి జలాల లభ్యతకు 98 రోజుల పాటు రోజుకు 2 టీఎంసీల చొప్పున ఎత్తిపోసే ప్రణాళిక సరిపోతుంది. వరద రోజుల సంఖ్య 98 రోజుల కంటే తక్కువగా ఉంటే రోజుకు 2 టీఎంసీల కంటే ఎక్కువ ఎత్తిపోయాల్సి వచ్చేది. కానీ ఇక్కడ అలా కాదు. ఎత్తిపోయడానికి 120 రోజులకు సరిపడా నీరు అందుబాటులో ఉంటుంది. అందువల్ల మూడో టీఎంసీ కాంపోనెంట్ అవసరం లేదు. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏంటంటే మూడో టీఎంసీ కాంపోనెంట్ కింద గోదావరి నుంచి ఎత్తిపోసేందుకు ఈ 195 టీఎంసీలు తప్ప మరో చుక్క అదనపు నీరు లేదు. అలాగే, ఈ మూడో టీఎంసీ కాంపోనెంట్ కింద నీరు ఇవ్వడానికి అదనంగా 1 ఎకరా కూడా లేదు. కాబట్టి ఒక్క చుక్క నీటిని నిల్వ చేయకుండా, పొదుపు చేయకుండా, అదనంగా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వకుండా మూడో టీఎంసీ కాంపోనెంట్‌ను ప్లాన్ చేయాల్సిన అవసరం లేదు. ఈ మూడో టీఎంసీ కాంపోనెంట్ అమలుకు రూ.30,000 కోట్లు ఖర్చవుతుంది. అంటే ఏ లాభమూ లేకుండా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అదనంగా రూ.30,000 కోట్లు ఖర్చు చేయాలనుకుంది. ఇది సరైన ప్రతిపాదన అని ఎవరైనా అనగలరా?

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 'జాతీయ ప్రాజెక్టు' హోదా ఇవ్వలేదని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గగ్గోలు పెట్టింది. కానీ వాస్తవం ఏమిటంటే 'జాతీయ ప్రాజెక్టు' హోదా పథకం 2014కు ముందు మాత్రమే ఉంది. 2014 నుంచి 'జాతీయ ప్రాజెక్టు' అనే పథకం లేదు. 'ప్రధానమంత్రి కృషి సించాయి యోజన' (పీఎంకేఎస్‌వై), 'నదుల అనుసంధానం' వంటి సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఇతర పథకాలు ఉన్నాయి. 'పీఎంకేఎస్‌వై' కింద 60 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. గతంలో ఉన్న 'జాతీయ ప్రాజెక్టు' పథకంలో కూడా కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు మాత్రమే ఇవ్వడం గమనార్హం. 'నదుల అనుసంధానం' పథకం కింద కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తుంది. పైన పేర్కొన్న ఏ పథకాన్నైనా కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలంటే ఆ పథకం కింద నిధులు కోరే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా పథకం మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పైన పేర్కొన్న ఏ పథకం కిందనైనా ఒక ప్రాజెక్టు పరిశీలనకు రావాల్సిన ముఖ్యమైన షరతుల్లో ఒకటి కేంద్ర జలసంఘం నుంచి పెట్టుబడి అనుమతి పొందడం. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సీడబ్ల్యూసీ నుంచి పెట్టుబడుల క్లియరెన్స్ పొందడంలో విఫలమైంది. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం సరికాదు.

ట్రిబ్యునల్ తమకు కేటాయించిన గోదావరి జలాలను వినియోగించుకొని రాష్ట్రం తెలంగాణ. ముఖ్యంగా 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో గోదావరి నదిపై ప్రాజెక్టులు నిర్మించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. ట్రిబ్యునల్ రాష్ట్రానికి కేటాయించిన సుమారు 980 టీఎంసీలను వినియోగించుకోవడానికి పదేళ్ల సమయం సరిపోతుంది. కానీ వారు ఈ పనిలో పూర్తిగా విఫలమయ్యారు. 2014కు ముందు తెలంగాణలో గోదావరి నదిపై ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు మాత్రమే ఉండేవి. 2014 తర్వాత ఇన్ని లోటుపాట్లు ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు క్రింద వున్న 195 టీఎంసీల్లో పది శాతం కూడా రాష్ట్రం పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదు. సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్‌తో సమస్యలు ఉన్నాయి, బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పరిష్కరించలేకపోయింది. ఈ ప్రాజెక్టు ఏ ప్రత్యేక కమాండ్ ఏరియాకు సేవలందిస్తుందనే దానిపై కూడా స్పష్టతలేదు. ఈ ప్రాజెక్ట్‌లో చూపించబడ్డ కమాండ్ ఏరియా ప్రస్తుతమున్న ఇతర ప్రాజెక్ట్‌ల కమాండ్ ఏరియాతో ఓవర్‌లాప్ అయి వుంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అటువంటి స్పష్టత ఇవ్వడంలో విఫలమైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఒప్పించడంలో కూడా విఫలమైంది. ఈ అడ్డంకులను తొలగించి ఈ ప్రాజెక్టుకు ఆమోదం పొందేందుకు రాష్ట్రం ప్రయత్నించాలి.

సీతారామ ప్రాజెక్టును కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించింది కానీ దానికి తగిన లాభం–ఖర్చుల నిష్పత్తి (Benefit-Cost Ratio) లేదు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు డబ్బునూ కాలాన్నీ కేవలం కాళేశ్వరం పైనే (కేవలం 195 టీఎంసీల కోసం) వెచ్చించారు. సమ్మక్క సారక్క, సీతారామ ప్రాజెక్టులు పూర్తి కాలేదు. ఇచ్చంపల్లి (ఇంద్రావతి గోదావరిలో కలిసిన వెంటనే), కాంతలపల్లి వంటి ఇతర మంచి ప్రదేశాలను విస్మరించారు. సమ్మక్క సారక్క, సీతారామ డీపీఆర్‌లు సీడబ్ల్యూసీ పరిశీలనలో ఉన్నాయి. ఈ డీపీఆర్‌లను త్వరితగతిన క్లియర్ చేసేందుకు రాష్ట్రానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోంది.

ట్రిబ్యునల్ తెలంగాణకు కేటాయించిన గోదావరి జలాలను నదుల అనుసంధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం లాక్కోవడానికి కుట్ర పన్నుతోందని కొందరు అహేతుకంగా మాట్లాడుతున్నారు. గోదావరిపై ఇచ్చంపల్లి నుంచి తమిళనాడుకు నీటిని తీసికెళ్తున్నారని కేంద్రాన్ని నిందిస్తున్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. నదుల అనుసంధానం కార్యక్రమం కింద తెలంగాణకు కేటాయించిన గోదావరి జలాల్లో ఒక్క చుక్కను కూడా ముట్టుకోబోమని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. వాస్తవానికి గోదావరి జలాల్లో తమకు కేటాయించిన 980 టీఎంసీల వాటాను వినియోగించుకుని తెలంగాణ ప్రాజెక్టులు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నిజమైన సమాఖ్య స్ఫూర్తితో పనిచేస్తోంది. ఈ గోదావరి–కావేరి నదుల అనుసంధాన కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నిరుపయోగంగా ఉన్న నీటిని (సుమారు 147 టీఎంసీలు) మాత్రమే వినియోగించనున్నారు. ట్రిబ్యునల్ తమకు కేటాయించిన ఈ 147 టీఎంసీల గోదావరి జలాలను ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోలేకపోతోంది. నదుల అనుసంధానం కార్యక్రమంలో ఈ జలాలను వినియోగించుకునేందుకు ఛత్తీస్‌గఢ్ సమ్మతిని తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌ను సంప్రదిస్తోంది. గోదావరి, కావేరి నదుల అనుసంధానం వల్ల ఈ 147 టీఎంసీలు మొత్తం కావేరికి బదిలీ కావు. 20 నుంచి 30 టీఎంసీలు మాత్రమే కావేరిలోకి తీసుకెళ్తారు. మిగిలిన 120 టీఎంసీల నీటిని ఇచ్చంపల్లి నుంచి ప్రారంభమయ్యే కాలువ అలైన్‌మెంట్‌లో వినియోగించనున్నారు. కాబట్టి ఈ 147 టీఎంసీల్లో 50 శాతాన్ని తెలంగాణలోని కరువు ప్రాంతాల్లో వినియోగించుకునే అవకాశం ఉంది. గోదావరి–కావేరి నదుల అనుసంధానానికి అయ్యే ఖర్చులో 90 శాతం కేంద్రమే భరిస్తుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం భరించే 90 శాతం ఖర్చుతో తెలంగాణ సుమారు 70 టీఎంసీల అదనపు గోదావరి జలాలను (వాటి కేటాయింపుల్లో భాగం కానివి) వాడుకునే అవకాశం ఉంది. ఇచ్చంపల్లి బ్యారేజీ నిర్మాణం వల్ల దిగువన సమ్మక్క సారక్క బ్యారేజీ, ఎగువన మేడిగడ్డ బ్యారేజీ ఉనికికి ఎలాంటి ఆటంకం కలగదని ఇక్కడ చెప్పాలి. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న బ్యారేజీలకు ఎలాంటి ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుంది. ఛత్తీస్‌గఢ్ నుంచి నిరుపయోగంగా ఉన్న నీటిని మాత్రమే తెలంగాణకు నష్టం వాటిల్లకుండా వాడుకునే విధంగా ఇచ్చంపల్లి బ్యారేజీని కేంద్ర ప్రభుత్వం రూపొందించనుంది. అంతే కాదు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా గోదావరి – కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చేపట్టదు. కాబట్టి గోదావరి–కావేరి నదుల అనుసంధానం అంటే తెలంగాణ నుంచి వారి గోదావరి జలాలను లాక్కోవడం కాదు, తమకు చెందని గోదావరి జలాలను తెలంగాణకు ఇవ్వడం మాత్రమే.

> కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సీడబ్ల్యూసీ నుంచి పెట్టుబడుల క్లియరెన్స్ పొందడంలో విఫలమైంది. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని నిందించడం సరికాదు.
>
> * * * * *
>
> ఈ పదేళ్లలో గోదావరి నదిపై ప్రాజెక్టులు నిర్మించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. ట్రిబ్యునల్ రాష్ట్రానికి కేటాయించిన సుమారు 980 టీఎంసీలను వినియోగించుకోవడానికి ఈ సమయం సరిపోతుంది. కానీ వారు పూర్తిగా విఫలమయ్యారు.



■ వెదిరె శ్రీరామ్
కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సలహాదారు

(ఈ వ్యాస పరంపర ఇంతటితో ముగిసింది)

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



చింతలపల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి

- ఇది ఉద్యమకారుడికి, మోసగాళ్లకు మధ్య ఎన్నిక
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తొర్రూరు మండలంలో ఎన్నికల ప్రచారం


7 లో..

ఎన్నికలలో..

లోక్‌సభ ఎన్నికల వేళ హామీలు గుప్పిస్తున్న నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. తమను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని ఇటు అభ్యర్థులు.. అటు ఆయా పార్టీల నేతలు హామీలు గుప్పిస్తున్నారు. ఓరుగల్లు కాకతీయుల ఏలిన మహానగరమే అయినా.. పెరుగుతున్న జనాభాకు అవసరమైన సౌకర్యాలు అంతంతే. రాష్ట్రానికి రెండో రాజధాని అనే మాటే తప్ప హైదరాబాద్‌లో ఉన్న వసతుల్లో పైసా వంతు కూడా ఇక్కడ లేనే లేవనే చర్చ ఉంది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల వేళ నేతలు, అభ్యర్థులు గుప్పిస్తున్న హామీలను ఓరుగల్లు వాసులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ ప్రజల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్లు, ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' కథనం.



- ప్రచార తీరు, అభ్యర్థుల వాగ్దానాలను గమనిస్తున్న ప్రజలు
- వరంగల్ నగరంలో అండర్ డ్రెయినేజీపై ఆసక్తి
- తెరపైకి మామునూరు విమానాశ్రయం.. ప్రజల్లో గగనయానంపై ఆశలు
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు విస్తరిస్తేనే ఉపాధికి అడుగులు
- భూపాలపల్లి రైల్వేలైన్.. మైనింగ్, ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు జరిగేనా?
- కలగానే స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్‌పార్కు సైనిక్ స్కూల్ ఏర్పాటు
- ఐటీ టవర్లు, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుపైనా నేతల హామీలు

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై ఆశలు

'హైదరాబాద్‌కు సముద్రాన్ని, ఓడరేవును తీసుకొస్తా' అంటూ సినిమాల్లో రాజకీయ నేతలు హామీలు ఇవ్వటం చూసి నవ్వుకున్నాం.. కానీ, వరంగల్‌కు మాత్రం ఏ నాయకుడు అలాంటి హామీ ఇవ్వకపోయినా వానాకాలం వస్తే చాలు నగరం మొత్తం ఓ సముద్రమే. నాటు పడవలు, బోట్లు కూడా ఈ సముద్రంలో చక్కర్లు కొడుతాయి. కాకపోతే అవి వరదలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తిరుగుతుంటాయి. దీనికి కారణం నాలాలు, చెరువులు, కుంటలను చివరికి దారులను కూడా కబ్జా చేసి దర్జాగా ఇళ్ల నిర్మాణం చేయటమేననే అభిప్రాయాలున్నాయి. వరంగల్ నగరంలో 10లక్షలకు పైగా జనాభా, 1,500కు పైగా కాలనీలున్నాయి. అయితే నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో లోతట్టు ప్రాంతాలు ప్రతీ ఏటా నీట మునిగిపోవాల్సిందే. భారీ నిర్మాణాలతో నగరం కాంక్రీట్ జంగల్‌గా మారిపోయింది. అడ్డదిడ్డంగా నిర్మించిన ఇళ్లతో నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవటంతో వానాకాలం కష్టాలు తప్పటం లేదు. అయితే ఈ కష్టాలకు కాస్తంత ఊరటనిచ్చేది అండర్ డ్రైనేజీ వ్యవస్థేనని అని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. వరంగల్ నగరం స్మార్ట్ సిటీ కింద ఎంపికైనా నిధులు సక్రమంగా విడుదల కాకపోవటంతో అభివృద్ధికి అడుగులు పడటం లేదు. అన్ని పార్టీలు కూడా అండర్ డ్రెయినేజీపై హామీలు ఇస్తుండటంతో ఓటర్లలో ఆశలు చిగురిస్తున్నాయి.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు గ్రహణం వీడేనా?

వరంగల్‌లో అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్‌కు నిర్మాణం కోసం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట శివారులో 22 అక్టోబరు 2017న భూమి పూజ చేశారు. 1,350 ఎకరాల్లో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్కు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమందికి పైగా ఉపాధి అవకాశాలు లభించేవి. అయితే ఏడేళ్లుగా టెక్స్ టైల్ పార్కు నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వంతో 22కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నా కేవలం రెండు కంపెనీలు మాత్రమే ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభించాయి. అయితే 18 మార్చి 2023న కేంద్రం ప్రభుత్వం పీఎం మిత్ర కింద వరంగల్ టెక్స్‌టైల్ పార్కును ఎంపిక చేసింది. కానీ అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిపెట్టకపోవటంతో మెగా టెక్స్‌టైల్ పార్కు లక్ష్యం నీరుగారుతుంది. గెలిచే అభ్యర్థి మెగా టెక్స్‌టైల్ పార్కును గాడిలో పెట్టాలని ఓరుగల్లు వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విమానం ఎగురచ్చునేమో..?

నిజాం కాలంలో రయ్ రయ్ మంటూ ఆకాశంలోకి ఎగిరిన విమానం.. ఇంత సాంకేతికంగా అభివృద్ధి చెందిన తరువాత మాత్రం గగనమైపోయింది. 2017లోనే ఉడాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేసి, విమాన సర్వీసులు నడిపేందుకు ముందుకు వచ్చింది. అయితే హైదరాబాద్ నుంచి 150 కిలో మీటర్ల దూరంలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయవద్దని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వాహణ సంస్థ జీఎంఆర్‌తో ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్నాయి. హైదరాబాద్ నుంచి 140కిలో మీటర్ల దూరంలో మామునూరు ఎయిర్‌పోర్టు ఉండటంతో ఆ ఒప్పందం ఆటంకంగా మారుతుంది. దీనికి తోడు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన మరో సుమారు 504 ఎకరాల భూమి సేకరణ కూడా సమస్యగా మారింది. ఈ రెండు సమస్యలు పరిష్కరిస్తే వరంగల్ నుంచి ఆకాశయానం చేసే చాన్స్ దక్కుతుంది. అంతేకాదు అనేక పరిశ్రమలు, వ్యాపార సంస్థలు వరంగల్ కేంద్రంగా

మిగతా 7వ పేజీలో..



ఎండ వేడిమికి టోపీలు, కర్చీఫ్‌లు ధరించి ప్రయాణిస్తున్న నగరవాసులు



రారెత్తిస్తున్న ఎండలు

46.5 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత

- వడగాడ్పులకు అల్లాడుతున్న జనం

హనుమకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్నిగోళంగా మండుతోంది. మండుతున్న ఎండలతో జనం అల్లాడుతున్నారు. భానుడు తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గరిష్ట పగటి ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో 46.5 డిగ్రీలకే చేరింది. ఇది జిల్లా చరిత్రలో ఇది అసాధారణమైన పరిస్థితి. ఎండ తీవ్రతకు వడగాలులు కూడా తోడయ్యాయి. వడగాలుల వల్ల గాలిలో తేమశాతం పూర్తిగా తగ్గిపోయి ఉష్ణోగ్రత దారుణంగా పెరుగుతోంది. గురువారం ములుగు జిల్లాలో అత్యధికంగా 46.5 డిగ్రీలు నమోదైంది. మహబూబాబాద్‌లో 46.3 డిగ్రీలు, వరంగల్‌లో 46.2 డిగ్రీలు, జనగామలో 45.6 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.5 డిగ్రీలు, హనుమకొండలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో 20 జిల్లాలో 45 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఇందులో ఆరు జిల్లాలో ఉమ్మడి వరంగల్ పరిధిలోనివే. పది రోజులుగా ఆందోళన

మిగతా 8వ పేజీలో..

మోదీతోనే దేశాభివృద్ధి

- కశ్మీర్ ప్రజలకు విముక్తి కల్పించాడు..
- కాంగ్రెస్ హయాంలో మత కల్లోలాలు, కుంభకోణాలు, కర్ఫ్యూలు
- కడియం శ్రీహరి వెన్నుపోటుదారుడు
- బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ స్థానికేతరుడు
- ప్రచారంలో వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్



పెగడపల్లి డబ్బాల జంక్షన్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి

హనుమకొండ టౌన్, మే2: భారత దేశం అభివృద్ధి జరగాలంటే మోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని, తద్వారా దేశ ప్రజలు సురక్షితంగా ఉంటారని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 5, 6, 51, 52, 53, 54, 57 డివిజన్‌లల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్స్‌లో అరూరి రమేశ్ పాల్గొని మాట్లాడారు. మే 13న జరుగుతున్న ఎన్నిక దేశాన్ని తన పొత్తిళ్లలో పెట్టుకొని కాపాడే నాయకుడిని ఎన్నుకోవడానికి జరిగేదన్నారు. 50ఏళ్ల కాంగ్రెస్‌పాలనలో కర్ఫ్యూలు, బోఫోర్స్ కుంభకోణం, మతకల్లోలాలు, నిత్యం 144 సెక్షన్‌తో పేదలను విస్మరించిందన్నారు. కానీ మోదీ పదేళ్లలో దేశాన్ని ఎలా అభివృద్ధి చేశారో గమినించాలన్నారు. భారత్‌లో అంతర్భాగమైన కశ్మీర్‌ను కాంగ్రెస్ పట్టించుకోకపోతే అక్కడి ప్రజలు ఎన్ని విధాలుగా ఇబ్బందులు పడ్డారో దేశ ప్రజలం దరికీ తెలుసన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేసి అక్కడి ప్రజలకు విముక్తిని కలిగించి స్వేచ్ఛను కల్పించారన్నారు. ఇతర దేశాలు మన దేశం వైపు కన్నెత్తి చూడకుండా దేశ సరిహద్దుల్లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసి దేశ ప్రజలు కంటి నిండా నిద్రపోయేలా చేశాడన్నారు.

బీసీ కులంలో పుట్టి, చాయ్ అమ్ముకునే పరిస్థితి నుంచి ప్రధానిగా ఎదిగిన మోదీకి పేద ప్రజల కష్టాలు తెలుసని, అందుకే పేదల కోసం అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని అరూరి అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రామమందిర నిర్మాణంలో ఒక్క రక్తం చుక్క కారకుండా ప్రశాంతమైన వాతావరణంలో బలరాముడి ఆలయం నిర్మింపజేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు.



ప్రచారంలో భాగంగా ఓ హోటల్‌లో పూరీలు కాలుస్తున్న అరూరి

భారత్‌కు చెందిన 25,000 మంది వైద్య విద్యార్థులు ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో చిక్కుకుంటే అక్కడ ప్రభుత్వాలతో మాట్లాడి ఆరు రోజులు యుద్ధం నిలిపివేయించి మన విద్యార్థులను మన దేశానికి తీసుకొచ్చిన ఘనత మోదీకే సాధ్యమైందన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెన్నుపోటుదారుడని, రాజకీయ జన్మనిచ్చిన ఎన్‌టీఆర్‌తో పాటు చంద్రబాబు, కేసీఆర్‌ను వెన్నుపోటు పొడిచి చివరికి కాంగ్రెస్‌లో చేరాడన్నారు. అలాంటి వ్యక్తి కాంగ్రెస్‌లో ఉంటాడన్న నమ్మకం కూడా లేదన్నారు. బీ ఆర్ఎస్ పార్టీలో ఉన్న తనతోపాటు రాజయ్య, దయాకర్‌ను పార్టీని వీడేలా చేసింది కడియం శ్రీహరి అని ఆరోపించారు. తనంత నిజా యితీపరుడులేడని గొప్పలు చెప్పుకుంటున్న శ్రీహరి. లెక్చరర్‌గా రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చినప్పుడు లేని అద్దాల మేడలు, విల్లాలు, కార్లు ఎలా సంపాదించాడో ప్రజలకు చెప్పాలని అరూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గుంటూరుకు చెందిన ముస్లిం వ్యక్తిని వివాహం చేసుకున్నాక మహ్మద్ కావ్య అ వుతుంది కానీ.. కడియం కావ్య ఎలా అవుతుందని ప్రశ్నించారు. కావ్యను గుంటూరువాసిగానే ప్రజలు పరిగణించి చిత్తుగా ఓడిం చాలని అరూరి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి స్థానికేతరుడని, కరీంనగర్ లోక్‌సభ పరిధికి చెందిన వ్యక్తి అన్నారు. మద్యం, మాంసం, డబ్బుకు ఆశపడి ఓటు అమ్ముకుంటే బిడ్డల భవిష్యత్తు నాశనమైతుందన్నారు.

అనేక హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్క హామీ అమలుచేయకుండా రాహుల్‌గాంధీ వస్తే అన్నీ అమలవుతాయని అంటోందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి మళ్లీ ఆగం కావొద్దని, యువత భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. తనకు ఓటు వేసి వరంగల్ ప్రతినిధిగా లోక్‌సభకు పంపిస్తే మామునూరు విమానశ్రయాన్ని పునరుద్ధరిస్తానని, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని అరూరి రమేశ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ జంక్షన్‌ల్లోని షాపులకు వెళ్లి అక్కడ పనిచేసే కార్మికులతో పాటు యజమానులను కమలం పువ్వుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కురివిండ్ల సదానందం, వాసుదేవరెడ్డి, సత్యనారాయణ, వివిధ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

తండాలను పంచాయతీలు చేయడంలో మోదీ కృషి

గిరిజన మోర్చా సమ్మేళనంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి



మాట్లాడుతున్న బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, మే1: తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దడంలో ప్రధాని నరేంద్రమోదీ కృషి ఉందని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. గురువారం హంటర్‌రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో గిరిజన మోర్చా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి అరూరి హాజరై మాట్లాడారు. తండాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక సబ్సిడీ రుణాలు, పరికరాలు, వాహనాలను అందజేశామన్నారు. గిరిజన ఉత్పత్తులు, మార్కెటింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం సంస్థాగత మద్దతును అందించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో వృత్తి శిక్షణ కేంద్రాలను నెలకొల్పారన్నారు. మోదీ అందిస్తున్న సంక్షేమ ఫలాలను గిరిజన మోర్చా నాయకులు వివరించాలని పిలుపునిచ్చారు. వరంగల్ గడ్డపై కాషాయపు జెండా ఎగురవేసేందుకు నిర్విరామంగా కృషిచేస్తున్న గిరిజన మోర్చా నాయకులకు ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ కేంద్ర మంత్రి అమర్‌సింగ్ తిలావత్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్, పార్లమెంట్ ప్రభారి మురళీధర్, వెంకటేశ్, సురేందర్, శ్రీనువాస్, రాజేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సామాజిక వర్గంలోనూ పేదలు ఉన్నారు..

- రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అగ్రవర్ణాల పేదలకూ సంక్షేమ ఫలాలు అందాలి
- అవినీతికి కేరాఫ్ అరూరి రమేశ్
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



రెడ్డి సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

భీమారం/నయీంనగర్, మే 2: రెడ్డి సామాజిక వర్గంలోనూ నిరుపేదలు ఉన్నారని, వారికి సహాయ, సహకారాలు అందేలా కృషి చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. గురువారం హసన్‌పర్తి ఎర్రగట్టు గుట్ట వద్ద గల కేఎల్ఎన్ కన్వెన్షన్ హాలులో తెలంగాణ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కృతజ్ఞత సభ జరిగింది. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. రెడ్డి సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంఘానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వరంగల్‌లోని సంఘం సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. రెడ్డి నాయకత్వం బలంగా ఉన్న చోట పార్టీ కూడా బలంగా ఉంటుందన్నారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా కూడా అవినీతికి తావు లేదని శ్రీహరి చెప్పారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని న్యాయం చేశానన్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు తనపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని శ్రీహరి విమర్శించారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని కడియం పేర్కొన్నారు.



న్యాయవాదులతో సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య

వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. అవినీతికి కేరాఫ్ అడ్రస్ వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ అని ఆరోపించారు. రమేశ్‌కు ఓటు వేస్తే భూములు రాసి ఇచ్చినట్లే అన్నారు. రెడ్డి సంక్షేమ సంఘానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే సంఘానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని కావ్య పేర్కొన్నారు. అగ్రవర్ణాలలో ఉన్న పేదలకు సైతం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాల్సి ఉందన్నారు. తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కావ్య వెల్లడించారు.

బీజేపీవి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

దేశంలో బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఆరోపించారు. హనుమకొండ నయీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ పార్టీ న్యాయవాదుల పరిచయ సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ కడియం కావ్య ప్రసంగించారు. ప్రజాస్వామ్య పాలనలో ప్రజాభిప్రాయానికి అనుగుణమైన పాలన జరగాల్సి ఉండగా, బీజేపీ ఇందుకు వ్యతిరేకంగా నియంత పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ తదితర నిఘా సంస్థలను అడ్డు పెట్టుకొని బెదిరింపులకు గురి చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర పనుతున్న బీజేపీని మళ్లీ అధికారంలోకి తెస్తే దేశానికి పెను ప్రమాదమేనన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీజేపీని గద్దె దించాలని కోరారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సెల్ లీగల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్, ఏఐసీసీ లీగల్ సెల్ కో-ఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి, మెంబర్స్ మహాత్మా, జగన్మోహన్‌రెడ్డి, వరంగల్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ముదశిర్, హనుమకొండ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లడే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక పథకం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

నయీంనగర్, మే 2: ఆటోడ్రైవర్లకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టడానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లో ఆటో యూనియన్ సభ్యుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఫ్రీ బస్ పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు నష్టం జరిగిందని, ఆటో కార్మికులకు లైసెన్స్‌ల గురించి సంబంధిత అధికారులతో వచ్చి మాట్లాడతానని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. వరంగల్ జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారని, వరంగల్ నగర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవినీతి మరకలేని వ్యక్తి కడియం శ్రీహరి అని, ప్రజల సమస్యలు పార్లమెంటులో వినిపించే వ్యక్తి కడియం కావ్య అని ఆయన తెలిపారు. భూకబ్జాలు చేసే అరూరి రమేష్ కావాలా.. ఉన్నత విద్యావంతురాలు కడియం కావ్య కావాలా.. ఆలోచన చేయాలని ఆయన ప్రజలను కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. కరోనా సమయంలో కడియం ఫౌండేషన్ ద్వారా ఆటోకార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు. ఆటో కార్మికుల పిల్లల ఉన్నత విద్యకు కడియం ఫౌండేషన్ సహాయ సహకారాలు అందిస్తోందని అన్నారు. ఆటో కార్మికుల కోసం ఉచిత హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, తనను ఆశీర్వదించాలని కడియం కావ్య కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆటో కార్మికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కావ్యను గెలిపించండి

కాజీపేట టౌన్: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. కాజీపేట 61వ డివిజన్‌లోని వడ్డెపల్లి ట్యాంక్‌బండ్ వాకర్స్‌ను గురువారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో వాకింగ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అంతకుముందు వడ్డెపల్లి ట్యాంక్‌బండ్‌పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ పనుల నాణ్యతా పరంగా అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పలువురు వాకర్లు ఎమ్మెల్యేకు ఫిర్యాదులు చేయడం గమనార్హం. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ ఎలికంటి రాములు, నాయకులు నాగరాజు, తదితరులు ఉన్నారు.

సుస్మిత బతికే ఉందా?

- ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిందని పోలీసుల సమాచారం
- మృతదేహంపై ఆనవాళ్లు లేవన్న తండ్రి, బాబాయి
- బతికే ఉంటుందని కుటుంబ సభ్యుల ఆశాభావం



తిక్క సుస్మిత (ఫైల్)

హసన్‌పర్తి, మే 2 : చత్తీస్‌గఢ్ అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 10 మందిలో 8 మందిని పోలీసులు గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలుగువారుగా గుర్తించారు. ఈ ముగ్గురిలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సూధన్‌పల్లి గ్రామానికి చెందిన తిక్క సుస్మిత(26) అలియాస్ చైతేగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు చత్తీస్‌గఢ్ పోలీసులు సుస్మిత కుటుంబసభ్యులకు సమాచారాన్ని అందజేశారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతదేహాన్ని నారాయణపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. సుస్మిత తండ్రి సుధాకర్, బాబాయి దేవేందర్ హుటాహుటిన బుధవారం సాయంత్రం చత్తీస్‌గఢ్‌కు బయలుదేరారు. వారు మృతదేహాన్ని చూసి తమ కూతురు సుస్మిత కాదని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అక్కడి నుంచి సమాచారాన్ని సూధన్‌పల్లిలోని కుటుంబ సభ్యులకు చేరవేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో బంధువులతో పాటు గ్రామస్తులు కూడా సంతోషించారు.

సుస్మితను గుర్తింపునకు ఆనవాళ్లు

సుస్మితకు చిన్నప్పుడు ఫిట్స్ వచ్చేదని బంధువులు, గ్రామస్తులు తెలిపారు. ఫిట్స్‌ను నయంచేయడానికి సుస్మితకు తలకు ఇరువైపులా, నుదుటిపై రూపాయి బిల్ల వెడల్పుతో కాల్చిన గుర్తులు మూడు ఉండేవని చెప్పారు. ఆస్పత్రి మార్చురీలో ఉన్న మృతదేహాన్ని చూసి మృతదేహం సుస్మితది కాదని తండ్రి సుధాకర్, బాబాయి దేవేందర్ నిర్ధారించుకున్నారు. ఇదే విషయాన్ని వెంటనే తమ కుటుంబసభ్యులకు తెలిపారు. తర్వాత నుంచి వారి ఫోన్ పనిచేయడం లేదని బంధువులు వాపోతున్నారు. చత్తీస్‌గఢ్‌కు వెళ్లి వచ్చినవారు చెబితే గాని నిజాలు తెలుస్తాయని కుటుంబసభ్యులు, గ్రామస్తులు అంటున్నారు.

ఉద్యమ ప్రస్థానం

హసన్‌పర్తి మండలం సూధన్‌పల్లికి చెందిన తిక్క సుధాకర్-సరోజన దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. వృత్తి వ్యవసాయం. సుధాకర్, అతడి తమ్ముడు తిక్క దేవేందర్‌లు మావోయిస్ట్ సానుభూతిపరులు. మొదటి కూతురు సుస్మిత ఇంటర్ చదివి పీపుల్స్‌వార్‌కు ఆకర్షితురాలై 2014లో ఉద్యమ బాట పట్టింది. కుటుంబసభ్యులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇప్పించి జనజీవన స్రవంతిలో కలవాలని పలుమార్లు తల్లిదండ్రుల ద్వారా లొంగిపోయేందుకు ప్రయత్నించారు. ఎంతకీ సమాచారం తెలియరాలేదు. దండకారణ్యంలో అంచెలంచెలుగా ఎదిగిన సుస్మితపై రూ.2లక్షల రివార్డును ప్రభుత్వం ప్రకటించింది. అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో సుస్మిత మరణించిన విషయం కుటుంబ సభ్యులు ధ్రువీకరిస్తేగాని అసలు విషయం తెలుస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాజీపేట, మే 2: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్‌ఎదుట పార్సిల్ ఆఫీస్ వద్ద గత నెల 29న గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వయస్సు 40-50 సంవత్సరాలు, ఎత్తు 5.5. పొడువైన నలుపు ముఖం, చినిగిపోయిన బట్టలు ధరించి ఉన్నాడు. స్థానికులు సమాచారం మేరకు 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎంతరలించారు. చికిత్సపొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి ఆనవాళ్లను బట్టిచూస్తే యాచకుడిగా భావిస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 8712685008, 8712685122, నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని కాజీపేట పోలీసులు తెలిపారు.

నకిలీ క్లినిక్‌పై వైద్య మండలి తనిఖీ



తనిఖీ చేస్తున్న వైద్య మండలి సభ్యులు

వరంగల్ మెడికల్ మే 2 : ఇటీవల వర్ధన్నపేటలో నకిలీ వైద్యుడు ఆడెపు శ్రీనివాస్ తెలియని వైద్యం చేయడంవల్ల మృతి చెందిన కత్తి నవీన్ సంఘటనను సుమోటోగా స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యులు, వరంగల్ యాంటీ క్వికరీ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు నకిలీ వైద్యుడి క్లినిక్‌ను గురువారం సందర్శించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి విద్యార్హత లేకుండా తెలిసీ తెలియని వైద్యం చేయడం వల్లే నిండుప్రాణం బలైందని తెలిపారు. జరిగిన సంఘటన ఆధారంగా సమగ్ర నివేదిక తయారు చేసి హైదరాబాద్‌లోని రాష్ట్ర వైద్య మండలికి పంపనున్నట్లు విచారణ కమిటీ సభ్యులు తెలిపారు. విచారణ కమిటీలో తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్‌కుమార్, ఐఎంఏ వరంగల్ అధ్యక్షులు డాక్టర్ అన్వర్‌మియా, ఉపాధ్యక్షుడు డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేశ్ ఉన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

హనుమకొండ టౌన్, మే 2 : హనుమకొండ మచిలీబజార్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి అన్వర్ అదృశ్యమయ్యాడు. ఎం.డి. అన్వర్ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మూడు సబ్జెక్టులలో ఫెయిలయ్యాడు. దీంతో అన్వర్ ఈ నెల 29న రాత్రి 8 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికిన సమాచారం లేకపోవడంతో విద్యార్థి తండ్రి ఇంతియాజ్ అహ్మద్ గురువారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ములుగు నుంచి ముగ్గురు ఎంపీలు

- పల్లె నుంచి పార్లమెంటుకు..
- ఢిల్లీలో మెరిసిన గిరిజన బిడ్డలు


చందూలాల్


బలరాంనాయక్


సీతారాంనాయక్

ములుగు, మే 2 : భౌగోళికంగా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ములుగు ప్రాంతం రాజకీయ రంగంతో తనదైన ముద్ర వేసుకున్నది. ఇక్కడి మారుమూల పల్లెల నుంచి ఢిల్లీ వరకు నేతలుగా ఎదిగిన పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. రాష్ట్ర, కేంద్రమంత్రులుగా మెరిశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాటి, నేటి నేతల ప్రస్థానాన్ని, ములుగు రాజకీయ ముఖచిత్రాన్ని ప్రజలు నెమరువేసుకుంటున్నారు.

ముగ్గురు ఎంపీలూ లంబాడాలే..

ములుగు ప్రాంతం నుంచి ఇప్పటివరకు ముగ్గురు ఎంపీలుగా ఎన్నికై పార్లమెంటులో సత్తా చాటారు. వీరంతా లంబాడా సామాజికవర్గానికి చెందినవారు కావడం గమనార్హం. ఇక్కడ ఆదివాసీల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ రాజకీయంగా లంబాడీలకే అవకాశాలు వచ్చాయి. ములుగు మండలం జగ్గన్నపేట పంచాయతీ పరిధి సారంగపల్లెకు చెందిన అజ్మీరా చందూలాల్ 1996లో టీడీపీ తరుపున పోటీచేసి వరంగల్ ఎంపీగా ఎన్నికయ్యారు. అప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 1998 ఎన్నికల్లో కూడా ఆయన ఎంపీగా గెలిచారు. పదకొండేళ్ల విరామం తర్వాత 2009లో పోరిక బలరాంనాయక్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయనది ములుగు మండలం మదనపల్లి. లోక్‌సభ పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పడ్డ మహబూబాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. సోషల్ జస్టిస్, ఎంపవర్మెంట్ శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) అభ్యర్థిగా బరిలో నిలిచిన వెంకటాపూర్(రామప్ప) మండలం మల్లయ్యపల్లికి చెందిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ ఎంపీగా విజయం సాధించారు.

తొలి ప్రయత్నంలోనే విజయతీరాలకు..

ఈ ముగ్గురు నేతలూ తొలి ప్రయత్నంలోనే విజయాలనందుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా అసెంబ్లీలో తనదైన ముద్రవేసుకొని రాజకీయ అనుభవం కలిగిన చందూలాల్‌కు జనరల్ స్థానమైన వరంగల్ నుంచి పోటీచేసే అవకాశం యాదృచ్ఛికంగా వచ్చినప్పటికీ మహబూబాబాద్, నర్సంపేట, ములుగు డివిజన్‌లలోని గిరిజన ఓటర్లను ప్రభావితం చేయడంలో సక్సెస్ అయ్యారు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లానుంచి పార్లమెంటులో అడుగుపెట్టిన తొలి గిరిజనుడిగా గుర్తింపు పొందారు. ఇదే తరహాలో 2009లో గెలిచిన బలరాంనాయక్ కూడా పోటీచేసిన మొదటి ఎన్నికలోనే విజయం సాధించి ఏకంగా కేంద్రమంత్రి అయ్యారు. 2014లో ఎంపీగా ఎన్నికైన సీతారాంనాయక్‌కు సైతం అదే తొలి ఎన్నిక. కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, తెలంగాణ ఉద్యమకారుడిగా సుపరిచితుడైన ఆయన పార్లమెంటు సభ్యుడిగా తనదైన పాత్ర పోషించారు.

ఈసారి బరిలో ఇద్దరు..

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో మహబూబాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్, బీజేపీ అభ్యర్థిగా సీతారాంనాయక్ బరిలో ఉన్నారు. వీరిలో ఎవరు గెలిచినా ఐదోసారి ములుగు ప్రాంత నేతకు పార్లమెంటులో ప్రాతినిథ్యం వహించే అవకాశం దక్కినట్లవుతుంది. ఈనేపథ్యంలో జిల్లావాసులు మే 13నాటి ఎన్నికలు, తర్వాత వెలువడే ఫలితాలపై అమితాసక్తిని కనబర్చుతున్నారు.

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయండి

వరంగల్ కలెక్టరేట్, మే 2: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ఫిర్యాదుల కోసం మొబైల్ నెంబర్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి మొత్తం 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఫిర్యాదులను ఎన్నికల సాధారణ పరిశీలకులు బండారి స్వాగత్ రణ్‌వీర్ చంద్ మొబైల్ నెంబర్ 82475 24267కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. లేదా కాజీపేట నిట్‌లోని అబ్దుల్ కలాం గెస్ట్‌హౌస్‌లో ప్రతి రోజు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య నేరుగా కలిసి ఎన్నికల సంబంధిత అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని ప్రకటనలో తెలిపారు.

5కే రన్‌ను విజయవంతం చేయాలి : కలెక్టర్


5కే రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

వరంగల్ కలెక్టరేట్, మే 2 : ఈ నెల 5న నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో 5కే రన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమంలో భాగంగా 13న జరిగే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్య పరిచేందుకు 5కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5కే రన్‌లో విద్యార్థులు, యువత, మహిళలు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా యువజన, క్రీడల అధికారి అశోక్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తొర్రూరు మండలంలో ఎన్నికల ప్రచారం


వెల్లికట్టెలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్, మే 2: అబద్ధాలతో గద్దె నెక్కిన కాంగ్రెస్‌ను, పేద ప్రజలపై భారం మోపుతున్న బీజేపీలను ఓడించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోసం ఎర్రబెల్లితో పాటు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తొర్రూరు మండలంలోని నాంచారిమడూరు, వెలికట్టె, చింతలపల్లి, గుర్తూర్, పత్తేపురం, చెర్లపాలెం, మాటేడు, హరిపిరాల, వెంకటాపురం శివారు తండాలు, గ్రామాల్లో గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వెల్లికట్టెలో ఈజీఎస్ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమి లేదని, బీఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు.

అనంతరం ఆయా గ్రామాల్లో కార్యకర్తలు, ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కనీసం తాగు నీటిని కూడా అందించలేని పరిస్థితిలో ఉన్నారు. అతి తక్కువ రోజుల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తున్నందున కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బీఆర్ఎస్ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు మార్పు కోరుతూ ఒక ఓటు వేస్తే ఇద్దరు ఎమ్మెల్యేలు వచ్చారని, ఇది ఎక్కడా లేని విధంగా ఉందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ తప్పిదాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుడికి, మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తి నిలదీసే మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ రాగానే కరువు, కష్టాలు, కరెంట్ కోతలు మళ్లీ మొదలైనట్లు వివరించారు.

ప్రజల ప్రయోజనాల కోసం పాటుపడుతాం..

పదేళ్ల అధికారంలో ఉండి దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి చేశామని, అధికారం లేకపోయిన ప్రతిపక్షంలో ఉండి ప్రజల ప్రయోజనాలకోసం పాటుపడుతామని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. తొర్రూరు మండలంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగేవిధంగా చూస్తామని, సంక్షేమపథకాలు ప్రజలకు అందకుంటే ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. నమ్మించి మోసం చేసిన వారికి ఈ ఎన్నికల్లో శాశ్వతంగా రాజకీయంగా రాజకీయ సమాధి చేయాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పేదల నడ్డివిరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అనంతరం అమ్మాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిన్నెర నగేష్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాడ సానుభూతిని వ్యక్తంచేశారు. పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ప్రమోద్ కుమార్, పట్టణ అధ్యక్షుడు అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, పోసాని రాములు, సంతోష్, దేవేందర్‌రావు, పాపిరెడ్డి, మేరుగుప్రకాష్, రమేష్, కుమార్, జాటోతు రమేష్, కాలునాయక్, కొండవెంకన్న, మురళి, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటాం..

- పార్టీని కాపాడుకోవడంలో లీగల్ టీం తోడ్పాటునందిస్తుంది
- బీఆర్ఎస్ లీగల్ సెల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌కుమార్



రాంనగర్, మే 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీఆర్ఎస్ శ్రేణులపై మోపే అక్రమ కేసులను లీగల్ సెల్ ద్వారా ఎదుర్కొంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సోమా భరత్‌కుమార్ భరోసా ఇచ్చారు. గురువారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అడ్వకేట్ జనార్ధన్‌గౌడ్ అధ్యక్షతన బీఆర్ఎస్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం కొట్లాడిన అనేక సంఘాల్లో లాయర్ల జేఏసీ అగ్ర స్థానంలో ఉందన్నారు. ఉద్యమ స్థానంలో ఢిల్లీలో సైతం లాయర్ల జేఏసీ కొట్లాడిందన్నారు. ఉద్యమకారులపై పెట్టిన కేసుల విషయంలో లాయర్లు సొంతంగా ఖర్చులు పెట్టి విడిపించారని భరత్‌కుమార్ గుర్తు చేశారు. న్యాయవాదులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు బడ్జెట్‌లో కేసీఆర్ నిధులు కేటాయించారని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. పార్టీకి అనుబంధంగా ఉంటూ సేవలందిస్తున్న న్యాయవాదులకు రానున్న రోజుల్లో సముచిత స్థానం కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. న్యాయవాదులు తన గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్‌లో అనేక రకాలుగా లబ్ధిపొంది స్వలాభం కోసం పార్టీని వీడినవారు తన ప్రత్యర్థులని ఆయన తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు తగు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కుడా మాజీ చైర్మన్‌లు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సమావేశం ప్రారంభంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బీఆర్ఎస్ లీగల్ సెల్ కమిటీని రాష్ట్ర అధ్యక్షులు భరత్‌కుమార్ ప్రకటించారు.

హనుమకొండ, వరంగల్ జిల్లా నూతన కమిటీ

అధ్యక్షుడిగా గుర్రాల వినోద్, ఉపాధ్యక్షులు శ్రీరాం కిరణ్‌కుమార్, నాయిని రవి, వసంత్‌యాదవ్, వేణు పటేల్, ఎంకే అంబేద్కర్, అంజయ్యగౌడ్, అబ్దుల్ నబీ, ప్రధాన కార్యదర్శి జి.శివరాజ్, కోశాధికారి పి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు పి.బస్వరాజ్, శ్రీరామ్ నాయక్, మహేష్ పటేల్, నవీన్‌కుమార్, రాంప్రసాద్, అరుణ, కమిటీ సభ్యులు సమ్మిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, సంపత్, జాషువా, ఉషా, రాజు, చంద్ పాషా, మల్లేశం, గౌరవ సలహాదారులు ఎం.సహోదర్‌రెడ్డి, జనార్ధన్‌గౌడ్, గణేష్, శ్యామ్‌సుందర్‌రావు, సోమేశ్వర్‌రావు, బాల కిషన్‌రావు, రంజిత్, భద్రయ్య, శ్రీనివాస్‌రావు.

స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన



ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్ మే 2: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం లష్కర్ సింగారంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్లు, సిబ్బందితో కలిసి ఓటరు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సమ్మయ్యనగర్ మీదుగా 100 ఫీట్ల రోడ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో విధిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మానవహారం నిర్వహించి ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, సీహెచ్ఓ టి.మాధవరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ బాబు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రవీందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లు షురూ

- తొలిరోజు ముగ్గురు అభ్యర్థుల నామినేషన్
- నేడు దాఖలు చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - నల్లగొండ)

శాసనమండలి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల స్థానానికి జరగబోయే ఉపఎన్నికకు నామినేషన్ల ఘట్టం మొదలైంది. ఈ ఎన్నికకు సంబంధించి నల్లగొండ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈనెల 9వరకు నామినేషన్ల దాఖలుకు గడువుండగా.. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులుగా ఎవరిని ఎంపిక చేస్తారన్నదానిపై ఉత్కంఠ కనిపిస్తోంది. మూడు ఉమ్మడిజిల్లాల్లోని మొత్తం 12 జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో పోటీకి ఆయా పార్టీల మద్దతు కోరుతూ కీలకనేతలు ప్రయత్నాలు చేస్తుండడంతో అభ్యర్థిత్వం ఎవరికి దక్కుతుందనేని ఆసక్తిని రేపుతోంది. ఈనెల 9వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనుండగా.. పదో తేదీన పరిశీలన జరగనుంది. 13న ఉపసంహరణకు చివరి రోజు. కాగా.. 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత వచ్చే నెల 5వ తేదీన పట్టభద్రుల ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు నిర్వహించగనున్నారు.

తొలిరోజు నామినేషన్ వేసింది వీరే..

స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్, ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌రెడ్డి ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

నేడు తీన్మార్ మల్లన్న నామినేషన్

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లో ఆయన నామినేషన్ దాఖలు చేయనుండగా ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా ఆ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేసుకున్నారు.

ఎన్ని'కలలో'..

(5వ పేజీ తరువాయి)

కార్యకలాపాలు ప్రారంభించి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే అవకాశాలున్నాయి. విమానాశ్రయంపై అన్ని పార్టీలు హామీలు ఇస్తుండటంతో గగనయానంపై ఓరుగల్లువాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

భూపాలపల్లికి రైల్వేలైన్ వచ్చేనా..?

పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లికి రైల్వేలైన్ కలగానే మిగిలింది. 1998 నుంచి భూపాలపల్లి రైల్వేలైన్ డిమాండ్ తెరపైకి రాగా.. పలుమార్లు సర్వేలు నిర్వహించినా రైల్వేలైన్‌కు మోక్షం లభించలేదు. అయితే 2022-23 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కాజీపేట- భూపాలపల్లి మధ్య 64కి.మీ నిర్మించే రైల్వే లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే కోసం రూ.1,152కోట్లు కేటాయించింది. అలాగే రామగుండం వయా భూపాలపల్లి టు మణుగూరుకు 198కిలో మీటర్ల రైల్వేలైన్ నిర్మాణం కోసం రూ.3,600కోట్లు కేటాయించారు. అయితే కొంత వరకు సర్వే చేసి అధికారులు వదిలేశారు. దీంతో భూపాలపల్లి రైల్వేలైన్ కలగానే మిగులుతుందా అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎంపీగా గెలిచే అభ్యర్థి రైల్వేలైన్‌కోసం కృషి చేయాలని ఓటర్లు కోరుతున్నారు. దీంతోభూపాలపల్లి నుంచి కాజీపేట వరకు ప్రయాణంతో పాటు పారిశ్రామికంగా భూపాలపల్లి మరింత అభివృద్ధి చెందేందుకు పరిశ్రమలువచ్చే అవకాశముందనే అభిప్రాయాలున్నాయి.

నెరవేరని లెదర్ పార్కు కల..

చర్మకారులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ కేంద్రంలోని శివునిపల్లి లెదర్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 117 ఎకరాల్లో రూ.275కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో లెదర్ పార్కు నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు చేశారు. అయితే ప్రతిపాదనలు అటకెక్కటంతో 2002లో టీడీపీ ప్రభుత్వ హయంలో 25 ఎకరాల్లో మినీ లెదర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు .10కోట్ల నిధులు కూడా కేటాయించారు. ఇందుకోసం తొలి విడతలో స్థానికంగా ఆసక్తితో ఉన్న 50మందికి చెన్నైలో చెప్పులు తయారు చేయటం, లెదర్ బ్యాగులు, ఇతర లెదర్ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కూడా ఇప్పించారు. 2003లో రూ.10లక్షలతో లెదర్ పరిశ్రమ కోసం ఓ భవనం కూడా నిర్మించారు. మరో రెండు విడతల్లో 120మందికిపైగా లెదర్ ఉత్పత్తుల తయారిపై చెన్నైలో శిక్షణ కూడా ఇచ్చారు. అయినప్పటికి ఇప్పటి వరకు లెదర్ పార్కుకు మోక్షం లేదు. ప్రస్తుతం పోటీ చేస్తున్న అభ్యర్థులు స్టేషన్‌ఘనపూర్‌తో సంబంధాలున్న నేతలే కావడంతో గెలిచిన వెంటనే లెదర్ పార్కును పూర్తి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. వెయ్యి కుటుంబాలకు పైగా లెదర్ పార్కుతో ఉపాధి లభించే అవకాశాలున్నాయి.

అగమ్యగోచరంగా సైనిక్ స్కూల్ పరిస్థితి

కేంద్ర ప్రభుత్వం 2016లో వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా పునాదులు కూడా పడటం లేదు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు కావాల్సిన భూమి, భవనాల నిర్మాణం, ఇతర మౌళిక వసతుల కల్పన కోసం రూ.కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తిలో ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ఇక్కడ 229 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో 50 ఎకరాలను సైనిక్ స్కూల్‌కు కేటాయించాలని అధికారులు ప్రయత్నించారు. ఆ భూములను తీసుకుని రైతులకు పరిహారం ఇస్తామని అధికారులు చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. భూ కేటాయింపుల నిర్లక్ష్యంతో వరంగల్‌కు వచ్చిన సైనిక్ స్కూల్ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలిపోయే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై రాజకీయ పార్టీలు దృష్టిసారించి వరంగల్ సైనిక్ స్కూల్‌కు మోక్షం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మరికొన్ని అభివృద్ధి పనులు, సమస్యలు

- మడికొండలో వీవర్స్ పార్కు అభివృద్ధికి చేయూతనిచ్చేలా కేంద్రం నుంచి తీసుకురావాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.
- వరంగల్ మహానగరంలో ఐటీ టవర్స్‌ను తీసుకరావటం తో పాటు కొత్త పరిశ్రమలు వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని వరంగల్‌వాసులు ఆకాంక్షిస్తున్నారు.
- వరంగల్ ప్రాంత విద్యార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కొత్త కోర్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా దృష్టి పెట్టాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.
- ఖిలా వరంగల్ కోటను మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.
- భూపాలపల్లిలో సింగరేణి కార్మికులు అత్యధికంగా ఉండటంతో ఇక్కడ మైనింగ్ విద్యాలయంతో పాటు ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు కూడా చొరవ చూపాలన్న డిమాండ్ ఉంది.
- జనగామ నుంచి పాలకుర్తి మీదుగా మహబూబాబాద్‌కు వెళ్లే సుమారు 110కి.మీ రోడ్డును విస్తరించి నాలుగు లైన్ల రోడ్డు ను అభివృద్ధి చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది.
- వర్ధన్నపేటలో ఉన్న 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవనం నిర్మించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.
- స్టేషన్‌ఘనపూర్‌ను మునిసిపాలిటీగా మార్చాలని. 30పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్‌చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'ఆమె'కు ఏదీ స్థానం?

- వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో మహిళలకు ప్రాతినిధ్యం కరువు
- ఆరు దశాబ్దాల్లో ఈ రెండింటిలో గెలిచింది ఇద్దరే..
- ఈ సారి ఎన్నికల్లో బరిలో ఇద్దరు మహిళా నేతలు
- వరంగల్ లోక్‌సభ నుంచి కావ్య, మానుకోట నుంచి కవిత
- గెలుపే లక్ష్యంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం


డాక్టర్ కల్పనాదేవి


మాలోతు కవిత


కడియం కావ్య

హనుమకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల్లో ఆరు దశాబ్దాల కాలంలో మహిళల ప్రాతినిథ్యం ఆశించినంతగా పెరగలేదు. ఒకటి ఎస్సీకి, మరొకటి ఎస్టీకి రిజర్వు అయిన ఈ రెండు నియోజకవర్గాల్లో జరిగిన ప్రతీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు పురుష అభ్యర్థులను నిలబెట్టడానికే ప్రాధాన్యత ఇచ్చారు. పార్టీల సంస్థాగత నిర్మాణంలో, బలోపేతం కావడంలో గానీ క్రియాశీల భూమిక పోషించే వారిలో మహిళా నేతలు ఉన్నప్పటికీ వారికి ఎన్నికల్లో ఆశించిన ప్రాతినిథ్యాన్ని ప్రధాన పార్టీలు కల్పించలేకపోయాయి. నియోజకవర్గాల్లో పురుషులతో సమానంగా లేదా అంతకన్నా ఎక్కువ సంఖ్యలో మహిళా ఓటర్లున్నా.. వారిని పార్టీలు పట్టించుకోవడం లేదు. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 60ఏళ్లలో ఇప్పటి వరకు ఇద్దరు మహిళలు మాత్రమే లోక్‌సభలో అడుగుపెట్టడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఒకప్పుడు మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఉన్న భద్రాచలం ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గం ఇందుకు భిన్నంగా ముగ్గురు మహిళలు ఏడుసార్లు గెలిచారు.

వరంగల్ లోక్‌సభ నుంచి..

వరంగల్ లోక్‌సభ స్థానానికి 1952 నుంచి రెండు ఉప ఎన్నికలు కలుపుకొని 20సార్లు ఎన్నికలు జరిగినప్పటికీ మహిళకు ఒక్కసారి మాత్రమే పోటీకి అవకాశం లభించింది. 1984 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ పక్షాన డాక్టర్ టి.కల్పనాదేవి పోటీ చేశారు. విద్యావంతులు, డాక్టర్, టీచర్ వంటి వృత్తుల్లో ఉన్న వారు రాజకీయాల్లో రావాలని ఎన్‌టీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆమె టీడీపీలో చేరారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో నిలిచే అవకాశం లభించింది. 1984 ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కమాలొద్దీన్ అహ్మద్‌పై డాక్టర్ టి.కల్పనాదేవి 8,456 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అలా ఆమె వరంగల్ నుంచి లోక్‌సభలో అడుగుపెట్టిన తొలిమహిళగా నిలిచారు. ఆ తర్వాత 1989 ఎన్నికల్లో టీడీపీ నుంచి రెండోసారి పోటీ చేసినప్పటికీ అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం సురేందర్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. తదనంతర కాలంలో చోటుచేసుకున్న రాజకీయపరిణామాల నేపథ్యంలో డాక్టర్ కల్పనాదేవి కాంగ్రెస్‌లో చేరారు. 1998, 1999 ఎన్నికల్లో రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. ఆతర్వాత కాలంలో జరిగిన ఏ ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలేవి మహిళలకు టికెట్లు ఇవ్వలేదు.

హనుమకొండ నుంచి నిల్..

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రద్దయిన హనుమకొండ లోక్‌సభ స్థానం నుంచి ఒక్క మహిళ కూడా పార్లమెంట్‌లో అడుగుపెట్టలేదు.1977లో ఆవిర్భవించిన హనుమకొండ లోక్ సభ స్థానం 2009లో రద్దయింది. ఈ మధ్యలో జరిగిన ఎన్నికల్లో 2008 ఉపఎన్నికల్లో తప్ప మిగతా ఏ ఎన్నికల్లో ప్రధానపార్టీలు పోటీకి మహిళలకు అవకాశం ఇవ్వలేదు. 2008 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కొండా సురేఖ పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో ఆమె గెలువలేకపోయారు. టీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ 55వేల ఓట్ల మెజారిటీతో సురేఖపై విజయం సాధించారు.

మహిళా ఓటర్లే అధికం

వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. అయినా వారికి పోటీకి తగిన ప్రాతినిథ్యం లభించడం లేదు. గెలుపోటములను నిర్ణయించే స్థితిలో ఉన్నప్పటికీ వీరికి తగిన గుర్తింపు లభించడం లేదు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 36,298 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. 7,46,982 మంది పురుష ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 7,83,280 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో కూడా మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 8,91,940 మంది పురుష ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 9,24208 మంది ఉన్నారు. అంటే 32,268 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

మహబూబాబాద్ నుంచి ఒకసారి..

ఉప ఎన్నికతో కలుపుకొని ఆరుసార్లు ఎన్నికలు జరిగిన మహబూబాబాద్ ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి లోక్‌సభ అడుగుపెట్టడానికి ఒక మహిళకు మాత్రమే అవకాశం దక్కింది. 2019 ఎన్నికల్లో సీనియర్ నేత ఎస్ రెడ్యానాయక్ కూతురు మాలోతు కవితను టీఆర్ఎస్ తన అభ్యర్థిగా నిలబెట్టింది. ఈ ఎన్నికల్లో కవిత కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌పై గెలుపొందారు. ఈఎన్నికల్లో కవితకు 4.62 లక్షల ఓట్లు వచ్చాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ సిట్టింగ్ ఎంపీగా కవితకే టికెట్ ఇవ్వడంతో రెండో సారి పోటీ చేసేందుకు ఆమెకు అవకాశం లభించింది.

ఈసారి ఎన్నికల్లో..

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో వరంగల్, మహబూబాబాద్ స్థానాల నుంచి ఇద్దరు మహిళలో పోటీ పడుతున్నారు. వీరిలో ఒకరు రాజకీయాలకు కొత్త. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత రెండోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాగా, వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి సీనియర్ నేత కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. కావ్యకు మొదట బీఆర్ఎస్ నుంచి పోటీకి టికెట్ లభించినప్పటికీ మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో గెలుపోటములకుగల అవకాశాలను బేరీజు వేసుకొని చివరి నిమిషంలో అధికార పార్టీ అయిన కాంగ్రెస్ లో చేరి గెలుపు కోసం హోరాహోరీగా పోరాటం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, మహబూబాబాద్ నుంచి ఇద్దరు మహిళలు బరిలో ఉండడం ఉమ్మడి వరంగల్ రాజకీయ చరిత్రలో ఇదే మొదటి సారి.

విస్తృతంగా ప్రచారం

ఈ ఇద్దరు మహిళా అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు దీటుగా త్రీవస్థాయిలో పోటీ పడుతున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయక ఓటర్లను కలుపుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ ఇద్దరు మహిళా అభ్యర్థుల పోటీలో సారూప్యత ఉంది. మాలోతు కవిత రాజకీయాల్లోకి రావడానికి ఆమె తండ్రి సీనియర్ నేత, మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ ప్రోత్సాహం ఉన్నట్టే కడియం కావ్య మొదటిసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా రాజకీయాల్లో అడుగుపెట్టడానికి ఆమె తండ్రి మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రోద్బలం ఉంది. ఈ ఎన్నికల్లో ఈ ఇద్దరి పోటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. వీరికి ఓటర్ల మద్దతు ఏ మేరకు ఉన్నదనేది ఎన్నికల ఫలితాల తర్వాతగానీ తెలియరాదు. మాలోతు కవిత రెండోసారి తిరిగి విజయం సాధిస్తుందా, మొదటిసారి పోటీ చేస్తున్న కావ్యను గెలుపు వరిస్తుందా? అన్నదానిపై ఓటర్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

భద్రాచలంలో ముగ్గురు..

1965లో మహబూబాబాద్ లోక్‌సభ స్థానం రద్దయి ఆ స్థానంలో 1967లో మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ భాగంగా ఏర్పడిన భద్రాచలం ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గంలో ఇందుకు భిన్నంగా ఐదుగురి మహిళలకు పోటీ చేసే అవకాశం లభించింది. వీరిలో ముగ్గురు మహిళలు ఏడుసార్లు గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి బి.రాధాబాయి ఆనందరావు నాలుగు సార్లు, కె.కమలకుమారి రెండు సార్లు, దుంపా మేరీ విజయకుమారి ఒకసారి గెలుపొంది తమ సత్తా చాటారు. 1967, 1971, 1977, 1980 ఎన్నికల్లో వరుసగా కాంగ్రెస్ పక్షాన పోటీ చేసి సీపీఎం, సీపీఐ బీఎల్‌డీ అభ్యర్థులపై విజయం సాధించారు. ఆ తర్వాత 1984 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి సోడే రామయ్య చేతిలో ఆమె ఓడిపోయారు. 1989, 1991 ఎన్నికల్లో వరుసగా రెండోసారి కె.కమలకుమారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఆతర్వాత 1996, 1998 ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ గెలువలేకపోయారు. 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా దుంపా మేరీ విజయకుమారి కాంగ్రెస్ అభ్యర్థి టి.రత్నాబాయిపై గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా కేపీఆర్‌కే ఫణీశ్వరమ్మకు కూడా పోటీ చేసే అవకాశం వచ్చింది. కానీ విజయం సాధించలేకపోయారు.

బిర్లా విద్యా సంస్థల చైర్మన్‌కు పితృవియోగం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 2: బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యా సంస్థల చైర్మన్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు తండ్రి నడిపెల్లి రామచంద్రరావు(81) గురువారం మృతి చెందారు. కాగా ఆయన పార్థివదేహాన్ని హంటర్ రోడ్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో సందర్శనార్థం ఉంచగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మేయర్ రాజేశ్వర్ రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వెంకటేశ్వర్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రామచంద్రరావు పార్థీవదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బస్‌స్టేషన్‌లో ధరలు డబుల్

• హనుమకొండలో వ్యాపారస్తుల ఇష్టారాజ్యం • నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు • ఎంఆర్‌పీ రేటు కంటే డబుల్ రేటుకు అమ్ముతున్న వైనం • కొరవడిన ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ



ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఉన్న దుకాణాలు

న్యూశాయంపేట, మే 2: హనుమకొండ బస్‌స్టేషన్‌లో చిప్స్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ తదితర తినుబండా రాలు అమ్మే దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం వేలాది మంది వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు వస్తుంటారు. వారు వెళ్లేందుకు వచ్చే బస్సులు వచ్చే వరకు బస్‌స్టేషన్‌లోనే వేచి ఉంటారు. ఈ క్రమంలో ప్రయాణికులు దాహాన్ని, ఆకలిని తీర్చుకోవడానికి అందుబాటులో ఉన్న దుకాణాలను ఆశ్రయిస్తారు. ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు చిప్స్ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్, తదితర తినుబండారాలను ఎమ్మార్పీ రేట్ల కంటే డబుల్ రేట్లకు విక్రయిస్తున్నారు. అలాగే నాసిరకం వస్తువులు ఇస్తూ దోపిడీ చేస్తున్నారు.

డబుల్ రేటుకు అమ్ముతున్న దుకాణదారులు

ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోని దుకాణదారులు ఎంఆర్‌పీ రేట్లకే విక్రయించాల్సి ఉండగా వారు ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎంఆర్‌పీ రేటు కంటే డబుల్ రేటుకు విక్రయిస్తున్నారని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. హనుమకొండ బస్‌స్టేషన్‌లో సుమారు 20 షాపులు ఉన్నాయి. ఈ షాపులన్నింటిలోనూ నిబంధనలకు విరుద్ధంగా డబుల్ రేట్లకు అమ్ముతున్నారు. వాటర్ బాటిల్ రూ.20 ఉండగా బస్‌స్టేషన్‌లో రూ.30కి విక్రయిస్తున్నారు. కొందరు దుకాణదారులు వేరే స్టిక్కర్లు అతికించి అమ్ముతున్నారు. సమోసా, మిర్చి వంటి తినుబండారాలు ఎంఆర్‌పీ రేటు కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

కొరవడిన ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

ఆర్టీసీ అధికారులు గతంలో బస్‌స్టేషన్‌లో విక్రయించే తినుబండారాలపై దృష్టి పెట్టేవారు. ప్రస్తుతం అటు వైపు వెళ్లకపోవడంతో వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రయాణికులను దోచుకుంటున్నారు. బస్‌స్టేషన్‌లో ఎంఆర్‌పీ ప్రకారం విక్రయాలు సాగుతు న్నాయా? ఐఎస్ఐ గుర్తింపు ఉందా? అని అధికారులు పరిశీలిస్తున్నప్పటికీ ఆర్టీసీ అధికారుల కళ్లు గప్పి నిబంధనలకు వ్యతిరేకంగా బస్‌స్టేషన్లలో నాసిరకం తినుబండారాలు, ఎంఆర్‌పీ రేట్ల కంటే అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిసింది. అయితే కొన్ని సందర్భాల్లో అధిక ధరలకు అమ్మే దుకాణదారులు ఆర్టీసీ అధికారులకు పట్టుబడ్డప్పుడు రూ.1000 ఫైన్ వేస్తున్నప్పటికి కూడా ఫైన్‌ను కూడా లెక్క చేయకుండా మళ్లీ యథావిధిగా వ్యవహరిస్తున్నారని సమాచారం. అధిక ధరలకు విక్రయిస్తే తూనికలు, కొలతల శాఖ అధికారులు, నాసిరకం ఆహార పదార్థాలు అమ్మితే ఫుడ్ సేఫ్టీ అధికారులు బాధ్యత వహించాలి కానీ వారు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. దీంతో వారు విచ్చలవిడిగా వ్యవహరిస్తూ ప్రయాణికుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్‌స్టేషన్‌ను ఆనుకొని ఉన్న హోటల్‌లు, టిఫిన్‌సెంటర్లు

అనధికారిక కట్టడాలపై చర్యలు తీసుకోండి..

వరంగల్ కార్పొరేషన్, మే 2: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అనుసంధానమైన కాజీపేట సర్కిల్-2 పరిధిలోని కడిపికొండలో అనధికారికంగా నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయాలని కడిపికొండ గ్రామస్తులు సర్కిల్ అధికారులకు విన్నవించారు. కడిపికొండ ప్రాంతంలోని పేద ప్రజలకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు ఇటీవల ప్రార్థనా మందిరం నిర్మిస్తున్నట్టు నార్లగిరి రామలింగం అనే వ్యక్తి గత నెల 29న ఫిర్యాదు చేశాడు. అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలు ఇప్పటివరకు బేస్‌మెంట్ లేవల్‌కు చేరుకున్నాయని, వెంటనే అధికారులు గుర్తించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఫిర్యాదుదారులకు వివరణ ఇస్తూ అక్రమ కట్టడాలపై అక్కడి వ్యక్తులకు నోటీలు జారీ చేసినట్టు కాజీపేట సర్కిల్ డిప్యూటి కమిషనర్ రవీందర్ వెల్లడించారు.

నేడు ఓటరు అవగాహన సదస్సు

సుబేదారి, మే 2: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ విభాగం, జిల్లా స్వీప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఓటరు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, గౌరవ అతిథిగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, డీఆర్‌డీఏ నోడల్ ఆఫీసర్ నాగపద్మజా తదితరులు హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఓబీసీ సెల్ చైర్మన్‌గా సతీష్

జూలైవాడ, మే 2: కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్‌గా గ్రేటర్ 49వ డివిజన్ ప్రాంతానికి చెందిన ఈగ సతీష్‌ను ప్రకటిస్తూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈగ సతీష్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్, జిల్లా బీసీ సెల్ కన్వీనర్ బొమ్మతి విక్రమ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



పత్రం అందుకుంటున్న సతీష్‌కుమార్

వైస్ చైర్మన్‌గా మహేష్‌బాబు

వడ్డెపల్లి: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీకి చెందిన తమ్మల మహేష్‌బాబు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశం మేరకు ఓబీసీ హనుమకొండ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ముదిరాజ్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేతల సహకారంతో పార్టీని బలోపేతం చేస్తానని మహేష్‌బాబు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ కో-ఆర్డినేటర్‌గా వీరేశకుమార్

హనుమకొండ సిటీ, మే 2: కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా కాజీపేటకు చెందిన దువ్వ వీరేశ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఓబీసీ సెల్ హనుమకొండ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. బుధవారం డీసీసీ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నుంచి వీరేశ్‌కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు.



పత్రం అందుకుంటున్న వీరేశకుమార్

రారెత్తిస్తున్న ఎండలు

(5వ పేజీ తరువాయి)

కలిగించే స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడదెబ్బతో మృతి చెందుతున్నవారి సంఖ్య కూడా పెరుగుతోంది. అత్యవసరమైతే తప్ప ఎండలో వెళ్లకూడదని, వేడి తీవ్రత తగ్గిన తర్వాత వెళితే మేలని వైద్యులు చెబుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోంది. రాత్రి ఉక్కపోత, పగటి పూట తీవ్రమైన వేడితో జనం ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్నవారు అల్లాడిపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరికొద్దిరోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

రెడ్ అలర్ట్

ఉష్ణోగ్రత 46 డిగ్రీలకుపైగా చేరడంతో రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల్లో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు చేరాయి. వేసవిలో ఎండ తీవ్రత 45 డిగ్రీలు నమోదైతే ఆప్రాంతం రెడ్‌జోన్‌లో ఉన్నట్లుగా పరిగణిస్తారు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజ లు ఎండ పూట బయటకు వెళితే వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డాక్టర్ హెచ్చరిస్తున్నారు. 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్‌లోపు నమోదైతే ఆయా ప్రాంతాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లుగా వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. రాబోయేరోజుల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే సూచన ఇది. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందువల్ల బయటకు వెళ్లొద్దనేదానికి ఇది సూచిక. 35 డిగ్రీల్లోపు ఉష్ణోగ్రత ఉంటే ఎలాంటి హెచ్చరికలు ఉండవు. దీనిని గ్రీన్‌జోన్‌గా పరిగణిస్తారు. ఈ ఎండ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

హోమియోపతి కళాశాలను ఏర్పాటు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 2: హనుమకొండలో హోమియోపతి కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ బాలస ముద్రంలోని పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరులస సమావేశంలో భిక్షపతి మాట్లాడారు. ఎంబీబీఎస్, బీడీఎస్‌లతోనే నీట్ కౌన్సిలింగ్‌లో హోమియోపతి, యునాని, నాచురోపతి కోర్సులకు ఒకేసారి అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించాలన్నారు. మూడు దశల్లో జరిగే కౌన్సిలింగ్ ప్రక్రియలో విద్యార్థులు ఇంటర్నెట్ల చుట్టూ తిరుగుతూ చాలా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆయన వాపోయారు. మెడిసిన్, బీడీఎస్ సీట్లతో పాటే వీటన్నిటి సీట్లు భర్తీ చేయాలన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, సహాయకార్యదర్శి కాసరబోయిన రవితేజ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

కాంగ్రెస్ మాటలు నమ్మితే గోస పడడం ఖాయం

• దేశం, ధర్మం కోసం బీజేపీని గెలిపించాలి • వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

ఐనవోలు, మే 2: కాంగ్రెస్ మాటలు నమ్మితే మరోసారి గోస పడటం ఖాయమని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి ఐనవోలులో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను గెలిపిస్తే వివిధ హామీలతో పాటు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఓట్లు దండుకొని గద్దెనెక్కి మోసం చేసిందన్నారు. ఎంపీ ఎన్నికలు రాగానే, మళ్లీ మోసం చేసేందుకు హామీల తేదీలను ప్రకటిస్తున్నారని విమర్శించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు తనకు రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే పెద్దపాలేరుగా ప్రజలకు సేవలు చేశానన్నారు. కొందరి కుట్రల్లో భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయానని, ఈ సారి ఆదరించాలని కోరారు. కేంద్రంలో ఈ సారి బీజేపీ 400 సీట్లకు పైగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ అభివృద్ధి కోసం పరిశ్రమలు, రైల్వేలైన్లు, విమానాశ్రయం కోసం కృషిచేస్తానన్నారు. కడియం శ్రీహరి దళిత ద్రోహి అని, దళితులు అంటే ఆయనకు అసలు గిట్టదని అని అరూరి ఆరోపించారు. అసలు సిసలైన దళితబిడ్డలను ఎదుగనివ్వకుండా గొంతుకోస్తాడని ఘాటుగా విమర్శించారు. దళితుల సీట్లు, రిజర్వేషన్లు కొల్లగొట్టి దళితులను ఇబ్బందులు పెడుతున్నది కడియం అని అన్నారు. కాంగ్రెస్‌లో పనిచేసిన వారికి టిక్కెట్ రాకుండా చేసి దళిత బిడ్డలను అణగతొక్కిన కడియంకు ఓటు అడిగే హక్కు లేదని విమర్శించారు. ఐలోని మల్లన్న ఆశీస్సులతో పార్లమెంట్‌లో అడుగుపెడుతానన్నారు. ఈ సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి పొన్ను రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రదీప్‌రావు, జిల్లా, మండల నాయకులు మురళీధర్ గౌడ్, ముర్తిరెడ్డి కేశవరెడ్డి, కుమారస్వామి, జడ్పీవైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, మజ్జిగ జయపాల్, రాజేశ్వర్‌రావు, వనంరెడ్డి, ప్రభాకర్, లూథర్ తదితరులు హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి పదుల సంఖ్యలో బీజేపీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



ప్రచారంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

రైతులకు ఉపయుక్తంగా 'ఫార్మ్ రైజ్ వన్' పథకం

డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, మే 2: పలు రకాల వ్యవసాయ ఉత్పత్తులైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు తదితరమైనవి రైతులకు అందించడంతో 'ఫార్మ్ రైజ్ వన్' పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. నాబార్డ్ ప్రవేశపెట్టిన ఫార్మ్ రైజ్ వన్ పథకం పర్యవేక్షణలో భాగంగా స్ట్రాటజిక్ ప్లానింగ్ అండ్ ప్రొడక్ట్ ఇన్నోవేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన నాబార్డు, విదేశీ ప్రతినిధులతో కూడిన బృందం వరంగల్‌లో పర్యటించింది. ఇందులో భాగంగా తొర్రూరు ప్రాథమిక సంఘాన్ని సందర్శించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యకలాపాలు, వ్యాపార నిర్వహణ తదితర అంశాలను పరిశీలించిన అనంతరం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్‌లో సమావేశమైంది. సమావేశంలో బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడుతూ.. టెస్కాబ్, రాబో బ్యాంక్, బేయర్ కంపెనీ, 12వీ కంపెనీ, పీఏసీఎస్ ఈ ఐదు కంపెనీల సమాహారమే ఫార్మ్ రైజ్ వన్ అని వివరించారు. రైతులకు అవసరమయ్యే వ్యవసాయ ఉత్పత్తుల డిమాండ్‌ను ప్రాథమిక సంఘాలు సేకరించడం కంపెనీల నుంచి ఆన్‌లైన్ ఆర్డర్‌లు పొందుతుందన్నారు. ఎరువులు, పురుగు మందులు తదితరమైనవి పీఏసీఎస్‌లకు చేరిన అనంతరం వాటిని రైతులకు తక్కువ ధరల్లోనే అందిస్తుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా రైతులకు ఆర్థికంగా ప్రయోజనంతోపాటు ప్రాథమిక వ్యవసాయ సంఘాలకు కూడా వ్యాపారంగా లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులు నకిలీ ఉత్పత్తులు కొనుగోలు చేసి మోసపోకుండా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో నాబార్డు సీజియం మణికుమార్, డీజీఎం శశిరేఖ, జీఎం మిర్నాల్ రాజన్, వరంగల్ నాబార్డు డీడీయం చంద్రశేఖర్, వరంగల్ డీసీసీబీ సీఈవో ఎండా వాజిర్ సుల్తాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీగా అనితారెడ్డి

కాజీపేట జంక్షన్, మే 2: నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా సేవలందిస్తున్న డాక్టర్ కె.అనితారెడ్డి పదోన్నతిపై నేషనల్ జాయింట్ సెక్రటరీగా ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో డాక్టర్ అనితారెడ్డి అందించిన సేవలను గుర్తించి జాతీయ స్థాయి పదవిలో నియమించినట్లు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయి పదవితో ఇక నుంచి దేశ వ్యాప్తంగా సేవలందించేందుకు అవకాశం ఏర్పడి బాధ్యత మరింత పెరిగిందన్నారు. వినియోగదారులు మోసపోకుండా చూడడమే లక్ష్యంగా పనిచేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతానని ఆమె తెలిపారు.

సీపీఎంలోకి భారీగా చేరికలు



బీఆర్ఎస్ నుంచి సీపీఎంలోకి చేరిన కార్యకర్తలు

వరంగల్ కార్పొరేషన్, మే 2: హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో గురువారం సీపీఎం పార్టీలోకి బీఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు జరిగాయి. సీపీఎం పార్టీ నుంచి గతంలో బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన నాయకులు, కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 200 కుటుంబాలు సీపీఎంలో చేరినట్టు నాయకులు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో పాపయ్య, అమృత, తిరుపతి, రాజు, బిక్షపతి, అనిత, యమున, రాజేశ్వరి, లక్ష్మి, సదానందం, స్వప్న, కళ, కమల ఉన్నారు. వీరన్న, వెంకట్, మంద సంపత్, రమేష్‌లు పాల్గొన్నారు.

బల్దియా బ్రాండ్ అంబాసిడర్లు మెప్మా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, మే 2: బల్దియా బ్రాండ్ అంబాసిడర్లు మెప్మా సిబ్బంది అని హనుమకొండ అదనపు కలెక్టర్ రాధికా గుప్త అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం ఓటర్లకు ఓటు హక్కు పట్ల అవగాహన కలిగించేందుకు బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో స్వీప్ -24 అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా నగరంలోని సుమారు 200 మంది మహిళలు హాజరై మెహిందీ కళలో వారి కళానైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధికా గుప్త మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆర్పీలు, స్వయం సహాయక సభ్యులు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారన్నారు. నగరంలో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఓటు హక్కు పట్ల అవగాహన కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా పది రోజుల గడువు మాత్రమే ఉందని, ఓటర్లకు మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మెహిందీ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సెక్రెటరి విజయలక్ష్మి, సీడీపీవో విశ్వజ, టీపీఆర్ఎవో రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేష్, సీవోలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న అదనపు కలెక్టర్

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

హసన్‌పర్తి, మే 2 : రెండు రోజుల కిందట అదృశ్యమైన వ్యక్తిని గురువారం హసన్‌పర్తి పోలీసులు పట్టుకున్నారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగపహాడ్‌కు చెందిన శ్యాంరావు ప్రశాంత్ ఏప్రిల్ 30న తన సూసైడ్‌కు సీఐ, ఎస్సైలే కారణమంటూ నోట్ రాసి అదృశ్యమయ్యాడు. తన భర్త కనిపించడంలేదంటూ అతడి భార్య మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రశాంత్ స్నేహితులకు తరుచూ ఫోన్ చేయడంతో ఫోన్‌కాల్స్ ద్వారా పోలీసులు దర్యాప్తు చేయగా హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అతడి మిత్రులను అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరారు. మళ్లీ తన మిత్రులకు ప్రశాంత్ ఫోన్ చేయగా తాను ఉండే ప్రాంతాన్ని గుర్తించి అక్కడకు వెళ్లగా ఓ హోటల్ భోజనం చేస్తూ కనిపించాడు. వెంటనే పోలీసులు ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకుని భార్య మాధవికి అప్పగించారు. తన భర్తను అప్పగించినందుకు ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు, పోలీస్ సిబ్బందికి మాధవి కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంత్ అదృశ్యం వెనుక గల కారణాలను తెలుసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

పొగచూరి ఊపిరాడక రైతు మృతి

మడికొండ, మే 2: గడ్డివాము అంటుకోవడంతో పొగచూరడంతో ఓ రైతు మృతి చెందిన ఘటన కాజీపేట మండలం మడికొండ శివారులో గురువారం చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామానికి చెందిన దయ్యాల కుమారస్వామి (55) మడికొండ శివారులోని ఎకరం పొలం ఉంది. తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పత్తి పొరకకు నిప్పు అంటించాడు. గాలికి మంటలు చెలరేగి పక్కనే ఉన్న మరో రైతుకు చెందిన గడ్డివాము అంటుకుంది. భయాందోళనకు గురైన రైతు కుమారస్వామి గడ్డివాము వద్దకు వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మంటలు చెలరేగడంతో పొగచూరి ఊపిరాడక రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ తెలిపారు. కుమారస్వామికి భార్య రమ, కుమారుడు ఉన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మే2: నిబంధనలు ఉల్లంఘించిన 15 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తనిఖీల్లో పట్టుబడ్డ 15 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 11 మందికి రూ.12,200, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ నలుగురికి రూ.2,400 న్యాయమూర్తి రమేశ్ జరిమానాగా విధించారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తేనే భారత రాజ్యాంగానికి రక్షణ

తెలంగాణ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్

వడ్డెపల్లి, మే 2: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే భారత రాజ్యాంగానికి రక్షణ లభిస్తుందని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్, కేయూ వైస్‌చైర్మన్ డాక్టర్ మేడారపు సుధాకర్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను కాపాడుకుందామని పేర్కొన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మబలికిన బీజేపీ.. తన హామీని విస్మరించిందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న సుమారు 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను నిండా ముంచిందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు, రిజర్వేషన్లను కాపాడుకునేందుకు వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు అంగోత్ వినోద్ నాయక్, తాళ్లపల్లి నరేష్, మహ్మద్ మహబూబ్ పాషా, భూక్యా రమేష్ నాయక్, మాలోతు వెంకన్న, బానోతు సునిల్ నాయక్, గుండేటి సుమన్, సంపత్, తిరుపతి నాయక్, అజ్మీరా వెంకట్, సోమరాజ్, నాగరాజు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో కోటూరి మానవతారాయ్, డాక్టర్ మేడారపు సుధాకర్

విలక్షణం... ఈ భగీరథ వృత్తాంతం



'కృత్తివాస రామాయణం' బెంగాలీలో కృత్తివాస ఓర్ఝా రచించిన కావ్యం. ఆయన క్రీస్తుశకం పదిహేనో శతాబ్దానికి చెందిన కవి, పండితుడు. ఈ కావ్యాన్ని 'శ్రీరామా పాచాలీ' (పాకాలీ) అని కూడా పిలుస్తారు. దీన్ని 'గంగానదీ లోయ ప్రాంత బైబిల్'గా బెంగాలీ రచయిత, పరిశోధకుడు దినేశ్ చంద్రసేన్ అభివర్ణించారు. ఆధునిక బెంగాలీ సాహిత్యానికి పూర్వ యుగంలో... అత్యంత ప్రచారం పొందిన కావ్యంగా కృత్తివాస రామాయణాన్ని విమర్శకులు పరిగణిస్తారు. ఇందులో వర్ణితమైన భగీరథుడి కథ విలక్షణమైనది, వేరెక్కడా కనిపించనిది.

కృత్తివాస రామాయణం ప్రకారం... నాలుగు అంశలుగా ఉద్భవించాలని నారాయణుడు కోరుకున్నాడు. ఆ ప్రకారం ఆయన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులుగా మారిపోయాడు. లక్ష్మీదేవి నారాయణుడికి ఎడమవైపు సీతగా ప్రత్యక్షమయింది. అదే సమయంలో... నారాయణ మంత్రం జపిస్తూ వైకుంఠానికి వచ్చిన నారదుడు... ఆ అద్భుత దృశ్యాన్ని చూసి పరమానందభరితుడయ్యాడు. నారాయణుడి ప్రతి లీల వెనుకా ఒక రహస్యం ఉంటుందనే సంగతి నారదుడికి బాగా తెలుసు. 'ఈ నాలుగు రూపాల వెనుక ఉన్న రహస్యం ఏమై ఉంటుంది?' అని ఆలోచించాడు. కానీ ఆ కారణమేమిటో నారదుడికి అంతుపట్టలేదు. 'నాకు తెలియకపోతేనేం? ఆ ముక్కంటికి తెలిసే ఉంటుంది' అనుకుంటూ నేరుగా కైలాసానికి చేరుకున్నాడు. తనతోపాటు తన తండ్రి బ్రహ్మను కూడా తీసుకువెళ్ళాడు. వారిద్దరినీ చూసి ప్రసన్నుడైన శివుడు... "మీ రాకకు కారణమేమిటి?" అని అడిగాడు. వైకుంఠంలో తను చూసిన దృశ్యాన్ని నారదుడు వివరించాడు. ఒక అంశ నాలుగు అంశలుగా ఎలా మారిందో తెలియజేయమన్నాడు. శంకరుడు చిరునవ్వు చిందిస్తూ "అరవై వేల ఏళ్ళ తరువాత... త్రేతాయుగంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం నారాయణుడు రఘు వంశంలో దశరథుడి పెద్ద కుమారునిగా జన్మిస్తాడు. రావణాది రాక్షసులను సంహరించడానికి అవతరిస్తాడు. ఆ దృశ్యాన్నే నువ్వు ముందుగా చూశావు" అని చెప్పాడు. సగరుడి మునిమనుమడైన దిలీపుడు సంతానహీనుడిగా స్వర్గస్తుడవడం, భగీరథుడి జననం... శంకరుని ఈ భవిష్యవాణితో ముడిపడి ఉంది.

రఘువంశానికి చెందిన, అయోధ్యకు రాజైన సగరుడు అశ్వమేధ యాగాన్ని చేపట్టాడు. యజ్ఞాశ్వాన్ని ఇంద్రుడు తరలించుకుపోయి... పాతాళంలో ఉన్న కపిల మహర్షి ఆశ్రమంలో కట్టిపడేశాడు. సగరుడి ఆదేశంతో అతని అరవైవేల మంది కుమారులు యజ్ఞాశ్వాన్ని వెతుకుతూ... భూమిని తవ్వి పాతాళానికి చేరుకుంటారు. కపిల మహర్షి ఆశ్రమంలో కట్టేసి ఉన్న యజ్ఞాశ్వాన్ని చూసి, దాన్ని కపిలుడే దొంగిలించాడనుకొని, ఆయనను నిందిస్తారు. ఆ మహర్షి కోపాగ్నికి భస్మమైపోతారు. వారితో పాటు యజ్ఞాశ్వాన్ని వెతికి తెమ్మని తన పెద్దకొడుకైన అసమంజసుణ్ణి సగరుడు ఆదేశిస్తాడు. అన్ని చోట్లా గాలిస్తున్న అసమంజసుడు పాతాళంలోని కపిల మహర్షి ఆశ్రమానికి చేరుకొని, యజ్ఞాశ్వాన్ని చూసి, జరిగిందంతా తెలుసుకుంటాడు. తన సోదరులకు పుణ్యగతులు ఎలా ప్రాప్తిస్తాయో చెప్పాల్సిందిగా కపిలుణ్ణి వేడుకుంటాడు. అసమంజసుడిపై దయతలచిన కపిలుడు..... దివిలో ప్రవహించే గంగానది ఆ అరవై వేలమంది సగర పుత్రుల మీద ప్రవహిస్తే... వారికి పుణ్యగతులు ప్రాప్తిస్తాయని చెబుతాడు.

గంగను కిందకు తీసుకువచ్చే ప్రయత్నంలో అసమంజసుడు, అతని కుమారుడు అంశుమంతుడు మరణిస్తారు. అనంతరం అంశుమంతుడి కుమారుడు దిలీపుడు సంతానం లేకుండానే మరణిస్తాడు. దీనితో రఘు వంశానికి వారసుడు కరువవుతాడు. తాను రఘువంశంలో దశరథుడి కుమారుడిగా జన్మించి, భూభారాన్ని తగ్గిస్తానని కొన్ని వేల ఏళ్ళ క్రితమే దేవతలకు నారాయణుడు మాట ఇచ్చాడు. వారసుడు లేకపోతే... నారాయణుడి మాట అసత్యం అవుతుంది. అలా జరిగితే భూమి నాస్తికమయం అవుతుంది. ధర్మం పట్ల ప్రజల మనసులో విశ్వాసం తగ్గుతుంది. దీనికి తరుణోపాయం తెలపాలని బ్రహ్మాది దేవతలు పరమశివుణ్ణి వేడుకుంటారు. శంకరుడు ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తాడు. తన ప్రణాళిక ప్రకారం అయోధ్యకు చేరుకుంటాడు. దిలీపుడి భార్యలు చంద్ర, మాల... శివుడికి స్వాగతం చెబుతారు. భక్తి శ్రద్ధలతో పరిచర్యలు చేస్తారు. సంతృప్తుడైన శివుడు... "మీలో ఒకరు త్వరలో గర్భం దాల్చి, పండంటి కుమారుడికి జన్మనిస్తారు" అని ఆశీర్వదిస్తాడు. ఆ ఆశీస్సు విని వాళ్ళు దిగ్భ్రాంతి చెందుతారు. "స్వామీ! ఇది ఎలా సంభవం?" అని అడుగుతారు. "ఇది దైవ సంకల్పం. మీ ఇద్దరి మధ్య జరిగే కలయిక కారణంగా పుత్రుడు జన్మిస్తాడు" అని చెప్పి, శివుడు కైలాసానికి చేరుకుంటాడు.

అప్పటికే ఋతుస్రావం ఆగిపోయిన మాలకు ... శివుడి ఆశీస్సుల కారణంగా నెలసరి అవుతుంది. చంద్ర, మాలల కలయిక జరిగి, మాల గర్భం దాలుస్తుంది. పది నెలల తరువాత... ఎముకలు లేని పిండానికి జన్మనిస్తుంది. ఎముకలు లేకపోవడం వల్ల ఆ పిండం నడవలేకపోతుంది. ఆ మాంసం ముద్దను చూసి చంద్ర, మాల విలపిస్తారు. 'శివుడు వరమిచ్చాడా, శాపమిచ్చాడా' అనేది తేల్చుకోలేకపోతారు. పిండం పెరిగి పెద్దదైతే అభాసుపాలవుతామని భయపడతారు. ఆ పిండాన్ని కొంగుచాటున దాచుకొని సరయూ నదీ తీరానికి చేరుతారు. దాన్ని నదిలో పారేయాలనుకుంటున్న వారిద్దరినీ వశిష్టుడు చూస్తాడు. దివ్యదృష్టితో అంతా తెలుసుకుంటాడు. ఆ పిండం రఘువంశ వారసుడని గ్రహిస్తాడు. రఘువంశ పురోహితుడిగా... ఆ వంశ వారసుణ్ణి కాపాడడం తన విద్యుక్త ధర్మంగా భావించి... "మీరు ఆ పిండాన్ని ఒడ్డునే వదిలిపెట్టండి. దారిన పోయేవారెవరైనా దాన్ని కాపాడగలరు" అని చెప్పి వెళ్ళిపోతాడు. చంద్ర, మాల ఆ విధంగా చేస్తారు.

అప్పుడు సరయూ నదిలో స్నానం చేయడానికి అష్టావక్ర మహర్షి వస్తాడు. అష్టావక్రుడి శరీరంలోని ఎనిమిది వంకరల కారణంగా... ఆయన వంకరటింకరగా నడుస్తూ ఉంటాడు. ఎముకలు లేని పిండం కూడా అలాగే నడుస్తూ ఉంటుంది. ఆ పిండం తన నడకను అనుకరిస్తోందని అష్టావక్రుడు అనుమానిస్తాడు. 'అది నన్ను వెక్కిరిస్తూ ఉంటే భస్మం అవుతుంది. అలా కాకుండా... జన్మతః అలాగే ఉంటే... నా తపోబలం వల్ల సుందర రూపం దాల్చుతుంది' అనుకుంటాడు. పుట్టుకతోనే ఎముకలు లేని ఆ పిండం... అష్టావక్రుడి తపోబలం వల్ల సుందరమైన బాలుడిగా మారుతుంది. ఆ బాలుడు తన తల్లులను కలిసి, జరిగిన విషయం తెలియజేస్తాడు.

అయిదేళ్ళ వయసులో... ఆ బాలుణ్ణి విద్యాభ్యాసం కోసం వశిష్టుడి ఆశ్రమంలో చేరుస్తారు. ఆశ్రమంలోని కొందరు బాలురు అతని పుట్టుకను ఎగతాళి చేస్తారు. కోపంతో ఇంటికి చేరిన కుమారుడి ద్వారా... జరిగింది తెలుసుకున్న ఆ తల్లులు... అతని జన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తారు. రెండు భగాల మధ్య కలయిక కారణంగా జన్మించిన వాడు కాబట్టి అతను భగీరథుడయ్యాడనేది... కృత్తివాస రామాయణంలోని భగీరథ వృత్తాంతం.

మూలాలు బెంగాలీ పద్మ పురాణంలో...

'భగీరథుడు ద్వియోనిజుడు' అనే అంశాన్ని బెంగాలీ లిపిలో ఉన్న 'పద్మ పురాణం' నుంచి కృత్తివాసుడు తీసుకున్నాడు. రెండు భగాల మధ్య సంభోగం సంభవం అనే విషయాన్ని గురించి రుత్ వనిత, సలీం కిద్వాయ్ అనే ఇద్దరు విద్యావేత్తలు ప్రధానంగా పరిశోధన చేశారు. పద్నాలుగో శతాబ్దానికి చెందిన బెంగాలీ ధార్మిక గ్రంథాలలో... ఇద్దరు మహిళల మధ్య కలయిక సంభవమని సూచించే గ్రంథాలు ఉన్నాయని అమెరికా మోన్‌టానా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అయిన రుత్ వనిత 'సేమ్ సెక్స్ మ్యారేజ్ అండ్ హిందూ ట్రెడిషన్స్' అనే గ్రంథంలో వివరించారు. కృత్తివాసుడు దీన్ని 'పద్మ పురాణం' నుంచి గ్రహించాడనీ, 'సుశ్రుత సంహిత'లో ఇద్దరు స్త్రీల మధ్య జరిగే కలయిక కారణంగా ఒకరిలో ఫలదీకరణ జరుగుతుందనీ రాసి ఉందనీ ఆమె పేర్కొన్నారు. కవిరాజ్ కుంజా లాల్ భిషగ్రత్న ఆంగ్లంలోకి అనువదించిన 'సుశ్రుత సంహిత' (చౌకంబా సంస్కృత సిరీస్-39, 135వ పేజీ) నుంచి కొన్ని పంక్తులను ఉదాహరణగా కూడా చూపించారు. ద్వియోని సంభవుడైన భగీరథ వృత్తాంతాన్ని చర్చిస్తున్న సందర్భంలోనే... మరో విషయం గురించి కుడా రుత్ వనిత ప్రస్తావిస్తూ "మేము వితంతువులం. మాకు సంతానం ఎలా కలుగుతుందని శివుణ్ణి చంద్ర, మాల ప్రశ్నించినట్టే... మేరీ మాత కూడా "నేను పురుషుణ్ణి ఎరుగను, ఇదెలా జరుగుతుంది?" అని దేవదూతను ప్రశ్నిస్తుంది. అప్పుడు దేవదూత "పరిశుద్ధాత్మ నీపైకి వస్తుంది. సర్వోన్నతుడి శక్తి నిన్ను కమ్ముకుంటుంది" అని (బైబిల్, లూకా- 1:34, 35) చెబుతాడు" అని పేర్కొన్నారు.

భగీరథుడు ద్వియోని సంభవుడనే వృత్తాంతం నాకు తెలిసినంతవరకూ ఏ భారతీయ రామాయణంలోనూ లేదు. అవధి భాషలో రామాయణాన్ని 'రామచరితమానస్' అనే పేరుతో రచించిన తులసీదాసు... బెంగాలీ కృత్తివాస రామాయణం నుంచి కొంతవరకూ ప్రభావితుడయ్యాడనేది విమర్శకుల అభిప్రాయం. (ఆధారం: కృత్తిపాస రామాయణం, ఆదికాండం, హిందీ అనువాదం. అనువాదకులు: యోగేశ్వర త్రిపాఠి యోగి, ప్రబంధ్‌కుమార్ మజుందార్, నవారుణ వర్మ)

● డాక్టర్ ఎ.బి సాయిప్రసాద్
9980567541

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mKCc7cHలో చదవండి.

మనతో స్నేహం చేద్దాం...

గీతాసారం



"మానవుడు కోరికలు లేని మనసు ద్వారా తనను తాను ఉద్ధరించుకోవాలి. స్వీయ వినాశనానికి పాల్పడకూడదు. మనిషికి తనకు వశమైన మనసే బంధువు, తనకు వశంకాని మనసే శత్రువు" అని భగవద్గీతలోని 'ఉద్ధరే దాత్మనాత్మానాం' అనే గీతా శ్లోకంలో శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు.ఈ శ్లోకంలో అనేక కోణాలు కనిపిస్తాయి. వాటిలో మొదటిది... తనను తాను ఉద్ధరించుకోవలసిన బాధ్యత ప్రతి వ్యక్తి మీదా ఉంటుంది. మనం చేసిన కర్మల వల్ల చెడు జరిగినప్పుడు లేదా ఆశించిన ఫలితాలు రానప్పుడు కుటుంబాన్నో, స్నేహితులనో, సహోద్యోగులనో, పరిస్థితులనో, పని వాతావరణాన్నో, దేశాన్నో తప్పు పట్టడం లేదా మనల్ని మనమే నిందించుకోవడం సర్వసాధారణంగా జరిగే విషయం. ఇది చాలా తీవ్రమైన కక్షలు పెరిగిపోవడానికి, ఇతరుల పట్ల ద్వేషానికి కారణమవుతుంది. కొందరిలో ఈ వైఖరులు జీవితాంతం కొనసాగుతాయి. మరోవైపు, మన జ్ఞాపకాలు మనల్ని పశ్చాత్తాపాన్ని గుర్తుచేసినప్పుడల్లా... మనల్ని మనం పదేపదే శిక్షించుకుంటాం. పరిస్థితులు ఏవైనప్పటికీ... మనల్ని మనం ఉద్ధరించుకోవాలని ఈ శ్లోకం మనకు చెబుతుంది. శరణాగతి, ప్రశ్నించడం, సేవ అనే మూడు లక్షణాలను మనలో అభివృద్ధి చేసుకున్నప్పుడు... మనకు సాయం చెయ్యడానికి గురువు మనల్ని చేరుతాడని అంతకుముందు కృష్ణుడు తెలిపాడు.

రెండోది... మనలోని పరిపూర్ణతలను, లోపాలను సమానంగా స్వీకరించడం ద్వారా... మన అసమర్థతలుగా భావించుకొనేవాటిని అధిగమించడం. అది మన భౌతికమైన రూపం కావచ్చు, సక్రమంగా లేని గతం కావచ్చు, విద్యాపరమైన, ఆర్థికపరమైన స్థాయి కావచ్చు, మనం ఎదుర్కొన్న అహ్లాదమైన, అసహ్యమైన పరిస్థితులు కావచ్చు. మూడోది... మనకు మనమే స్నేహితులుగా ఉన్నప్పుడు... నిరాశ, కోపం, మత్తుపదార్థాలకు లేదా వినోదపు తెరలకు బానిస కావడం లాంటి వాటికి ప్రధాన కారణమైన ఒంటరితనానికి అవకాశం ఉండదు. ముఖ్యంగా వృద్ధాప్యానికి దగ్గరవుతున్నప్పుడు... ఎవరి మీదా ఆధారపడకుండా సంతోషంగా ఉండడానికి ఇది దోహదం చేస్తుంది. చివరిగా... ఇది శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా మన గురించి మనం శ్రద్ధవహిస్తూ... సమతుల్యమైన జీవనం గడపడానికి సంబంధించిన విషయం. ఆలా గడిపినప్పుడు జీవితంలోని ప్రతి అంశం చక్కగా ఉంటుంది. మనం మనతో స్నేహం చేసుకుంటే జరిగే సహజ పరిణామం ఏవిటంటే... పక్షపాతంగా వ్యవహరించడం, ఇతరుల ప్రవర్తన మీద తీర్పులు చెప్పడం లాంటివి వదిలేస్తాం. అప్పుడు మొత్తం ప్రపంచం మనకు స్నేహితుడిగా మారుతుంది. సకల లోకానికీ మనం స్నేహితులం అవుతాం.



కె. శివప్రసాద్
ఐఎఎస్


ధ్యాన మూలం గురోర్మూర్తిః

ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితిని చేరడానికి మూడు సోపానాలను పూర్వులు పేర్కొన్నారు. వాటిలో మొదటి మెట్టు ధ్యానం, రెండో మెట్టు ధారణ, మూడో మెట్టు సమాధి (నిర్విచార స్థితి). మీకు సత్యాన్వేషణపై అభిలాష ఉన్నప్పుడు... మీరు ఆరాధించే దైవం మీద మీ చిత్తాన్ని నిలకడగా నిలపడాన్నే 'ధ్యానం' అంటారు. 'ధారణ' అంటే... ధ్యానం కోసం ఏకాగ్రతతో చేసే సంపూర్ణ ప్రయత్నం. కాబట్టి మీరు కొలిచే దైవాన్ని ఏకాగ్రతతో స్మరించుకోండి. మీ చిత్తాన్ని ఆ దైవం మీద లగ్నం చేయండి. మొదట్లో చిత్తం చంచలంగా ఉంటుంది. క్షణక్షణం దారి తప్పుతూ ఉంటుంది. అప్పుడు మీరు ధ్యానంలో ఉంటారు కాని... ధారణ ఉండదు. ధారణ అనే స్థితి చాలా ముఖ్యమైనది. ఈ స్థితిలో మీ చిత్తం భగవంతునితో అనుసంధానం అవుతుంది. ఎప్పుడైతే ధ్యాన, ధారణ స్థితులు మీలో సంపూర్ణ వికాసం పొందుతాయో... అప్పుడు మీరు సమాధి స్థితిని చేరుకుంటారు. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది, సహజయోగ సాధన చేస్తున్నవారికి ఈ స్థితిని చేరుకోవడం చాలా సులభం.

ధ్యానమూలం గురోర్మూర్తిః పూజా మూలం గురోః పదం

మంత్రమూలం గురోర్వాక్యం ముక్తిమూలం గురోః కృపాః అన్నారు పూర్వులు. మీరు మీ గురువు దగ్గర, మీరు ఆరాధించే దైవం దగ్గర మోకరిల్లి, మీరు ధ్యానం చేసుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని, పరిస్థితులను, మానసిక స్థితిని ప్రసాదించాలని వేడుకోవాలి. అహంకారానికి అతీతంగా... భగవంతుడితో మమేకమై, మిమ్మల్ని మీరు తెలుసుకున్నప్పుడే ధ్యానంలో ప్రవేశిస్తారు. ధ్యానం ఉదయం, సాయంత్రం... రెండు పూటలా చేయడం మంచిది. ఉదయం చేసే ధ్యానంలో... మనల్ని మనం అంతర్ముఖంగా పరిశీలించుకోవాలి. 'నేను ఆధ్యాత్మికంగా ఎంత లోతుకు వెళ్ళగలిగాను? నా ఆధ్యాత్మికమైన ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తున్నవేమిటి?' అని ప్రశ్నించుకోవాలి. సాయంత్రం ధ్యానంలో... 'నేను ఇతరులకు ఎంత మేరకు సహాయపడగలిగాను? భగవత్కార్యాల్లో ఎంత మేరకు పాలుపంచుకోగలిగాను?' అని మదింపు చేసుకోవాలి. ధ్యానంలో... ఎలాంటి ఆలోచనలూ లేని నిర్విచార స్థితికి చేరుకొనే మార్గంలో... ఆ ఆత్మపరిశీలన అవసరం.

సహజయోగ



ధ్యానంలో మనం చేరుకొనే ఆ ఆలోచనారహిత స్థితి... కొద్ది సేపే అయినా... భగవంతుడితో మనల్ని అనుసంధానిస్తుంది. తద్వారా మన ప్రార్థనలు భగవంతుణ్ణి చేరుతాయి. ప్రార్థనలో మనలో కదిలే ప్రశ్నలకు, సందేహాలకు భగవంతుడు ఇచ్చే సమాధానం, పరిష్కారం ధ్యానం ద్వారానే మనకు చేరుతాయి. అది మనసుకు ఆహ్లాదాన్ని, ఓర్పును ఇస్తుంది. మన సమస్యలను తీరుస్తుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు అతీతంగా మారుతాం. మనల్ని మనం అదుపు చేసుకోగలుగుతాం. ధ్యానం వల్ల కుడి, ఎడమ పార్శ్వాల్లోని సమస్యలను వదిలేసి... మధ్యస్థంగా ఉంటారు. అంటే, గతానికి, భవిష్యత్తుకు సంబంధించిన అనవసరమైన ఆలోచనలను వదిలేస్తారు. వర్తమానంలో ఉంటారు. మీ వివేకాన్ని, ఆనందాన్ని అనుభూతి చెందుతారు. అదే విలంబ స్థితి.

పూర్వకాలంలో మునులు, ఋషులు ఐహిక బంధాలను వదులుకొని, అడవులకో, హిమాలయాలకో వెళ్ళి తపస్సు చేసుకొనేవారు. సంసారాలను వదలనక్కరలేకుండా, ఎక్కడికీ వెళ్ళక్కర్లేకుండా... ఎప్పుడైనా, ఎక్కడైనా చేసుకోగలిగే ప్రక్రియను శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజయోగ స్థాపన ద్వారా మానవాళికి అందించారు. కుండలినీ జాగృతిద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది, తమ దైనందిన జీవితంలో చేసుకొనే ధ్యానంతో... నిర్విచార స్థితిని, ఆ తరువాత నిర్వికల్ప స్థితిని... అంటే భగవంతుడిపట్ల ఎలాంటి సందేహాలూ లేని స్థితిని పొందగలరని నిరూపించారు. సహజయోగ సాధనలో ధ్యానం... మన దైనందిన జీవితంతో సమ్మిళితమై ఉంటుంది. ఈ ధ్యానంలో మనల్ని, మన ఆరోగ్యాన్నీ సమతుల్యం చేసుకోవడం, మెరుగుపరుచుకోవడం ఒక సాధారణ విషయం. అంతేతప్ప సహజయోగ ధ్యానం ఆరోగ్యం కోసమో, రోగనివారణ కోసమో మాత్రమే కాదు. అందుకు అతీతమైనది.

డాక్టర్ పి. రాకేష్ , 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



నవ్య | చిత్రజ్యోతి

పక్కా థియేటర్స్‌లోనే చూడాల్సిన సినిమా

- ఎస్.ఎస్.రాజమౌళి



నటుడు సత్య దేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి గోపాలకృష్ణ దర్శకత్వం వహించారు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు, మే 10 ఈ చిత్రం విడుదల అవుతోంది. బుధవారం ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ "డైరెక్టర్ టీజర్, ట్రైలర్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచేశారు. ఇది పక్కా థియేటర్స్‌లోనే చూడాల్సిన సినిమా అన్న అనుభూతిని కలిగించారు. ఈ సినిమాతో సత్యదేవ్ స్టార్ అవుతారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. చిత్ర సమర్పకుడు కొరటాల శివ మాట్లాడుతూ "డైరెక్టర్ చెప్పిన కథ వినగానే ఈ సినిమాలో నేనూ ఓ భాగం అవుదామని ఇలా సమర్పకుడిగా వ్యవహరించాను. నేను చూసిన మంచి నటుల్లో సత్యదేవ్ ఒకరు. కాల భైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు" అని అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ "కొరటాల శివ సినిమాను ఓకే చేయగానే సినిమా సగం సక్సెస్ అనుకున్నాం. డైరెక్టర్ ఈ సినిమా కథ చెప్పినప్పుడే ఇది వంద కోట్ల కంటెంట్ ఉన్న సినిమా అనిపించింది. కృష్ణా నది ఎన్ని మలుపులు తిరిగి గమ్య స్థానం చేరుకుంటుందో..ఈ సినిమాలోనూ అన్నే మలుపులు ఉన్నాయి" అని అన్నారు. "మూవీకి ఈ టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూశాక తెలుస్తుంది" అని డైరెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ అనిల్ రావిపూడి, గోపిచంద్ మలినేని, చిత్ర బృందం పాల్గొన్నారు.



ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకక్కుతోన్న చిత్రం 'కుబేర'. నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం చిత్రబృందం నాగార్జున ఫస్ట్‌లుక్ టీజర్‌ను ఆవిష్కరించింది. కథా నేపథ్యాన్ని ప్రతిబింబించేలా నోట్ల కట్టలతో నిండిన కంటైనర్ల మధ్య వర్షంలో గొడుగుపట్టుకొని కళ్లద్దాలతో ఉన్న నాగార్జున లుక్ ఆకట్టుకుంది.

పేదల కోసం వీరమల్లు పోరాటం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్ 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం తొలి భాగం టీజర్‌ను యూనిట్ గురువారం విడుదల చేసింది. చార్మినార్, ఎర్రకోట లాంటి భారీసెట్‌లు, పవన్ కల్యాణ్ వీరోచిత పోరాట ఘట్టాలు, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలు వెరసి సినిమా భారీ స్థాయిలో తెరకెక్కిందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. మరో అప్డేట్‌ను ఈ సందర్భంగా చిత్రబృందం పంచుకుంది. ఇకపై 'హరిహర వీరమల్లు' మిగిలిన చిత్రీకరణ,నిర్మాణానంతర కార్యక్రమాలను క్రిష్ పర్యవేక్షణలో దర్శకుడు జ్యోతి కృష్ణ పూర్తి చేస్తారని యూనిట్ తెలిపింది. ఈ ఏడాది చివర్లో 'హరిహర వీరమల్లు' రిలీజ్ అవనుంది. నిధి అగర్వాల్, బాబీడియోల్, సునీల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్, మనోజ్ పరమహంస.



మాట నిలబెట్టుకున్నారు

ప్రముఖ నిర్మాత కె.ఎల్.నారాయణ సుదీర్ఘ విరామం తర్వాత రాజమౌళి, మహేశ్‌బాబు కలయికలో వస్తున్న సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఆయన ఈ చిత్రం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రాజమౌళి, మహేశ్‌బాబు కాంబినేషన్‌ను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. ప్రస్తుతం వారి క్రేజ్ ఆకాశాన్ని తాకేలా ఉంది. రాజమౌళికి హాలీవుడ్ నుంచి కూడా ఆఫర్స్ వస్తున్నాయి. అయినా వాటిని కాదనుకుని ఇచ్చిన మాటకు కట్టుబడిన రాజమౌళి, 'దుర్గా ఆర్ట్స్' బ్యానర్‌లోనే ఈ మూవీ తీస్తున్నామని ప్రకటించి మాట నిలబెట్టుకున్నారు. రెండు నెలల నుంచి ప్రీ ప్రొడక్షన్ సాగుతోంది. ఆగస్టు లేదా సెప్టెంబరులో చిత్రీకరణ ప్రారంభం అవుతుంది" అని చెప్పారు.

నాన్న టైటిల్ ఇచ్చి ఆశీర్వదిస్తున్నారు



'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆ ఒక్కటీ అడక్కు' ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నరేశ్ మాట్లాడుతూ 'నేను ఇన్ని సంవత్సరాలు పరిశ్రమలో ఉన్నానంటే కారణం మా నాన్నగారు. ఆయన ఉన్నన్ని రోజులూ నాతో సినిమాలు తీసి హిట్లు ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఆయన లేనప్పుడు కూడా తన సినిమా టైటిల్ ఇచ్చి బ్లెస్ చేస్తున్నారు' అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అడవి శేష్ మాట్లాడుతూ 'నరేశ్ అంటే మా ఇంట్లో మనిషి. ఆయన ఎప్పుడూ ఇతరుల ఆనందాన్ని కోరుకుంటారు. మే 3న ఈ సినిమాను అందరం థియేటర్లలో చూద్దాం. ఎంజాయ్ చేద్దాం' అన్నారు. ఈ సినిమాతో నరేశ్ రూపంలో మంచి ఫ్రెండ్ దొరికాడని ఫరియా అబ్దుల్లా చెప్పారు.

దక్షిణాదికి వచ్చిన దెయ్యం కథ



తమన్నా, రాశీ ఖన్నా, సుందర్ నటించిన 'బాక్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నటుడు, చిత్ర దర్శకుడు సి. సుందర్ మీడియాతో మాట్లాడుతూ "అరణ్మనై' సిరీస్‌లో నాలుగో చిత్రమిది. మొదటి మూడు సినిమాలు తెలుగు, తమిళ భాషల్లో హిట్ అయ్యాయి. ఈ చిత్ర కథ కోసం రీసెర్చ్ చేసే క్రమంలో చరిత్రతో ముడిపడిన ఓ ఆశ్చర్యకరమైన విషయం తెలిసింది. అస్సామీ జానపదంలో 'బాక్' అనే ఘోస్ట్ ఉండేదని అక్కడివారి నమ్మకం. తమ ప్రాంతాన్నాంతా చేతబడి చేశారని వారి విశ్వాసం. ఆ విషయం విని ఆశ్చర్యపోయా. అదే 'బాక్' కథకు బీజం వేసింది. అస్సామీ, బ్రహ్మపుత్ర ప్రాంతంలో ఉండే బాక్ అనే దెయ్యం సౌత్‌కి వస్తే ఎలాంటి పరిణామాలు సంభవించాయన్నది ఈ చిత్రకథ' అన్నారు.

సీట్ ఎడ్జ్‌లో కూర్చుని చూసేలా...



సినిమా సినిమాకు వైవిధ్యమైన రోల్స్ చేస్తూ సూపర్ హిట్స్‌ను తన ఖాతాలో వేసుకుంటున్నారు సుహాస్. ఆయన హీరోగా నటించిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్న వదనం' నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ మూవీ గురించి సుహాస్ మీడియాతో ముచ్చటించారు. "ఇందులో ఆర్జే పాత్ర పోషించాను. ఫేస్ బ్లైండ్‌నెస్ కారణంగా ఎలాంటి సమస్యల్లో ఇరుక్కుంటాను, వాటి నుంచి ఎలా భయటపడతాననేదే ఈ సినిమా కథాంశం. అందరినీ అలరించే సినిమా ఇది. చాలా మంది నా కథల ఎంపిక బావుంటుందని మెచ్చుకుంటుంటారు. ఈ సినిమాను థియేటర్లలో చూస్తున్నప్పుడు కచ్చితంగా థ్రిల్ ఫీలవుతారు. సీట్ ఎడ్జ్‌లో కూర్చుని చూసేలా ఈ సినిమా సాగుతుంది. దర్శకుడు అర్జున్ వైకెకు ఇది తొలి చిత్రం అయినా చాలా అనుభవం ఉన్నట్లు సినిమాను తెరకెక్కించారు" అని చెప్పారు.



బ్యాండేజ్ బబ్లూని నమ్మొద్దు!

'కోడికత్తి డ్రామా ప్రజలకు తెలియడంతో జగన్‌రెడ్డి బ్యాండేజ్ బబ్లూ అవతారమెత్తాడు. చిన్నరాయి తగిలిందని వారం రోజులపాటు బ్యాండేజ్ వేసుకుని ప్రజల సానుభూతి కోసం జగన్ ఆడుతున్న డ్రామాలను నమ్మొద్దు' అంటూ గురువారం ఒంగోలులో టీడీపీ కార్యకర్తలు నుదుటికి, కంటికి బ్యాండేజ్ వేసుకుని చేసిన ప్రచారం ప్రజలను ఆకట్టుకుంది. - ఒంగోలు కార్పొరేషన్

జగన్.. మాట తప్పావ్!

ఓటు అడిగే హక్కు నీకెక్కడిది.. మద్య నిషేధం చేశాకే అడుగుతానన్నావ్

- వారంలో సీపీఎస్ రద్దు చేస్తానన్నావ్
- జాబ్ కేలెండర్, డీఎస్సీ ఏవీ?
- మేనిఫెస్టోలో 99% హామీలు నెరవేర్చలేదు
- జగన్ వైసీపీ పాలనకు సున్నా మార్కులే
- రాయచోటి, కడప సభల్లో చంద్రబాబు

- మద్యపానం నిషేధిస్తానని చెప్పావా లేదా.? తర్వాతే ఓటడుగుతానని అన్నావా లేదా..?
- వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తాను.. పీఆర్‌సీ ఇస్తా అన్నావు.. మధ్యంతర భృతి ఇస్తా అన్నావ్.. అధికారంలోకి వచ్చి ఎన్ని వారాలవుతోంది..? పీఆర్‌సీ రద్దు చేశావా?
- జాబ్ కేలెండర్ ఇస్తా అన్నావు.. డీఎస్సీ వేస్తా అన్నావు.. ఇచ్చావా? నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయా?
- ఉద్యోగులు, జర్నలిస్టులకు ఇళ్లు కట్టిస్తా అన్నావు.. కట్టించావా?
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ పనుల్లో 50 శాతం ఇస్తానన్నావు.. కల్పించావా? ఇవేమీ చేయకుండా.. మాట తప్పిన నీవు ఏ విధంగా ఓటు అడుగుతావ్?

–టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీ సీఎం జగన్‌పై ఈ ఐదు ప్రశ్నలతో విరుచుకుపడ్డారు. ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన ఆయనకు ఓటడిగే హక్కు ఎక్కడిదని నిలదీశారు. ప్రజాగళంలో భాగంగా గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో, కడప జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ మేనిఫెస్టోలో చెప్పిన వాటిలో 99 శాతం అమలు చేయలేదన్నారు. ఆయన పాలనకు జనం సున్నా మార్కులే వేస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో రూ.60 ఉన్న మద్యం ఇప్పుడు రూ.200 అయిందని.. పెరిగిన రూ.140 తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్తోందన్నారు. తాము దమ్మున్న ప్రజా మేనిఫెస్టో తెచ్చామని.. దాని ముందు జగన్ మేనిఫెస్టో వెలవెలబోయిందని చెప్పారు. తాము సంపదను సృష్టించి ప్రజలకు పంచుతామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

జగన్ బాబాయిని ఎవరు చంపారో ప్రపంచం మొత్తానికీ తెలుసు.. అయితే ముఖ్యమంత్రికి మాత్రం తెలియదంట..! నిందితుడు అవినాశ్‌రెడ్డిని పక్కనే పెట్టుకుని.. అవినాశ్‌రెడ్డి అమాయకుడు, చిన్నపిల్లోడని అంటున్నారు. పిల్లోడైతే పలక, బలపం చేతిలో పెట్టి బడికి పంపాలి కానీ.. పార్లమెంటుకు ఎందుకు పంపుతున్నారు?





రాయచోటి బహిరంగ సభలో హాజరైన చంద్రబాబు సభకు హాజరైన జనం; మాట్లాడుతున్న చంద్రబాబు

రైతుల పాస్‌పుస్తకాలపై జగన్ ఫొటో ఎందుకు?

కిరణ్‌కుమార్‌రెడ్డి, నేను ముఖ్యమంత్రులుగా పని చేశాం. మీ పట్టాదార్ పాస్‌పుస్తకాల పైన మా ఫొటోలు వేసుకున్నామా..? మీ భూములకు జగన్ ఎటువంటి వారసుడూ కాదు.. మీకా భూమి ఆయన తాత, నాన్న ఇవ్వలేదు. అటువంటప్పుడు జగన్ ఫొటో ఎందుకు వేసుకుంటున్నాడు.? 'ఆస్తి నాదా?.. మీ జగన్‌దా' అని ఓట్ల కోసం వచ్చే అధికార పార్టీ నాయకులను అడగండి. మీ భూములపై కన్ను వేసిన జగన్ కొత్త చట్టం తెస్తున్నాడు.. మేం రాగానే ఆ చట్టాన్ని రద్దు చేస్తాం. మళ్లీ అధికారంలోకి వస్తే.. 2028లో రూ.250, 2029లో ఇంకో రూ.250 పెంచుతానని జగన్ చెబుతున్నాడు. కానీ మేం రాగానే మొదటి నెల నుంచే రూ.4 వేలు పెన్షన్ ఇస్తాం. దివ్యాంగులకు రూ.6 వేలు, రెండు చేతులు, రెండు కాళ్లు లేని వారికి రూ.10 వేలు అందిస్తాం. బీసీలకు 50 ఏళ్లకే సంవత్సరాలకే పెన్షన్లు ఇస్తాం. చంద్రన్నబీమా మళ్లీ తెస్తాం. సహజ మరణమైతే రూ.5 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు ఇస్తాం. ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షలు ఇస్తాం. ప్రైవేటు, ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చు. బీపీ, షుగర్‌లకు ఉచితంగా మందులు ఇస్తాం.

మైనారిటీల రక్షణ బాధ్యత నాదే

నేను, కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంలుగా ఉన్నప్పుడు రాష్ట్రంలో మైనారిటీలకు ఎటువంటి సమస్య రాలేదు. నా హయాంలోనే అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా చేశాం. కర్నూలు జిల్లాలో ఓ ముస్లిం కుటుంబం మొత్తం జగన్ పాలనలో ఆత్మహత్య చేసుకుంది. ఇంకా అనేక సంఘటనలు జరిగాయి. మేం అధికారంలోకి వస్తే.. ముస్లిం మైనారిటీల రక్షణ బాధ్యత నేను తీసుకుంటాను. పార్లమెంటులో సీఏఏ, ఎన్‌ఆర్‌సీ బిల్లులు ఆమోదం తెలపడానికి మద్దతు తెలిపిన జగన్.. ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు.



జమ్మలమడుగు ఎన్నికల ప్రచారంలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

జగన్‌కు హత్యా రాజకీయాలే ఎక్కువ

- జమ్మలమడుగు ఎన్నికల ప్రచారంలో షర్మిల

కడప/అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): జగన్‌కు రాష్ట్రాభివృద్ధి కన్నా హత్యా రాజకీయాలే ఎక్కువ. బాబాయిని చంపిన హంతకుడిని జగన్ కాపాడుతున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వివేకా రామలక్ష్మణుల్లా ఉండేవారు. వివేకాను గొడ్డలితో ఏడుసార్లు నరికి చంపారు. సీబీఐ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. అవినాశ్ అరెస్టు కర్నూను తలపించింది" అంటూ పీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దముడియం, జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. బాబు, జగన్ ముఖ్యమంత్రులుగా ఉన్నా కనీసం రాజధాని కట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. పక్క రాష్ట్రాలకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ఉన్నాయని, మన రాష్ట్రానికి ఏముందని ప్రశ్నించారు. మూడు రాజధానులన్న జగన్ చివరకు ఒక్కటి కూడా లేకుండా చేశారని విమర్శించారు. 'వివేకా ఆత్మ ఈ గడ్డ మీద ఘోషిస్తోంది. న్యాయం కోసం సునీత తొక్కని గడప లేదు. మా పక్క న్యాయం, ధర్మం ఉంటే.. అటువైపు అన్యాయం, అధర్మం, డబ్బు ఉన్నాయి. కడప ప్రజలు న్యాయం వైపే నిలబడాలని కోరుతున్నా. నేను మీ బిడ్డను... దేనికీ భయపడను. కొంగుచాపి న్యాయం అడుగుతున్నాం. హస్తం గుర్తుకు ఓటు వేసి వైఎస్ఆర్, వివేకాకు న్యాయం చేయండి' అని షర్మిల కోరారు.

జాబు రావాలంటే జగన్ పాలన పోవాలి!

- ఉద్యోగాలివ్వనందుకు మళ్లీ ఎందుకు సీఎం చేయాలి?
- నవ సందేహాల పేరిట జగన్‌కు షర్మిల లేఖ

అమరావతి/కడప, మే 2 (ఆంధ్రజ్యోతి): 'జాబు రావాలంటే బాబు పోవాలని ఎన్నికల ముందు ప్రజలను నమ్మించారు.. మరి మీ ప్రభుత్వంలో ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు ఎందుకు పోతున్నారు?.. ఇప్పుడు జాబు రావాలంటే మీ పాలన పోవాలని అంగీకరిస్తారా' అంటూ ఏపీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి జగన్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఏటా జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని మాట చెప్పి, ప్రభుత్వోద్యోగాలు భర్తీ చేయని జగన్‌కు మరోసారి ముఖ్యమంత్రి పదవిని యువత ఎందుకు కట్టబెట్టాలని నిలదీశారు. గత ఎన్నికల ముందు నిరుద్యోగులకు జగన్ ఇచ్చిన ఉద్యోగాల హామీ విషయంలో తాము అడుగుతున్న నవ సందేహాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమంత్రి జగన్‌కు ఆమె ఈ మేరకు లేఖ రాశారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ వంటి కీలక హామీలు ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ, తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని, ఆ తర్వాతే యువతను ఓట్లు అడగాలని ఆమె డిమాండ్ చేశారు.



హైవేపై ఆగిన కంటైనర్లు.. విచారిస్తున్న పోలీసులు

అబ్బో.. ఎంత డబ్బో!

- కంటైనర్లలో రూ.2 వేల కోట్లు
- అనంతలో హైవేపై నిలిపేసిన పోలీసులు
- ఆర్‌బీఐకి తరలిస్తున్నట్లు గుర్తించి.. వదిలేశారు

పామిడి, మే 2: అనంతపురం జిల్లా పామిడి మండలం గజరాంపల్లి గ్రామ సమీపంలో పోలీసులు నాలుగు కంటైనర్లను తనిఖీ చేశారు. వాటిలో ఏకంగా రూ.2 వేల కోట్ల నగదు ఉన్నట్లు గుర్తించి.. ఐటీ, పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కేరళ నుంచి హైదరాబాద్‌లోని ఆర్‌బీఐకి ఈ నగదు తరలిస్తున్నట్లు నిర్ధారించుకుని వదిలిపెట్టారు. ఈ వ్యవహారం జిల్లాలో గురువారం ఉత్కంఠ రేపింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పామిడి సీఐ రాజశేఖర్ రెడ్డి తన సిబ్బందితో 44వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. పోలీసు స్టిక్కర్ వేసుకొని వస్తున్న కంటైనర్లను ఆపి వివరాలు ఆరా తీశారు. కేరళలోని కొచ్చి నుంచి నాలుగు కంటైనర్లలో రూ.2 వేల కోట్ల నగదు హైదరాబాద్‌కు తీసుకువెళుతున్నట్లు తెలుసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో ఆదాయ పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్ నళిని, గుంతకల్లు డీఎస్పీ శివ భాస్కర్ రెడ్డి అక్కడికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఫెడరల్ బ్యాంక్ నుంచి రూ.వెయ్యి కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.500 కోట్లు, ఐడీబీఐ నుంచి రూ.500 కోట్లు హైదరాబాద్‌లోని ఆర్‌బీఐకి వెళ్తున్నట్లు నిర్ధారించారు. అవసరమైన రికార్డులను స్వీకరించి, కంటైనర్లను విడిచిపెట్టారు.

రూ.2.40 కోట్ల నగదు పట్టివేత

గోపాలపురం, మే 2: తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం జగన్నాథపురం శివారులోని అంతర్‌జిల్లాల చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో రూ.2.40 కోట్ల నగదును పోలీసులు పట్టుకున్నారు. ఈ సొమ్ముకు సరైన ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లా అంతటా 21 ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, 24 స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్‌లు, 15ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల నిరంతర నిఘా ఉంచామన్నారు.



ప్రాణాలు తీసిన బలవంతపు ఎక్సర్‌సైజ్

- ఆరేళ్ల కుమారునితో ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తించిన తండ్రి
- తీవ్ర అనారోగ్యంతో బాలుని మృతి.. అమెరికాలో ఘటన
- కోర్టులో సాక్ష్యంగా సీసీటీవీ ఫుటేజీ



న్యూజెర్సీ, మే2: మరీ లావుగా ఉన్నాడన్న కారణంతో ఓ తండ్రి చేయించిన బలవంతపు ఎక్సర్‌సైజ్ ఆరేళ్ల బాలుని ప్రాణాలు తీసింది. మూడేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన తాజాగా కోర్టులో విచారణకు వచ్చింది. కోర్టులో సాక్ష్యంగా ప్రవేశపెట్టిన ఫిట్‌నెస్ సెంటర్‌లోని సీసీటీవీ కెమేరాల ఫుటేజీ కలవరపరిచింది. న్యూజెర్సీకి చెందిన క్రిస్టోఫర్ గ్రిగర్ (31)కు తన కుమారుడు కోరీ మిస్సియాలో (6) మరీ లావుగా ఉన్నాడన్న భావన ఉండేది. అట్లాంటిక్ హైట్స్ క్లబ్ హౌస్‌లోని ఫిట్‌నెస్ సెంటర్‌కు తీసుకువెళ్లి ఎక్సర్‌సైజ్‌లు చేయించేవాడు. 2021 మార్చి 20న ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తే ఎక్సర్‌సైజ్ చేయించాడు. ఆ రోజున ట్రెడ్ మిల్‌ను హైస్పీడ్‌లో నడిపాడు. పరుగెత్తలేక కోరీ పలుమార్లు పడిపోయినా ఊరుకోలేదు. అప్పటి నుంచి ఆరోగ్యం బాగులేకపోవడంతో తల్లి బ్రై మిస్సియాలో ఏప్రిల్ ఒకటో తేదీన ఆస్పత్రికి తీసుకెళ్లింది. శ్వాస సరిగ్గా తీసుకోకపోవడం, నత్తిగా మాట్లాడడం, వాంతులు వంటి సమస్యలు తలెత్తాయి. తన తండ్రి బలవంతంగా ట్రెడ్ మిల్‌పై పరుగెత్తేలా చేశాడని ఆస్పత్రిలో ఆ బాలుడు చెప్పాడు. వైద్యులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఆ బాలుడ్ని కాపాడలేకపోయారు. మరుసటి రోజునే ప్రాణాలు విడిచాడు. బలవంతపు ఎక్సర్‌సైజు గుండె, కాలేయంపై ప్రభావం చూపినట్టు పోస్టుమార్టం నివేదికలో తేలింది. దాంతో ఆ తండ్రిని 2022 మార్చి9న అరెస్టు చేశారు. ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తించడం, ఆ బాలుడు పడిపోవడం వంటి దృశ్యాలు సీసీటీవీ కెమేరాల్లో నమోదయ్యాయి. వీటిని చూసిన తల్లి కన్నీరు పెట్టుకుంది. ఆరోపణలు రుజువయితే ఆ తండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశం ఉంది.

నాటి మోదీ స్థానంలో

మన్‌కీబాత్ కుర్రాడు

- 33 ఏళ్ల హేమంగ్ జోషిని వరించిన వడోదరా టికెట్
- ఆయనకు చెప్పకుండానే ఇచ్చిన బీజేపీ అధిష్ఠానం
- హోలీ పండుగ వేడుకల్లో ఉండగా సమాచారం
- సిటింగ్ మహిళా ఎంపీని కాదని మరీ మంజూరు

వడోదర, మే 2: అదృష్టం వరించడం అంటే ఇదేనేమో? ఏకంగా ప్రధాని మోదీ ఒకనాడు పోటీ చేసిన సీటు టికెట్ ఓ సాధారణ యువకుడికి దక్కితే.. అదికూడా ఆయనకు చెప్పకుండానే మంజూరు చేస్తే.. సిటింగ్ ఎంపీని కాదని మరీ ఇస్తే..? వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం. గుజరాత్‌లోని వడోదరా స్థానంలో బీజేపీ ఈసారి ప్రయోగం చేసింది. ఈ స్థానంలో 33 ఏళ్ల హేమంగ్ జోషీ అనే కుర్రాడిని నిలిపింది. ప్రస్తుతం పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల్లో హేమంగే చిన్నవారు. కాగా, బరోడాలోని ఎంఎస్ విశ్వవిద్యాలయంలో సోషల్ వర్క్ కోర్సు చేసిన హేమంగ్ సానెడో అనే జానపద నాటకాలు రాసేవారు. ఇవన్నీ స్వచ్ఛ భారత్ కేంద్రంగా ఉండేవి. గుజరాత్ అప్పటి సీఎం ఆనందీబెన్ పటేల్ చొరవ చూపి ఓ కార్యక్రమం అప్పగించారు. సానెడోకు ప్రాచుర్యం రావడంతో 2016లో మన్ కీ బాత్‌లో హేమంగ్ పేరును మోదీ ప్రస్తావించి, తర్వాత అభినందన లేఖ రాశారు. ప్రస్తుతం ఐఐఎం అహ్మదాబాద్‌లో 'లీడర్‌షిప్'పై పీహెచ్‌డీ చేస్తున్న ఆయన.. హోలీ నాడు భార్యతో కలిసి వేడుకల్లో పాల్గొన్న సమయంలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కారణం ఏవిటా? అని చూడగా వడోదర ఎంపీ టికెట్ కేటాయించినట్లు తెలిసింది. ఇక్కడ సిటింగ్ ఎంపీగా రంజన్‌భట్ ఉన్నారు. 2014లో మోదీ వడోదర సీటును వదిలి వారాణసీ ఎంపీగా కొనసాగారు. ఆ తర్వాత ఉప ఎన్నికతో పాటు 2019లోనూ రంజన్ నెగ్గారు. ఆమెపై వ్యతిరేకత రావడంతో హేమంగ్‌ను ఎంపిక చేశారు.





బ్రిజ్ భూషణ్ టికెట్ ఆయన కొడుక్కే..

లఖ్‌నవూ, మే 2: మహిళా రెజ్లర్‌లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌కు మరోసారి టికెట్ ఇచ్చేందుకు బీజేపీ నిరాకరించింది. అయితే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానాన్ని తన చిన్న కుమారుడు, రాష్ట్ర రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు కరణ్ భూషణ్ సింగ్‌కు కేటాయించింది. జాతీయ స్థాయి షూటర్ అయిన కరణ్, ఆస్ట్రేలియాలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌ను పూర్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని మరో ప్రముఖ లోక్‌సభ నియోజకవర్గమైన రాయ్‌బరేలీ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి దినేశ్ ప్రతాప్‌సింగ్ పేరును బీజేపీ ఖరారు చేసింది.

దుబాయ్‌లో మళ్లీ వర్షాలు

దుబాయ్, మే 2: ఎడారి దేశం యూఏఈ(యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)ని వర్షాలు మళ్లీ హడలెత్తిస్తున్నాయి. దుబాయ్, అబుదాబీ సహా పలు ప్రాంతాల్లో గురువారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. గత నెలలో దుబాయ్‌ను ముంచెత్తిన భారీ వర్షాలతో పోలిస్తే తీవ్రత తక్కువే అయిన జాతీయ విపత్తు నిర్వహణ విభాగాలు ముందస్తు హెచ్చరికలు జారీ చేశాయి. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు చేశాయి. భారీ వర్షాల ప్రభావంతో గురువారం పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. మరికొన్ని సర్వీసులను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. అంతేకాక, దుబాయ్‌లో పలు రహదారులను తాత్కాలికంగా మూసివేశారు. అంతర్గత బస్సు సర్వీసులను రద్దు చేశారు. పాఠశాలలు, విద్యాసంస్థలకు గురు, శుక్రవారాలు సెలవుగా ప్రకటించారు. అయితే, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ఉండేందుకు దుబాయ్ మెట్రో రైలు సర్వీసులను పెంచారు. కాగా, ఏప్రిల్ 14-15 తేదీల్లో కురిసిన కుంభవృష్టి వల్ల దుబాయ్‌లో ఓ ఏడాదిన్నరలో కురిసే వర్షం గంటలోనే కురిసింది. ఫలితంగా దుబాయ్‌ను వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే.

ఢిల్లీ మహిళా కమిషన్‌లోని 223 మంది కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు

- లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం

న్యూఢిల్లీ, మే2: ఢిల్లీ మహిళా కమిషన్‌లో పనిచేస్తున్న 223 మంది కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపునకు లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఆమోదం తెలిపారు. వారి నియామకాలు అక్రమం, చట్టవ్యతిరేకమని పేర్కొంటూ ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన స్వాతి మలివాల్ ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ఉద్యోగులను నియమించారని దర్యాప్తులో తేలడంతో వారిని తొలగిస్తున్నట్టు మహిళా, శిశు సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ పేర్కొన్నారు.మహిళా కమిషన్‌కు కేవలం 40 పోస్టులు మాత్రమే కేటాయించగా ఆమె మాత్రం లెఫ్టినెంట్ గవర్నర్, ఆర్థిక శాఖ అనుమతులు తీసుకోకుండానే ఇంతమందిని నియమించారని తెలిపారు.

గోల్డీబ్రార్ బతికే ఉన్నాడు: అమెరికా పోలీసులు

వాషింగ్టన్, మే 2: పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, నిషేధిత ఖలిస్థానీ వేర్పాటు సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌కు చెందిన ఉగ్రవాది గోల్డీ బ్రార్ బతికే ఉన్నట్లు అమెరికా పోలీసులు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం కాలిఫోర్నియాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో చనిపోయిన వ్యక్తి పేరు జేవియర్ గాల్డ్నే(37) అని వివరించారు. అసలు గోల్డీ బ్రార్ చనిపోయాడనే ప్రచారం స్థానిక మీడియాలో ఎలా జరిగిందో తెలియదని, ఈ అంశంపై తమకు ప్రపంచం నలుమూలల నుంచి ఎంక్వైరీలు వస్తున్నాయని ఫ్రెస్నో పోలీసు విభాగం అధికారి లెఫ్టినెంట్ పాల్ సెర్వాంటెస్ వివరించారు. ఈ ఘటనలో కాల్పులు జరిపిన వ్యక్తిని డారెన్ విలియమ్స్ అనే 33 ఏళ్ల యువకుడిగా డిటెక్టివ్ విభాగం గుర్తించినట్లు చెప్పారు.

సర్వేల పేరుతో పథకాలకు ఓటర్ల నమోదు వద్దు

- జాతీయ, రాష్ట్ర స్థాయి పార్టీలకు ఈసీ ఆదేశం

న్యూఢిల్లీ, మే2: ప్రకటనలు, సర్వేలు లేదా మొబైల్ అప్లికేషన్ల ద్వారా ఎన్నికల అనంతరం పథకాల లబ్ధి చేకూర్చుతామని ఓటర్ల పేర్లను నమోదు చేయడాన్ని తక్షణమే ఆపివేయాలని రాజకీయ పార్టీలను ఎన్నికల సంఘం (ఈసీ) గురువారం ఆదేశించింది. వివిధ సర్వేల ముసుగులో కొన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల తర్వాత లబ్ధిదారులకు అందించే పథకాల కోసం వ్యక్తుల వివరాలను కోరుతున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీలకు ఈసీ సూచనలను జారీ చేసింది. అలాంటి ప్రకటనలపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

కొవాగ్జిన్ టీకా భేష్!

- కొవిషీల్డ్ టీకా దుష్ప్రభావాలపై వార్తల నేపథ్యంలో భారత్ బయోటెక్ ప్రకటన

న్యూఢిల్లీ, మే 2: కొవిషీల్డ్ టీకా వల్ల అరుదైన సందర్భాల్లో రక్తం గడ్డకట్టడం వంటి దుష్ప్రభావాలు ఉన్నట్టు సాక్షాత్తూ దాన్ని తయారుచేసిన ఆస్ట్రాజెనెకా సంస్థే ఒప్పుకొన్న నేపథ్యంలో.. భారత్ బయోటెక్ సంస్థ తెరపైకి వచ్చింది. తాము అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ టీకాకు అద్భుతమైన సేఫ్టీ రికార్డు ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో ట్వీట్ చేసింది. భద్రత, సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని అత్యంత జాగ్రత్తగా తాము టీకాను అభివృద్ధి చేశామని వెల్లడించింది. కొవిడ్-19 టీకాల కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన టీకాల్లో.. భారతదేశంలో ఎఫికసీ ట్రయల్స్ జరిగిన ఏకైక టీకా కొవాగ్జినే అని పేర్కొంది. దేశంలో 27వేల మందిపై తమ టీకా ట్రయల్స్ నిర్వహించినట్టు తెలిపింది. తమ టీకా వల్ల రక్తం గడ్డకట్టడం, పెరికార్డైటిస్, మయోకార్డైటిస్ వంటి దుష్ప్రభావాలు నమోదైన కేసు ఒక్కటి కూడా లేదని స్పష్టం చేసింది.

రాహుల్‌ను ప్రధానిగా చేయాలని పాక్ తహతహ!



భారత్‌లో బలహీన, అవినీతి ప్రభుత్వం ఉండాలన్నది శత్రుదేశం ఆలోచన: మోదీ

ఆనంద్, సురేందర్‌నగర్, మే 2: రాహుల్‌గాంధీని భారతదేశ ప్రధానమంత్రిగా చేయాలని పాకిస్థాన్ తహతహలాడుతోందని ప్రధాని మోదీ చెప్పారు. భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని శత్రుదేశం భావిస్తోందన్నారు. గురువారం గుజరాత్‌లోని ఆనంద్, సురేందర్‌నగర్, జునాగఢ్‌లలో జరిగిన బీజేపీ ఎన్నికల సభల్లో మోదీ ప్రసంగించారు. 'భారత్‌లో కాంగ్రెస్ పార్టీ మరణిస్తోందని పాకిస్థాన్ ఏడుస్తోంది. ఆ పార్టీ కోసం పాక్ నేతలు ప్రార్థనలు జరుపుతున్నారు. ఇది మనకేమీ ఆశ్చర్యం కలిగించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, కాంగ్రెస్ పాకిస్థాన్ మద్దతుదారు అని తెలిసిందే' అని తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీపై రాహుల్‌గాంధీ విమర్శలు చేస్తున్న ఓ వీడియోను బుధవారం పాక్ మాజీ మంత్రి చౌదరి ఫవాద్ హుస్సేన్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ఈ నేపథ్యంలో.. కాంగ్రెస్‌పై, రాహుల్‌పై మోదీ ఆరోపణలు గుప్పించారు. ముంబై ఉగ్రవాద దాడుల సమయంలో ఉన్నట్లుగా భారత్‌లో బలహీన ప్రభుత్వం ఉండాలని, 2014కు ముందులాగా అవినీతి ప్రభుత్వం ఉండాలని పాకిస్థాన్ కోరుకుంటోందన్నారు. తాను ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాక్ ఉగ్రవాదం టైర్లు పంచర్ అయ్యాయన్నారు. గతంలో ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసిన పాకిస్థాన్ ఇప్పుడు గోధుమపిండి దిగుమతుల కోసం తంటాలు పడుతోందని, బాంబులను పట్టుకున్న చేతులు ఇప్పుడు భిక్షపాత్రను పట్టుకున్నాయని ఎద్దేవా చేశారు.

లిఖితపూర్వకంగా చెప్పాలి!

ఓబీసీల రిజర్వేషన్లను తగ్గించి ఆ కోటాను ముస్లింలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ ఆలోచన అని మోదీ పునరుద్ఘాటించారు. ఒకవేళ ఆ పార్టీకి ఆ ఆలోచన లేకపోతే, లిఖితపూర్వకంగా ఆ విషయం చెప్పాలని సవాల్ చేశారు. యూపీలో సమాజ్‌వాదీపార్టీ తరఫున పోటీ చేస్తున్న కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ మేనకోడలు మరియా ఆలం ఇటీవల.. ఇండియా కూటమికి మద్దతుగా ఓట్ల జిహాద్ జరపాలని పిలుపు ఇచ్చారని మోదీ పేర్కొన్నారు. ఇంతవరకు లవ్‌జిహాద్, ల్యాండ్ జిహాద్ గురించే విన్నామని, ఇప్పుడు ఓట్ల జిహాద్ అని అంటున్నారని విమర్శించారు.

అబద్ధాలు వ్యాప్తి చేస్తున్న కాంగ్రెస్

- ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, మే 2: కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసి సమాజంలో ఘర్షణ వాతావరణం సృష్టిస్తోందంటూ బీజేపీ గురువారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రాజ్యాంగాన్ని మార్చివేసేందుకే 400 ఎంపీ సీట్లు కావాలని కోరుకుంటోందంటూ తమపై అసత్యాలు వ్యాప్తి చేస్తోందని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తారంటూ అబద్ధాలు చెబుతోందని ఆరోపించింది. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది, పార్టీ నాయకుడు ఓం ప్రకాశ్ ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు అందజేశారు. కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి పార్టీలు డీప్ ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. అనంతరం సుధాంశు త్రివేది విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 15 సంఘటనలను ఈసీ దృష్టికి తెచ్చామని చెప్పారు. స్వేచ్ఛగా, నిజాయితీగా ఎన్నికలు జరగకుండా కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌ను వెతుక్కోవాల్సిందే: షా



న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): రాహుల్ ప్రారంభించిన భారత్ జోడో యాత్ర చివరకు కాంగ్రెస్ అన్వేషణ యాత్రగా మారుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకూ జరిగిన రెండు దశల ఎన్నికల్లో కాంగ్రెస్ ఊసే ఎక్కడా వినిపించలేదని, మొత్తం ఎన్నికలు పూర్తయ్యాక ఆ పార్టీ ఎక్కడుందో వెతుక్కుంటూ రాహుల్ యాత్ర చేయాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని బరైలీలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో, అలాగే, ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. సంప్రదాయ ఓటు బ్యాంకు దూరమవుతుందన్న భయంతోనే అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ హాజరు కాలేదని దుయ్యబట్టారు. యూపీ సీఎం కావాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్, రాహుల్‌ను ప్రధాని చేయాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా భావిస్తున్నారని.. కానీ, వారి కలలు కల్లలు కావడం ఖాయమని జోస్యం చెప్పారు.

ప్రజ్వల్‌పై లుక్ అవుట్ నోటీసు

విచారణకు రాకుంటే అరెస్టు చేస్తాం

కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర హెచ్చరిక

ప్రజ్వల్‌పై మరో మహిళ ఫిర్యాదు

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలపై దర్యాప్తు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అతనిపై లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. తనను లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు హాసన్ జిల్లా హొళె నరసీపుర పోలీస్‌స్టేషన్‌లో ప్రజ్వల్‌తోపాటు ఆయన తండ్రి, జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే ప్రజ్వల్ దేశం విడిచి పరారయ్యారు. ఈ నేపథ్యంలో 24 గంటల్లోగా తమ ముందు విచారణకు హాజరు కావాలని సిట్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. అయితే, తాను జర్మనీలో ఉన్నానంటూ ప్రజ్వల్ న్యాయవాదుల ద్వారా ఏడు రోజుల గడువు కోరారు. ఆ విజ్ఞప్తిని తిరస్కరించిన సిట్ గురువారం అతనిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలకు లుక్ అవుట్ నోటీసులు పంపారు. లుక్ అవుట్ నోటీసు తర్వాత కూడా ప్రజ్వల్ ఆచూకీ లభించకపోతే.. కోర్టు నుంచి నాన్ బెయిలబుల్ నోటీసు జారీ చేసే అవకాశం ఉంది. కాగా, ప్రజ్వల్ గడువులోగా విచారణకు హాజరు కాకుంటే అరెస్టు చేస్తామని కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర హెచ్చరించారు. కలబురగిలో పరమేశ్వర గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రజ్వల్ వద్ద దౌత్య పాస్‌పోర్ట్ ఉన్నందునే రాత్రికి రాత్రి దేశం విడిచి వెళ్లగలిగారని చెప్పారు. కాగా, ప్రజ్వల్ తనపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ హొళెనరసీపుర పోలీస్‌స్టేషన్‌లో గురువారం మరో మహిళ ఫిర్యాదు చేశారు. మరోవైపు.. ప్రజ్వల్ రాసలీలల వీడియోలు లీక్ చేసిన ఆయన మాజీ డ్రైవర్ కార్తీక్.. సిట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో అదృశ్యమయ్యారు. ప్రస్తుతం మలేసియాలో ఉన్న కార్తీక్ మంగళవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ వీడియోలు, ఫొటోలను తాను బీజేపీ నేత దేవరాజె గౌడకు తప్ప మరెవ్వరికీ ఇవ్వలేదని ఆ వీడియో సందేశంలో కార్తీక్ పేర్కొన్నారు.

మా సభకు అఖిలేశే రావాలి!

ప్రియాంక రోడ్ షోలలో పాల్గొనాలి

- కేజ్రీ సతీమణి వారాణసీలో పర్యటించాలి
- యూపీలో కాంగ్రెస్ అభ్యర్థుల డిమాండ్
- స్టార్ క్యాంపెయినర్లలో సీఎం రేవంత్

(సెంట్రల్ డెస్క్)



ఉత్తరప్రదేశ్ అంటే.. ఒకప్పుడు కాంగ్రెస్ అడ్డా. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఇక్కడినుంచే గెలిచి దేశానికి ప్రధానులుగా వ్యవహరించారు. సోనియా గాంధీ రెండున్నర దశాబ్దాల పాటు యూపీ ఎంపీగా కొనసాగారు. రాహుల్‌గాంధీ అమేఠీ నుంచి మూడుసార్లు గెలిచారు. ఈ రాష్ట్రంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టిన హస్తం పార్టీ ప్రియాంక గాంధీకి రెండేళ్ల కిందటనే బాధ్యతలు అప్పగించింది కూడా. కానీ, ఇప్పుడు యూపీ కాంగ్రెస్ అభ్యర్థులంతా తమ బహిరంగ సభలకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ హాజరు కావాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఓవైపు రాహుల్, మరోవైపు ప్రియాంక ఉన్నప్పటికీ వారిలా కోరుతుండడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యపరుస్తోంది. అయితే, ఈ ముగ్గురూ కలిసి పాల్గొంటే మరీ మంచిదని కొందరు పేర్కొంటున్నారు. అమ్రోహాలో రాహుల్, అఖిలేశ్ ఒకే సభలో పాల్గొన్న అనంతరం పరిస్థితుల్లో మార్పు వచ్చిందని చెబుతున్నారు. ప్రియాంక రోడ్ షోలకు అభ్యర్థులు పట్టుబడుతున్నారు. కాగా, సీతాపూర్, దేవోరియాతో పాటు ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారాణసీల్లో అఖిలేశ్ సభల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. మరోవైపు రాజకీయాల్లో కులానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే యూపీలో తమతమ వర్గాలకు చెందిన నాయకులు ప్రచారంలో పాల్గొనాలని ఇంకొందరు అభ్యర్థులు ఆశిస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోదీ తివారీని బ్రాహ్మణులు అధికంగా ఉన్నచోటకు, ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌ను లఖ్‌నవూ, సీతాపూర్ వంటి ఠాకూర్ ప్రాబల్య ప్రాంతానికి పంపాలని కోరుతున్నారు. ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీతతో వారాణసీలో ప్రచారం చేయించాలని యూపీ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్, ఆ పార్టీ ఎన్నికల వ్యూహకర్తలు యోచిస్తున్నారు. 2014లో వారాణసీలో మోదీపై కేజ్రీ పోటీకి దిగి 2 లక్షలపైగా ఓట్లు సాధించారు. ఈసారి మోదీపై అజయ్ రాయ్ పోటీ చేస్తున్నారు. కాగా, యూపీలో కాంగ్రెస్ 17 సీట్లలో పోటీచేస్తోంది. ఎస్పీ, ఇండియా కూటమిలోని ఇతర పక్షాలు 63 స్థానాల్లో బరిలో దిగాయి. హస్తం పార్టీ స్టార్ క్యాంపెయినర్లుగా 40 మంది పేర్లను ప్రకటించింది. వీరిలో తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ సీఎంలు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖు ఉన్నారు. దశలవారీగా వీరు ప్రచారం చేస్తారు.

మాస్ రేపిస్టుకు మోదీ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

శివమొగ్గలో ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ప్రజ్వల్ తరఫున ప్రచారం చేసినందుకు దేశంలోని మహిళలకు ప్రధాని నరేంద్ర మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది సెక్స్ కుంభకోణం కాదు.. మాస్ రేప్ అన్నారు. ఒక మాస్ రేపిస్టుకు మద్దతుగా ప్రధాని ప్రచారం చేశారని విమర్శించారు. ప్రజ్వల్‌కు ఓటు వేస్తే తనకు మద్దతు ఇచ్చినట్టేనని రాష్ట్ర ప్రజల ముందు చెప్పిన మోదీ.. దేశంలోని ప్రతి మహిళను అవమానించారని మండిపడ్డారు. 'ప్రజ్వల్ మాస్ రేపిస్ట్ అని బీజేపీలో ప్రతి నాయకుడికీ తెలుసు. అయినా అతడికి మద్దతు పలకడమే కాకుండా జేడీఎస్‌తో పొత్తు పెట్టుకున్నారు' అని ఆయన ఆరోపించారు. ఒక మాస్ రేపిస్ట్ కోసం ప్రధాని ప్రచారం చేయడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. సభలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కర్ణాటక సీఎం సిద్దరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నడ్డా రాజీనామా చేయాలి: రాహుల్

సమానత్వాన్ని కోరుకునే వారందరూ నక్సలైట్లేనని వ్యాఖ్యానించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'బీజేపీ నేతలు మరోసారి రాజ్యాంగంపై దాడి చేశారు. దళితులు, ఓబీసీలు, గిరిజనులు సమానత్వం కోరుకుంటే వారంతా నక్సలైట్లు అని నడ్డా చెబుతున్నారు. రాజ్యాంగంపై ఇంతకంటే పెద్దదాడి మరొకటి ఉండదు' అని రాహుల్ ఆరోపించారు. రాజ్యాంగంపై దాడి చేసినందుకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

మోదీ సర్కారు రిజర్వేషన్లు లాక్కుంటోంది

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను తొలగిస్తూ దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను రహస్యంగా లాగేసుకుంటోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, రిజర్వేషన్లు లేకుండా చేయడమే మోదీ మంత్ర అని అన్నారు. 2013లో ప్రభుత్వ రంగంలో 14 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఉండగా 2023 నాటికి అవి 8.4 లక్షలకు తగ్గాయని గురువారం 'ఎక్స్'లో రాహుల్ వెల్లడించారు.

బీజేపీలో అవినీతిపరులు: ప్రియాంక

చిర్మిరి(ఛత్తీస్‌గఢ్), మే 2: అవినీతిపరులు, ప్రజా సంక్షేమం గురించి నోరెత్తని నాయకులను బీజేపీ ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని చిర్మిరీ పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. మోదీ ప్రభుత్వం దేశ ఆస్తులను బిలియనీర్లకు దోచిపెడుతోందని మండిపడ్డారు. "బీజేపీలో రెండు రకాలైన నేతలను ప్రమోట్ చేస్తున్నారు. వీరిలో అత్యంత అవినీతిపరులు మొదటి రకం. ఇతర పార్టీలకు చెందిన అవినీతి నేతలపై ఆరోపణలు చేసి, వారిపై ఒత్తిడి తెచ్చి, బీజేపీలో చేర్చుకుంటారు. అప్పుడు వారు సచ్ఛీలురు అయిపోతారు. వారిపై ఎలాంటి కేసులూ ఉండవు' అని ప్రియాంక అన్నారు. 'ఇక ప్రజా సమస్యల గురించి మాట్లాడని వారు రెండో రకం నాయకులు. ధరల పెరుగుదల, ప్రజల సమస్యలపై వారు తమ ప్రసంగాల్లో ఒక్కసారి కూడా మాట్లాడరు" అని ఆమె పేర్కొన్నారు.

ఆకాశ దేశం నుంచి అవనికి లేజర్ సందేశం



22.6 కోట్ల కి.మీ. దూరాన ఉన్న సైకీ వ్యోమనౌక నుంచి 10 నిమిషాల డేటా అందుకున్న నాసా

న్యూయార్క్, మే 2: ప్రపంచంలోని అన్ని దేశాల వద్ద ఉన్న సంపదకన్నా విలువైన లోహాలతో కూడిన సైకీ అనే గ్రహశకలంపై పరిశోధనకు నాసా పంపిన సైకీ అనే వ్యోమనౌక.. 22.6 కోట్ల కిలోమీటర్ల దూరం నుంచి లేజర్ సందేశాలను భూమికి పంపింది! సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న దూరం కన్నా ఒకటిన్నర రెట్ల దూరం ఇది. "ఏప్రిల్ 8న సైకీ వ్యోమనౌక డేటా నుంచి 10 నిమిషాల డేటాను మేం డౌన్‌లోడ్ చేసుకున్నాం" అని ఈ ప్రాజెక్టుకు ఆపరేషన్స్ లీడ్‌గా వ్యవహరిస్తున్న మీరా శ్రీనివాసన్ తెలిపారు. దీన్ని గణనీయమైన మైలురాయిగా అభివర్ణించిన ఆమె.. భవిష్యత్తులో వ్యోమనౌకల ద్వారా సమాచార ప్రసారంలో ఆప్టికల్ కమ్యూనికేషన్స్ ఎంత ప్రముఖ పాత్ర వహిస్తాయో చెప్పడానికి ఇదో నిదర్శనమన్నారు. సైకీ స్పేస్ క్రాఫ్ట్‌లో అమర్చిన 'డీప్‌స్పేస్ ఆప్టికల్ కమ్యూనికేషన్స్ (డీఎస్‌వోసీ) టెక్నాలజీ' ద్వారా.. రోదసి నుంచి సమాచారాన్ని అత్యంత వేగంగా ప్రసారం చేయడంలో నాసా సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ టెక్నాలజీ వల్లే సంక్లిష్టమైన శాస్త్రీయ సమాచారాన్ని, హై-డెఫినిషన్ చిత్రాలను, వీడియోలను అత్యంత వేగంగా అందుకోగలిగింది. భవిష్యత్తులో ఎప్పుడైనా మానవులను కుజ గ్రహానికి పంపే మిషన్లను చేపడితే.. అలాంటి సందర్భాల్లో వేగంగా సమాచార ప్రసారానికి ఉపయోగపడే అతి పెద్ద అడుగుగా దీన్ని భావించవచ్చని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. నిజానికి 2023 డిసెంబరు 11న పరీక్షల్లో భాగంగా సైకీలోని డీఎస్‌వోసీ టెక్నాలజీ.. భూమికి 3.1 కోట్ల కిలోమీటర్ల దూరం నుంచి 15 సెకన్ల అల్ట్రా హైడెఫినిషన్ వీడియోను సెకనుకు 267 మెగాబిట్ల వేగంతో పంపింది. ఇప్పుడు వ్యోమనౌక దానికి ఏడు రెట్ల దూరం ప్రయాణించింది కాబట్టి డేటా ప్రసారవేగం సహజంగానే తగ్గింది. అలాగని.. ఏప్రిల్ 8న దాని ప్రసారవేగం అంత తక్కువగా ఏమీ లేదు. లక్ష్యిత వేగం 1 ఎంబీపీఎస్ అయితే.. ఏకంగా 25 ఎంబీపీఎస్ (సెకనుకు 25 మెగాబిట్లు) వేగంతో డేటాను పంపింది.

ఏమిటా గ్రహశకలం ప్రత్యేకత?

ఎప్పుడో 172 ఏళ్ల క్రితం.. ఇటలీకి చెందిన అనిబేల్ డి గాస్పరిస్ అనే ఖగోళ శాస్త్రవేత్త 'సైకీ' గ్రహశకలాన్ని కనుగొన్నాడు. ఇది కుజుడికి, గురుడికి మధ్య ఉండే ఆస్టరాయిడ్ బెల్ట్‌లో ఉండే వేలాది గ్రహశకలాల్లో ఒకటి. దీని వ్యాసం దాదాపు 220 కిలోమీటర్లు. శాస్త్రజ్ఞులు దీన్ని 'ఎం టైప్ ఆస్టరాయిడ్'గా వర్గీకరించారు. ఎం అంటే మెటల్. ఖనిజాలు, లోహాలతో కూడి ఉండే గ్రహశకలాలను ఈ వర్గీకరణలో చేరుస్తారు. దీని ఉపరితల వైశాల్యం 1,65,800 చదరపు కిలోమీటర్లు. ఈ గ్రహశకలంపై 10 క్వింటిలియన్ డాలర్ల విలువ చేసే ఖనిజాలు, లోహాలు (ఇనుము, నికెల్, బంగారం వంటివి) ఉంటాయని అంచనా. ఒక క్వింటిలియన్ అంటే.. పదివేల కోట్ల కోట్లు. అలాంటిది 10 క్వింటిలియన్ డాలర్లంటే.. ఆ సంఖ్యను మాటల్లో చెప్పడం కూడా కష్టమే!! అందుకే దానిపై పరిశోధనల నిమిత్తం 2023 అక్టోబరులో సైకీ వ్యోమనౌకను పంపారు. అది 2029 నాటికి ఆ గ్రహశకలానికి సమీపానికి చేరుకుని.. దూరం నుంచే దానిపై రెండేళ్లపాటు (2031 దాకా) పరిశోధనలు చేయనుంది.

అసలేమిటీ టెక్నాలజీ?

గుర్తుందా.. 20 ఏళ్ల క్రితం మనం టెలిఫోన్ నుంచి మోడెమ్‌కి కనెక్షన్ ఇచ్చి 256 కేబీపీఎస్(కిలోబిట్స్ పర్ సెకన్) వేగంతో పనిచేసే ఇంటర్‌నెట్ వాడేవాళ్లం. అప్పట్లో కొంచెం పెద్ద పరిమాణం ఉన్న ఫైళ్లను డౌన్‌లోడ్ చేయాలంటే తలప్రాణం తోకకొచ్చేది! 2009-10 నాటికి బ్రాడ్ బ్యాండ్ సేవలు విస్తరించాయి. ఆప్టికల్ ఫైబర్ ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చింది. డేటా సరఫరా గణనీయంగా పెరిగి మెగాబిట్స్‌కు చేరింది. ఇప్పుడు 5జీ వచ్చాక వేగం జీబీపీఎస్ (గిగాబిట్స్ పర్ సెకన్)కు చేరింది! ఇదే రీతిలో.. రోదసి నుంచి సమాచార ప్రసారానికి ప్రస్తుతం ఉపయోగిస్తున్న రేడియో తరంగాలకు బదులుగా బ్రాడ్‌బ్యాండ్ తరహాలో ఆప్టికల్ కమ్యూనికేషన్స్ సాయంతో 4కే, అల్ట్రా హైడెఫినిన్ రిజల్యూషన్‌తో డేటాను ట్రాన్స్‌మిట్ చేయొచ్చు. అందులో భాగంగానే నాసా ఈ డీఎస్‌వోసీ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తొలిసారి చందమామపై అడుగుపెట్టినప్పుడు అక్కడి నుంచి ట్రాన్స్‌మిట్ అయిన దృశ్యాలన్నీ నలుపు, తెలుపుల్లో ఉన్నాయి కదా! అదే ఈ టెక్నాలజీతో అయితే మాంచి కలర్, హైడెఫినిషన్ వీడియోలను చంద్రుడి మీది నుంచి పంపవచ్చన్నమాట.

విద్వేష ప్రసంగాలు మానండి

- పదేళ్లలో చేసిందేమిటో చెప్పండి
- ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ



న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): 'విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం కన్నా గత పదేళ్లలో మీరు చేసిందేమిటో ప్రజలకు చెప్పి ఓట్లు అడగండి' అంటూ ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హితవు పలికారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై స్వయంగా చెబుతున్న అబద్ధాలతో అనుకున్న ప్రయోజనాలు నెరవేరడం లేదని మోదీ గుర్తించారని, అందుకనే ఆ అబద్ధాలను బీజేపీ అభ్యర్థులు కూడా ప్రచారం చేయాలని కోరుకుంటున్నారని విమర్శించారు. అయితే, ఒక అబద్ధాన్ని వెయ్యి సార్లు చెప్పడం వల్ల అది నిజం కాబోదన్నారు. మోదీ తీవ్రమైన నిస్పృహతో, ఆందోళనతో ఉన్నట్లుగా ఆయన మాటలే తెలియజేస్తున్నాయని, ప్రధాని పదవి హోదాకు సరిపోని భాషను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని మోదీ ఎన్డీఏ ఎంపీ అభ్యర్థులకు బహిరంగ లేఖ రాసిన నేపథ్యంలో.. ఆ లేఖలోని అంశాలపై స్పందిస్తూ మోదీని ఉద్దేశించి ఖర్గే గురువారం లేఖ రాశారు

బీజేపీ చార్‌సౌ పార్ ఓ జోక్: థరూర్

బీజేపీ చెబుతున్న 'చార్‌సౌ పార్' అనేది ఓ జోక్ అని కాంగ్రెస్ నేత శశిథరూర్ అభిప్రాయపడ్డారు. బీజేపీకి 300కు మించి సీట్లు రావడం అసాధ్యమని, 200 మార్కును దాటడం సవాలేనన్నారు. గురువారం ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. దక్షిణాదిన కమల వికాసం ఉండబోదన్నారు. కేరళ, తమిళనాడు, ఏపీ రాష్ట్రాల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదని, తెలంగాణలో సిట్టింగ్ స్థానాలను కాపాడుకోవడం కూడా కష్టమేనని చెప్పారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం :	45.0	26.0
మహబూబ్‌నగర్ :	44.9	28.0
రామగుండం :	44.2	25.2
నిజామాబాద్ :	44.0	27.9
నల్లగొండ :	44.0	25.4





'ఢిల్లీ దర్బార్' పేరుతో కాంగ్రెస్ ప్రచార వీడియో

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేసిన అన్యాయాలను వివరిస్తూ 'ఢిల్లీ దర్బార్' పేరుతో టీపీసీసీ మరో వీడియోను విడుదల చేసింది. జీఎస్టీ నిధులు గుజరాత్‌కు ఎక్కువ, తెలంగాణకు తక్కువ కేటాయిస్తూ అన్యాయం చేస్తుండడాన్ని ఈ వీడియోలో వినూత్నంగా పొందుపరిచారు. బీజేపీ తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చినట్లు వీడియోలో చూపడం అందర్నీ ఆకట్టుకుంటోంది

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

8, 10వ తేదీల్లో రాష్ట్రంలో మోదీ పర్యటన

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. 8, 10వ తేదీల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం చేయనున్నారు. 8న ఉదయం 9 గంటలకు కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వేములవాడలో నిర్వహించే బహిరంగసభలో మోదీ పాల్గొంటారు. అనంతరం, ఉదయం 10.30 గంటలకు వరంగల్ జిల్లా మడికొండలో నిర్వహించే సభకు హాజరవుతారు. 10న మధ్యాహ్నం 2 గంటలకు మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని నారాయణపేట సభకు హాజరవుతారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ బహిరంగసభను నిర్వహించనున్నారు. అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 5న రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 11.30 గంటలకు కాగజ్‌నగర్, మధ్యాహ్నం 1.30 గంటలకు నిజామాబాద్, సాయంత్రం మల్కాజ్‌గిరిలో జరిగే సభలకు షా హాజరవుతారు. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 6న ఉదయం 11 గంటలకు పెద్దపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు భువనగిరి, సాయంత్రం 4 గంటలకు నల్గొండలో జరిగే బహిరంగసభల్లో పాల్గొంటారు.

బీజేపీలో చేరిన సినీ, టీవీ నటులు

పలువురు సినీ, టీవీ నటులు గురువారం బీజేపీలో చేరారు. మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు పసునూరి శ్రీనివాసరావు, కళ్యాణి, అశోక్‌కుమార్, ఎం.శైలజ, టి.జ్యోతి, డి.రమేశ్‌బాబు, ఎ.బాబూరావు, వెంకట్ బాలగోని తదితరులు పార్టీలో చేరారు. రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ వారికి కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

అక్కగా చెబుతున్నా..
సంస్కారవంతంగా మాట్లాడు

- రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి సబిత హితవు
- సీఎం వాడుతున్న భాషపై అభ్యంతరం



ధారూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): 'ఓ అక్కగా చెబుతున్నా. మహిళల గురించి ప్రస్తావించాలనుకుంటే బాధ్యతగా, సంస్కారవంతంగా మాట్లాడాలి' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం వికారాబాద్ జిల్లా ధారూరుకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. గద్వాలలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను తొక్కుకుంటూ పోతామని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం, తన గురించి ప్రస్తావిస్తూ.. 'మా అక్క పొద్దునో మాట. రాత్రో మాట మాట్లాడుతారు' అని వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. 'ఇంటికి పోయి నా మరదలు గీతను అడుగు. నేను ఎట్ల మాట్లాడుతానో చెబుతుంది' అని రేవంత్‌ను ఉద్దేశించి అన్నారు. మహిళల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా వ్యాఖ్యలు చేయాలని సూచించారు. చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ పార్టీ వైపు చూస్తున్నారని, కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ఈసీఐ డిప్యూటీ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో అన్ని స్థాయిల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, రాజకీయ పార్టీలకు మద్దతుగా వ్యవహరించినా, విధులను నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని ఈసీఐ డిప్యూటీ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్ హెచ్చరించారు. గురువారం ఆయన ఢిల్లీ నుంచి ఎన్నికల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నితీశ్‌కుమార్ మాట్లాడుతూ.. మే 13న పోలింగ్ నిర్వహించేందుకు చేసిన, చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విమర్శలకు తావులేకుండా ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా దృష్టి పెట్టాలని, ప్రతి అభ్యర్థిని, రాజకీయ పార్టీని సమానంగా చూడాలని ఆయన చెప్పారు. ఏవైనా పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని నితీశ్‌కుమార్ వ్యాస్ హెచ్చరించారు.

రేవంత్‌ను అరెస్టు చేస్తే మోదీకి పుట్టగతులుండవ్

- దత్తపుత్రుడు కావడం వల్లే జగన్‌ను ముట్టుకోవట్లేదు
- 'ఇండియా' కూటమి విజయం ఖాయం: నారాయణ

ఖమ్మం, మే 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని అరెస్టు చేస్తే ప్రధాని మోదీకి పుట్టగతులుండవని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారన్న కక్షతో ఇప్పటికే ఇద్దరు ముఖ్యమంత్రులను మోదీ జైలుకు పంపారని, తాజాగా ఇప్పుడు సీఎం రేవంత్‌కు నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ఒకవేళ ఈ అరెస్టు జరిగితే రేవంత్ ప్రతిష్ఠ పెరుగుతుందని, మోదీ ప్రతిష్ఠ దిగజారుతుందని స్పష్టం చేశారు. ఖమ్మంలో గురువారం సీపీఐ లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రూ.లక్ష కోట్లు దోచుకున్న ఏపీ సీఎం జగన్ పదేళ్లుగా బెయిల్‌పై ఉన్నా బీజేపీకి దత్తపుత్రుడు కావడం వల్లే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దేశంలోని 29 మంది కార్పొరేట్ శక్తుల కోసమే మోదీ పాలన సాగిస్తున్నారని, అంబానీ-అదానీలకు ఆయన దత్తపుత్రుడని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమి విజయం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.



గుమ్మడిదలలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

బీజేపీతో జోడి కడితే కవిత జైలుకెళ్లేదా..?

- ఆ పార్టీతో జతకట్టనందుకే ఈడీ కేసులు
- రాష్ట్రానికి పట్టిన శని రేవంత్: హరీశ్‌రావు

గుమ్మడిదల/హత్నూర, మే 2: 'బీజేపీతో జత కట్టనందుకే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈడీని ఉసిగొల్పి కుట్రపూరిత కేసులు పెట్టిస్తోంది.. బీజేపీతో బీఆర్ఎస్ జోడి కడితే ఎమ్మెల్సీ కవిత జైలుకి వెళ్లేదా..?' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. గురువారం మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల, హత్నూరలో కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి ఒక శనిలా పట్టాడని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చి కరువు తెచ్చిందని, వారి పాలనలతో మంచినీళ్లకు కూడా కష్టం వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని విమర్శించారు. 'కాంగ్రెస్‌కు శిక్ష పడాలంటే 13వ తేదీన గుంపు మేస్త్రీ గూబ గుయ్‌మనేలా కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలి. రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళితే.. అక్కడ దేవుళ్లపై ఒట్టు వేస్తున్నాడు. ఓట్లు తిట్లు తప్ప పేద ప్రజలకు చేసింది శూన్యం. మాట్లాడితే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తా అంటున్నాడే తప్ప ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పడం లేదు. అంటే ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలు గాలికి వదిలిసేనట్టేనా..?' అని ప్రశ్నించారు.

మామ అల్లుడు పాపాల భైరవులు

(మొదటిపేజీ తరువాయి)

అడుగుపెట్టానని చెప్పారు. 1980లో మెదక్ నుంచి ఇందిరాగాంధీని గెలిపించిన ఘనత ఇక్కడి ప్రజలదేనని గుర్తు చేశారు. అందుకు కృతజ్ఞతగా ఇందిర హయాంలో ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దారన్నారు. ఇప్పుడు ఇదే నియోజకవర్గం నుంచి బీసీ యువకుడికి అవకాశం కల్పించామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బీసీలకు పెద్దపీట వేశామని, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలకు మంత్రి పదవులు ఇచ్చామని, 16 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దొరల గడీలను బద్దలు కొట్టాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, లేదంటే బానిస బతుకులు తప్పవని పిలుపునిచ్చారు. ఎక్కడి నుంచో వచ్చిన వెంకట్రామారెడ్డి (బీఆర్ఎస్ అభ్యర్థి) చరిత్ర మీకు తెలియదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ డిపాజిట్ గల్లంతు చేయాలని సూచించారు. వాడుపోతే వీడు, వీడుపోతే వాడు అన్నట్లుగా ఒకరుపోతే ఒకరు ఈ ప్రాంతంలో ఆధిపత్యం చెలాయిస్తున్నారని.. చంద్రశేఖర్‌రావు, రఘునందన్‌రావు, హరీశ్‌రావు, తారకరామారావు అందరూ ఒక్కటేనని రేవంత్ విమర్శించారు. 'ఆ రావు అయినా.. ఈ రావు అయినా ఏ రాయి అయితే ఏమిటి తల పగలగొట్టుకోవడానికి? ఈ 'రావు'లు మనకు అవసరమా? అందుకే బీసీ బిడ్డకు ఓట్లు వేసి గెలిపించాలి. గెలిపిస్తే ముదిరాజ్‌కు మంత్రి పదవి ఇస్తా. బీసీ-డీ నుంచి బీసీ-ఏకు ముదిరాజుల సామాజికవర్గాన్ని మార్చుతా' అని హామీ ఇచ్చారు. యూపీఏ పదేళ్ల పాలనలో తెలంగాణకు అనేక ప్రాజెక్టులు, విద్యా సంస్థలు అందిస్తే.. మోదీ పదేళ్ల పాలనలో గాడిదగుడ్డు మాత్రమే ఇచ్చారని దుయ్యబట్టారు. దుబ్బాకలో కూడా రఘునందన్‌రావు (బీజేపీ అభ్యర్థి) వేల కోట్ల నిధులు తెస్తానని చెప్పి, గాడిదగుడ్డు ఇచ్చారని ఎద్దేవా చేశారు.

జనం వస్తారా అని సందేహించారు

హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ వెళ్లేటప్పుడు ఓ మిత్రుడు సిద్దిపేట మీటింగ్‌కు జనం వస్తారా అని సందేహం వ్యక్తం చేశాడని రేవంత్ చెప్పారు. ఆ తర్వాత ఆసిఫాబాద్‌లో బయల్దేరినప్పుడు కూడా మంత్రి సీతక్క.. ఓసారి కనుక్కోమని సూచించారన్నారు. కానీ, వేలాది మంది వస్తారనే నమ్మకంతోనే సిద్దిపేటకు వచ్చానని, తన నమ్మకం వమ్ము కాలేదని సీఎం స్పష్టం చేశారు. నిర్బంధాలు దాటుకుని పెద్ద సంఖ్యలో ప్రవాహంలాగా జనం తరలివచ్చారని, సిద్దిపేట ప్రజల పౌరుషాన్ని చూశాక.. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని తనకు సంపూర్ణమైన నమ్మకం కలిగిందన్నారు.



సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

పంద్రాగస్టున సిద్దిపేటకు స్వాతంత్ర్యం

పంద్రాగస్టులోగా రైతుల రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విసిరిన సవాల్‌ను గుర్తు చేస్తూ.. కొమురవెల్లి మల్లన్న సాక్షిగా రైతులందరికీ పంద్రాగస్టులోగా రూ.2 లక్షల రుణమాఫీ చేసి హరీశ్‌రావుతో రాజీనామా చేయిస్తానని సీఎం ప్రకటించారు. రుణమాఫీ చేసి లక్ష మందితో ఇదే చౌరస్తాలో సభ పెడతానని చెప్పారు. హరీశ్‌రావు రాజీనామాతోపాటు లెక్క పత్రం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సిద్దిపేటకు కొత్త ఎమ్మెల్యేను గెలిపిస్తానని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లుగానే పంద్రాగస్టు రోజున సిద్దిపేటకూ స్వాతంత్ర్యం వస్తుందన్నారు.

దయాకర్, నేనూ వేరు కాదు

పదవుల పరంగా పలువురికి మంచి అవకాశాలు కల్పించామని సీఎం చెబుతుండగా.. ఆయనతోపాటే ఉన్న అద్దంకి దయాకర్ గురించి కార్యకర్తలు నినదించారు. దీంతో రేవంత్ స్పందిస్తూ.. 'దయాకర్‌కు జర పెద్దది ఇద్దామనే అనుకున్న. దయాకర్‌దే ముఖ్యమంత్రి కుర్చీ.. నా పనంతా సగం ఆయననే చేస్తుంటడు. దయాకర్, నేను వేరు కాదు. ఆయనకు మంచి పదవి ఇస్తాం. కష్టపడ్డవాళ్లను గుర్తిస్తాం' అని ప్రకటించారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణకు సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్ పోయినట్లే..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో నిర్వహించిన జనజాతర సభలో, హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరిపిన కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేయాలని యోచిస్తోందని, దానికోసమే 400 సీట్లు పక్కాగా రావాలని పదేపదే ప్రచారం చేస్తోందన్నారు. బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్ కోల్పోయినట్టేనని అన్నారు. కుమ్రం భీం, రాంజీగోండ్‌ల పోరాట స్ఫూర్తితో బీజేపీపై పోరాడుతానని చెప్పారు. డిసెంబరులో కేసీఆర్ బాయ్ బాయ్ చెప్పారని, ఇప్పుడు మేలో మోదీకి బాయ్‌బాయ్ చెప్పాలని ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులను రద్దు చేసి, గాడిద గుడ్డు ఇచ్చినవారికి కర్రు కాల్చి వాతపెట్టాలని, మోదీని ఓడగొట్టాలని పిలుపునిచ్చారు.



పోలీసుల అదుపులో
మన్నె సతీశ్

- అమిత్‌షా ఫేక్ వీడియో కేసు..
- టీ కాంగ్రెస్ ఐటీ సెల్ ఇన్‌చార్జి సహా సభ్యులను అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫేక్ వీడియో కేసులో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి కోసం ఓ వైపు ఢిల్లీ పోలీసులు గాలిస్తుంటే.. అదే కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె సతీశ్‌తోపాటు మరి కొందరిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేసిన వారిలో సతీశ్ కూడా ఉన్నారు. అమిత్ షా ఫేక్ వీడియో కేసులో ఢిల్లీ పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో అదే కేసుకు సంబంధించి స్థానిక బీజేపీ నేతల ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు కీలక వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని విచారించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమిత్ షా ఫేక్ వీడియోపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేయడానికి ముందే బీజేపీ నేత ప్రేమేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై ఏప్రిల్ 27న సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సతీశ్‌తోపాటు సభ్యులు నవీన్, శివ, గీత, తస్లీమా, విష్ణును అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ నేత ప్రేమేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ ఐటీ సెల్‌పై పోలీసులు ఐపీసీ 469, 505(1) (సీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

గాంధీభవన్‌కు ఢిల్లీ పోలీసులు..

మరోవైపు, ఇదే కేసులో ఢిల్లీ పోలీసులు గురువారం మరోసారి గాంధీభవన్‌కు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ రామ్‌నివాస్ నేతృత్వంలో ప్రత్యేక బృందం గాంధీభవన్‌కు వచ్చింది. కేసు దర్యాప్తులో భాగంగా వివరాలు సేకరించి, నోటీసులు ఇచ్చేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న హైదరాబాద్ పోలీసులు గాంధీభవన్‌కు చేరుకుని ఢిల్లీ పోలీసులతో మాట్లాడారు. ఢిల్లీ పోలీసులు వచ్చిన సమయంలో కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి రాంచంద్రారెడ్డి అందుబాటులో లేకపోవడంతో వారు వెనుదిరిగారు. కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీ పోలీసులు గత నెల 29న తెలంగాణకు వచ్చారు. ఈ కేసులో ఢిల్లీ పోలీసుల ఎదుట మే 1న విచారణకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డికి నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే..

ఏపీలోకి వెళ్లిన 5 గ్రామాలను తీసుకొస్తాం!

- హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు
- తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో
- నేడు విడుదల చేయనున్న సీఎం రేవంత్



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణకు ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించింది. వివిధ వర్గాల ప్రజల మద్దతును కూడగట్టేలా ఈ మేనిఫెస్టోను రూపొందించారు. ముఖ్యంగా ఏపీలోకి వెళ్లిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలోకి తీసుకురావడం, హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు, మేడారం జాతరకు జాతీయ హోదా, డ్రై పోర్టు, బయ్యారం స్టీల్ ప్లాంట్ వంటి అనేక హామీలను పొందుపరిచారని తెలిసింది. మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలోని కమిటీ రూపొందించిన ఈ మేనిఫెస్టోను శుక్రవారం ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్ విడుదల చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ ఇప్పటికే జాతీయస్థాయిలో 'పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీల' పేరుతో మేనిఫెస్టోను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు. అయితే తెలంగాణపై ప్రత్యేక ఫోకస్‌తో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తాజా మేనిఫెస్టోను రూపొందించింది. దీనిలో అనేక అంశాలను పొందుపరిచింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకున్న ఐటీఐఆర్‌ను తిరిగి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, హైదరాబాద్‌లో ఐఐఎం, హైదరాబాద్-విజయవాడ మధ్య రాపిడ్ రైల్వే, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు హామీలను పొందుపరిచారు. ఏపీలో కలిపేసిన ఎటపాక, గుండాల, పురుషోత్తంపట్నం, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు గ్రామాలను తిరిగి తెలంగాణలోకి తీసుకొస్తామని, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కల్పిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ రీజినల్ కార్యాలయం, రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టు, రామగుండం-మణుగూరు రైల్వే లైన్ నిర్మాణం వంటి అంశాలను చేర్చారు. విద్యా రంగానికి సంబంధించి 4 సైనిక్ స్కూళ్లు, నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఐఐఎస్ఈఆర్ ఏర్పాటు, కేంద్రీయ విద్యాలయాల పెంపు, నవోదయ విద్యాలయాల రెట్టింపు తదితర అంశాలను పొందుపరిచారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ), నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ, జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) క్యాంపస్, ఐసీఎంఆర్ పరిధిలో అడ్వాన్స్‌డ్ మెడికల్ అండ్ హెల్త్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు హామీలను చేర్చారు. 73,74 రాజ్యాంగ సవరణల ఆధారంగా గ్రామ పంచాయతీలకు నేరుగా కేంద్ర గ్రాంటు వచ్చేలా, ప్రతి ఇంటికీ సోలార్ ఆధారిత విద్యుత్‌కు అవకాశం కల్పించేలా చర్యలకు హామీ ఇచ్చారు. హైదరాబాద్-బెంగళూరు ఐటీ అండ్ ఇండస్ట్రీ కారిడార్, హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-మిర్యాలగూడ, సింగరేణి పారిశ్రామిక కారిడార్లు, అంతర్జాతీయ స్థాయిలో సాంస్కృతిక, వినోదాత్మక హబ్ ఏర్పాటు అంశాలను చేర్చారని సమాచారం.

రేవంత్‌ను టచ్ చేస్తే మోదీకి షాకే

200 కేసులు పెట్టినా ఆయన భయపడలేదు.. ఇప్పుడూ భయపడరు: పొంగులేటి, తుమ్మల

- బీజేపీ వస్తే మతతత్వం పెరుగుతుంది
- భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌ను దీవించండి
- ఎత్తిపోతలకు త్వరలో మరమ్మతు: ఉత్తమ్
- బీజేపీ, బీఆర్ఎస్ సిద్ధాంతాలు ఒక్కటే
- కాంగ్రెస్‌తోనే దేశం సుభిక్షం: పొన్నం







(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సీఎం రేవంత్‌రెడ్డిని టచ్ చేస్తే మోదీకి షాక్ తగలడం ఖాయమని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో రేవంత్‌పై 200కు పైగా కేసులు పెట్టినా ఆయన భయపడలేదన్నారు. ఇప్పుడు ఈ ప్రధాన మంత్రికి భయపడే ప్రశ్నే లేదన్నారు. మోదీ, అమిత్‌షా తాతలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాకలేరని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన సభలు, సమావేశాల్లో వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని, అందుకే నామాను గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేయిస్తానంటూ కేసీఆర్ మాట్లాడుతున్నారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా ఒక్క సీటునూ గెలవలేవని జోస్యం చెప్పారు. కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్‌కాలనీలో కాంగ్రెస్ నాయకులతో, ఖమ్మంలో సీపీఐ నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరం పొంగులేటి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్, బీజేపీకి కర్రు కాల్చి వాతపెడితే తోక ముడుచుకున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులనే ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సారి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని, దేశంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పారు. ఎర్రజెండాల స్ఫూర్తితోనే తాను రాజకీయాలు ప్రారంభించానని, ఆ స్ఫూర్తితో పేదవర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో సీపీఐ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వామపక్షాలతో తనది సుదీర్ఘ రాజకీయ ప్రయాణమని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎర్రజెండాల రెపరెపల వెనుక ఎంతోమంది ప్రాణత్యాగాలున్నాయన్నారు. ఆస్తులను కూడా అమ్ముకుని కమ్యూనిస్టు పార్టీలకు సేవ చేశారన్నారు. వామపక్షాలతో కలిసి ఉన్నా లేకపోయినా అభివృద్ధిని మాత్రం తాను ఏనాడూ ఆపలేదన్నారు. గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కావాలంటే ఖమ్మం, మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలపించాలని కోరారు. కాగా, దేశ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌ను గెలిపించి, బీజేపీని ఓడించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే మతతత్వం పెరిగిపోతుందని, సామాన్యులు జీవించే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెంలో పార్టీ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిస్తే పేదల సమస్యలపై పోరాడే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని ఎత్తిపోతల పథకాలన్నింటికీ త్వరలోనే మరమ్మతులు చేయించి ఆయకట్టు చివరి భూములకు నీరందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు బొంద పెట్టారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పి, కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలో తీసుకురావాలన్నారు. అత్యధిక మెజారిటీ నల్లగొండలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని మాజీ మంత్రి జానారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాగా, బీజేపీ, బీఆర్ఎస్ సిద్ధాంతాలు ఒక్కటేనని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కాంగ్రెస్ ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. మతాలను రెచ్చగొట్టడంతోపాటు దేవుళ్లను అడ్డుపెట్టుకుని మోదీ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా, రాష్ట్రంలో లారీ ఓనర్ల సమస్యలను పరిష్కరిస్తానని లారీ ఓనర్స్ అసోసియేషన్ బాధ్యులకు పొన్నం భరోసా ఇచ్చారు.

కొత్తగూడెంలో రేపు సీఎం పర్యటన

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో శనివారం నిర్వహించనున్న బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం మంత్రి పొంగులేటి పరిశీలించారు. సీఎం సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పట్టభద్రుల ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ

నామినేషన్లకు 9వ తేదీ దాకా గడువు.. 27న పోలింగ్

- 5న కౌంటింగ్.. తొలిరోజు 3 నామినేషన్లు
- నేడు కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న నామినేషన్

నల్లగొండ, మే 2: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ (ఎమ్మెల్సీ) ఉపఎన్నికకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో గురువారమే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 10న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టభద్రుల ఉపఎన్నికకు పోలింగ్ నిర్వహిస్తారు. వచ్చే నెల 5వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ నియోజకవర్గం నుంచి గతంలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత ఏడాది జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఇక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది కాగా పట్టభద్రుల ఉపఎన్నికకు మొదటి రోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా ప్రజావాణి పార్టీ తరఫున పాటి శ్రీకాంత్‌రెడ్డి ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు.



గెలుపు గ్యారెంటీ ఎవరికో!?

మోదీ గ్యారెంటీతో సంజయ్ ముందుకు

- సొంత గ్యారెంటీలూ ప్రకటించిన వెలిచాల
- హ్యాట్రిక్ కొట్టిన పార్టీ గ్యారెంటీతో వినోద్
- కరీంనగర్‌లో ముక్కోణం



ఒకరిది మోదీ గ్యారెంటీ! మరొకరిది సొంత గ్యారెంటీ! ఇంకొకరిది పార్టీ గ్యారెంటీ! గతంలో కేసీఆర్‌కు హ్యాట్రిక్ ఇచ్చిన జిల్లాలో వరుసగా రెండోసారి గెలవాలని ఒకరు! తొలిసారి గెలిచి పార్లమెంటులో అధ్యక్షా..! అనాలని మరొకరు! గత ఎన్నికల్లో పరాజయానికి ప్రతీకారం తీర్చుకుని మరోసారి లోక్‌సభలో అడుగు పెట్టాలని ఇంకొకరు! వెరసి, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ప్రధాన పార్టీల మధ్య ముక్కోణపు పోరులో ఓటర్ల గ్యారెంటీ ఎవరికో!?







(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్, హైదరాబాద్)

తెలంగాణ ఉద్యమ సాధనలో ముందుండి గర్జించిన జిల్లా ఇది. ఉద్యమాన్ని ముందుండి నడిపించిన కేసీఆర్ హ్యాట్రిక్ విజయాల నియోజకవర్గమిది. కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధికంగా ఏడుసార్లు.. బీఆర్ఎస్ అభ్యర్థిని నాలుగుసార్లు.. బీజేపీ అభ్యర్థిని మూడుసార్లు పార్లమెంటుకు పంపింది! గత మూడు ఎన్నికల్లో ఒక్కోసారి ఒక్కొక్కరిని గెలిపిస్తున్న నియోజకవర్గం కూడా! అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు, సీట్లు రాకపోయినా.. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కమలం పార్టీని గెలిపిస్తోంది! అంతేనా.. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని సెగ్మెంట్లలో కలిపి బీఆర్ఎస్‌కు 5,249 ఓట్లు ఎక్కువగా వచ్చినా.. ఏడింట నాలుగు సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అందుకే, ఈసారి కరీంనగర్ లోక్‌సభ స్థానంలో పోటీ రసవత్తరంగా మారింది. సిటింగ్ ఎంపీ బండి సంజయ్ కుమార్ బీజేపీ నుంచి మరోసారి పోటీలో ఉండగా.. గతంలో ప్రజారాజ్యం తరఫున పోటీ చేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్ రావు కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్నారు. వరుసగా గత మూడు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఒకసారి విజయం సాధించిన బోయినపల్లి వినోద్‌కుమార్ మరోసారి అదృష్టం పరీక్షించుకుంటున్నారు.

గెలిస్తే.. కేంద్ర మంత్రి పదవి!

రాష్ట్రంలో డబుల్ డిజిట్ స్థానాలను సాధించి దక్షిణాదిలో పట్టు బిగించాలని చూస్తున్న బీజేపీ కరీంనగర్ స్థానంలో విజయంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రెండోసారి గెలిస్తే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిలో హోదాలో ఉన్న తనకు కేంద్ర మంత్రి పదవి దక్కుతుందన్న భావనతో ఇక్కడ గెలుపును సంజయ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మోదీ గ్యారెంటీ పేరుతో బీజేపీ విడుదల చేసిన మ్యానిఫెస్టోతో.. అన్ని సెగ్మెంట్లలో రెండేసిసార్లు ప్రచారం పూర్తి చేశారు. పోలింగ్ బూత్ స్థాయిలో, శక్తి కేంద్రాల స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహించి ఓటర్ లిస్టులోని ఒక్కో పేజీకి ఒక్కో కమిటీ వేసి పన్నా కమిటీల పేరిట వారికి బాధ్యతలు అప్పగించి ఓటరును నిత్యం కలిసే ఏర్పాట్లు చేసుకున్నారు. తన హయాంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలకు మంజూరైన నిధులెన్ని!? పనులేవి!? అన్న వివరాల బుక్‌లెట్లను ఇంటింటికీ అందించడమే కాకుండా గ్రామాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రధాని మోదీ సభలో ప్రసంగించి వెళ్లగా.. త్వరలో హోం మంత్రి షా వస్తారని చెబుతున్నారు. నిజానికి, అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు, సీట్లు రాకపోయినా లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ జాతీయ స్థాయి అంశాలే ప్రభావం చూపుతుండడం.. ఇదే కారణంతో గతంలో మూడు సార్లు పార్టీ విజయం సాధించడం.. ఇప్పుడు మోదీ గ్యారెంటీతో ముందుకు పోతుండడంతో సంజయ్ గెలుపుపై ఆశలు పెంచుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని సెగ్మెంట్లలో కలిపి లక్ష ఓట్లు మాత్రమే సాధించినా.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 90 వేల ఓట్ల మెజారిటీతో నెగ్గడం, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి కూడా కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఐదేళ్లలో పార్టీ ప్రాబల్యం మరింత పెరిగిందని, అసెంబ్లీ ఎన్నికల్లో 2.5 లక్షల ఓట్లు రావడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు.

పురుషులు	8,74,884	
మహిళలు	9,14,367	
ఇతరులు	102	
మొత్తం ఓటర్లు	17,89,353	

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?


కాంగ్రెస్	(వేములవాడ, చొప్పదండి, హుస్నాబాద్, మానకొండూరు)
బీఆర్ఎస్	కరీంనగర్, హుజూరాబాద్, సిరిసిల్ల

సొంత గ్యారెంటీలతో 'వెలిచాల విజన్'

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతోపాటు 'కోహినూర్ కరీంనగర్' పేరిట రాజేందర్‌రావు 'వెలిచాల విజన్' పేరుతో 23 సొంత గ్యారెంటీలను విడుదల చేశారు. సమస్యల పరిష్కారానికి 'కరీంనగర్ సహాయక్ యాప్', విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ, మెగా జాబ్ క్యాంప్స్, ఉచిత ఆరోగ్య పరీక్షలు, సామూహిక వివాహాలు, ఉచిత డ్రైవింగ్ స్కూల్స్ వంటి 23 గ్యారెంటీలు ప్రకటించారు. సెగ్మెంట్‌కు ఉచితంగా జేసీబీ, ట్రాక్టర్, పంట కోత యంత్రాలు, రెండు డ్రోన్లు, ట్యాంకర్, రోడ్డు రోలర్ ఇస్తానన్నారు. తన అభ్యర్థిత్వం చివరి నిమిషంలో ఖరారైనా.. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునే రీతిలో మంత్రి పొన్నం వ్యూహం మేరకు అవిశ్రాంతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్‌లో ప్రముఖ ప్రజా ప్రతినిధిగా పేరుగాంచిన జగపతిరావు కుమారుడే రాజేందర్‌రావు. జగపతిరావు 1972లో జగిత్యాలలో, 1989లో కరీంనగర్ నుంచి గెలిచి అనేక సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచారు. తండ్రి పేరు, పార్టీ, సొంత గ్యారెంటీలు గెలిపిస్తాయని రాజేందర్‌రావు ఆశలు పెట్టుకున్నారు.

సెంటిమెంట్ జిల్లాలో పాగా వేయాలని..

ఉద్యమ కాలం నుంచీ కేసీఆర్‌కు కరీంనగర్ సెంటిమెంట్ జిల్లాగా, కంచుకోటగా నిలిచింది. ఏ కార్యక్రమానికైనా.. ప్రధాన పథకాలకైనా ఇక్కడినుంచే శ్రీకారం చుట్టారు. అందుకే.. ఈ నియోజకవర్గంలో గెలవడం మళ్లీ అధికారంలోకి రావడానికి సెంటిమెంట్ అవుతుందని కేసీఆర్, పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే కేసీఆర్, కేటీఆర్ సభలు నిర్వహించారు. కేసీఆర్ బస్సు యాత్ర చేయనున్నారు. తన హయాంలో జాతీయ రహదారులు, స్మార్ట్ సిటీ, రైల్వే లైను మంజూరు చేయించానని వినోద్ వివరిస్తున్నారు. నాలుగుచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండడం కలిసి వస్తుందని భావిస్తున్నారు.



2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

బీఆర్ఎస్	5,17,601
కాంగ్రెస్	5,12,352
బీజేపీ	2,50,400

2019 పార్లమెంట్ స్థానం ఫలితాలు

(బీజేపీ)	బీఆర్ఎస్	కాంగ్రెస్
4,78,916	4,00,552	1,76,756

2014 పార్లమెంట్ స్థానం ఫలితాలు

బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
5,05,783	3,00,706	2,14,828





హైదరాబాద్ తొలి ఎంపీ అహ్మద్ మొహియుద్దీన్

భాగ్య నగరం నుంచి మొదటి కేంద్ర మంత్రి కూడా

హైదరాబాద్ లోక్‌సభ అనగానే ఇప్పుడు మీకు ఎవరు గుర్తుకు వస్తారు!? ఒవైసీ కుటుంబం గుర్తుకు వస్తుంది అవునా!? కానీ, ఒవైసీల హవా నాలుగు దశాబ్దాల నుంచే! అంతకుముందు ఈ నియోజకవర్గం కూడా కాంగ్రెస్ కంచుకోట! ఆరుసార్లు ఇక్కడ ఆ పార్టీ గెలిచింది! అంతేనా.. స్వాతంత్ర్యం అనంతరం జరిగిన తొలి ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ మొహియుద్దీన్ విజయం సాధించారు. భాగ్య నగరం నుంచి కేంద్రంలోని నెహ్రూ క్యాబినెట్‌లో రెండుసార్లు మంత్రి పదవి చేపట్టిన తొలి ఎంపీ కూడా ఆయనే! అప్పట్లో పౌర విమానయానం, సమాచార, ప్రసార శాఖలకు సహాయ మంత్రిగా పని చేశారు.

మెల్కొటే హ్యాట్రిక్



హైదరాబాద్‌లో గోపాలయ్య సుబ్బుకృష్ణ రికార్డు

హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి ఇప్పుడు ఒవైసీ కుటుంబం వరుసగా గెలుస్తూ వస్తోంది! కానీ, తొలిసారి ఇక్కడ హ్యాట్రిక్ కొట్టింది అసలు తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తి కాదని తెలుసా!? ఔను.. హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి వరుసగా మూడుసార్లు గోపాలయ్య సుబ్బు కృష్ణ మెల్కొటే విజయం సాధించారు. ఆయన స్వస్థలం ఒడిసాలోని బరంపురం. తొలుత ఆయన 1952లో ముషీరాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పుడే బూర్గుల రామకృష్ణారావు క్యాబినెట్‌లో హైదరాబాద్ రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1957 ఎన్నికల్లో మాత్రం రాయచూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. జాతీయ నాయకుల ఆదేశాల మేరకు 1962 ఎన్నికల్లో మాత్రం హైదరాబాద్ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరఫున ఇక్కడి నుంచే ఎన్నికయ్యారు. 1969 తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిన సమయంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారు. తెలంగాణ ప్రజా సమితి పార్టీ అభ్యర్థిగా ఇక్కడి నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. పార్టీలు వేరైనా తద్వారా ఆయన హ్యాట్రిక్ కొట్టారు.

68 విడతల్లో లోక్‌సభ ఎన్నికలు

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు ఏడు విడతల్లో జరుగుతున్నాయి! గత సార్వత్రిక ఎన్నికలూ ఇలాగే జరిగాయి! కానీ, భారత పార్లమెంటుకు జరిగిన తొలి ఎన్నికల్లో 68 విడతల్లో జరిగాయని తెలుసా!? ఔను.. 1951 అక్టోబరు 25 నుంచి 1952 ఫిబ్రవరి 21 వరకూ నాలుగు నెలలపాటు ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఏకంగా 68 విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు దాదాపు 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. కానీ, అప్పట్లో ఓటర్లు కేవలం 17.6 లక్షలు మాత్రమే! 14 జాతీయ పార్టీలు సహా 53 రాజకీయ పార్టీలు అప్పట్లో బరిలో నిలిచాయి. వాటి తరఫున 1,874 మంది అభ్యర్థులు ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నినాదం ఏమిటో తెలుసా!? 'నయా హిందుస్థాన్ జిందాబాద్'! ఇక, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు ఎన్నిక జరుగుతోంది కదా! అప్పట్లో హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి డిసెంబరు 16 నుంచి 25వ తేదీ వరకూ దాదాపు పది రోజులపాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగిందట!!

- హైదరాబాద్ సిటీ - ఆంధ్రజ్యోతి





'అడ్వాన్స్' నమస్కారం!

మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గురువారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు అడగడానికి కుకునూరుపల్లిలోని ఓ కుట్టు విఎషన్ దుకాణంలోకి వెళ్లారు. అక్కడ పెద్దవాళ్లు ఎవరూ లేకపోవడంతో చిన్న పిల్లకే నమస్కారం పెట్టి వచ్చిన దృశ్యమిది!!

- కుకునూరుపల్లి

ఉత్తర కమలం!

విప్లవాల గడ్డలో కాషాయ వికాసం

ఉత్తర తెలంగాణలో పుంజుకుంటున్న బీజేపీ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ..! ఒకప్పుడు మావోయిస్టుల కోట! ఉద్యమాల పురిటి గడ్డ! ఈ ప్రాంతం పేరు చెప్పగానే జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి గుర్తుకొస్తాయి! కానీ, ఇప్పుడు అక్కడ కొత్త సిద్ధాంతం పురుడు పోసుకుంటోంది. కమ్యూనిజం స్థానంలో కాషాయ దళం చిగురు తొడుగుతోంది! క్రమక్రమంగా బీజేపీ పట్టు సాధిస్తోంది! ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత 2014 ఎన్నికల్లో టీడీపీతో పొత్తులో భాగంగా బీజేపీ బరిలోకి దిగింది. ఆ ఎన్నికల్లో ఐదు స్థానాలను గెలుచుకుంది. ఇవన్నీ కూడా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే! ఇక, 2018 ఎన్నికలకు వచ్చేసరికి రాష్ట్రవ్యాప్తంగా 119 స్థానాల్లోనూ ఒంటరిగా బరిలోకి దిగింది. 105 స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కలేదు. హైదరాబాద్ గోషామహల్‌లో మాత్రమే విజయం సాధించింది. అప్పటి వరకూ హైదరాబాద్, చుట్టుపక్కల మాత్రమే ప్రాబల్యం కలిగిన బీజేపీ పరిస్థితి 2023 ఎన్నికలనాటికి మారిపోయింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధించింది. మరో 18 అసెంబ్లీ స్థానాల్లో రెండో స్థానంలో, మరికొన్ని స్థానాల్లో మూడో స్థానంలో నిలిచింది. ఈసారి ఏకంగా 40 అసెంబ్లీ స్థానాల్లో డిపాజిట్లు దక్కించుకుంది. ఈసారి గెలిచిన సీట్లలోనూ అత్యధికం ఉత్తర తెలంగాణలోనే! సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, ఆర్మూర్, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో కాషాయ జెండా ఎగరేసింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఒక్క గోషా మహల్‌లో మాత్రమే గెలిచింది. ఈసారి బీజేపీ తన ఓటు బ్యాంకును కూడా గణనీయంగా పెంచుకుంది. 2018లో కేవలం 6.98 శాతం ఓట్లు సాధించిన బీజేపీ.. 2023 ఎన్నికల్లో 13.90 శాతం ఓటుబ్యాంకును సొంతం చేసుకుంది. బీజేపీ అభ్యర్థులు గెలుపొందిన నిర్మల్‌లో 44 శాతం ఓటింగ్, ఆర్మూర్‌లో 31 శాతం, సిర్పూర్‌లో 30 శాతం వచ్చాయి. హుజూరాబాద్, గజ్వేల్ సహా మరో 12 నియోజకవర్గాల్లో బీజేపీ 20 శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది.



గిరిజన ప్రాంతాల్లో పాగా

ఉత్తర తెలంగాణలో మరీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో బీజేపీ పాగా వేయడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఒకప్పుడు మావోయిస్టుల ప్రాబలం కలిగిన గిరిజన ప్రాంతాల్లో బీజేపీ, దాని అనుబంధ సంస్థలు చాప కింద నీరులా విస్తరించాయి. ఊరూరా ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేశాయి. ప్రధానంగా బీసీ సామాజిక వర్గాలను తనవైపు తిప్పుకోవడంలో సఫలమయ్యాయి. వీటితోపాటు ప్రతి గ్రామంలో హనుమాన్ ఆలయాలు, వ్యాయామ శాలలను విరివిగా ఏర్పాటు చేశారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ పూర్వీకుల స్వస్థలం కూడా నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి కావడంతో గత దశాబ్దకాలంలో చాలామంది యువత ఆర్ఎస్ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. 2014కు ముందు తెలంగాణలో ఆర్ఎస్ఎస్ శాఖలు 1600 దాకా ఉండగా.. ప్రస్తుతం 3 వేలకు చేరాయి. అంతేకాకుండా ఆర్ఎస్ఎస్ అనుబంధ భావజాల వ్యాప్తిలో సరస్వతి విద్యా మందిర్‌లు, శిశుమందిర్‌లు కూడా కీలక పాత్రను పోషిస్తున్నాయి. అడవుల్లో వనవాసీ కల్యాణ పరిషత్ (విశ్వ హిందూ పరిషత్ అనుబం ధం) సంఘాలు క్రియాశీలంగా హిందూత్వ రాజకీయాల వ్యాప్తిలో కీలక పాత్రను పోషిస్తున్నాయి. మరోవైపు, ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో బీజేపీ బలపడుతుండడం గమనార్హం. దీనికితోడు, ప్రధానంగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలతోపాటు కేంద్రంలో అధికారంలో ఉండటం ఆ పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషిస్తోంది.

అన్నా.. ఓటేసేందుకు రావాలి!

- హైదరాబాద్ నగరంలోని గ్రామీణ ఓటర్లకు సొంతూరు నాయకుల పిలుపు
- కుటుంబంతో కలిసి రావాలంటూ వినతి
- రవాణా చార్జీలు, ఖర్చులూ చెల్లిస్తామని హామీ
- ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ముందస్తుగా కొంత డబ్బు చెల్లింపు

కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన సునీల్ ఆరేళ్లుగా గచ్చిబౌలిలో నివాసముంటున్నారు. జీవనోపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో ఇక్కడే ఉంటున్న ఆయనకు సొంతూరిలో నాలుగు ఓట్లు ఉన్నాయి. దాంతో, గురువారం ఉదయం ఓ పార్టీకి చెందిన నాయకుడు సునీల్‌కు ఫోన్ చేశాడు. 'అన్నా.. ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ఈసారి మన కాడ పోటీ గట్టిగానే ఉంది. అన్నను గెలిపించాలంటే మీలాంటోళ్లు అందరూ ఓటేసేందుకు తప్పకుండా రావాలి. వదిన, పిల్లలను వెంట పెట్టుకుని పోలింగ్‌కు రెండు రోజుల ముందే ఇంటికి వచ్చి ఓటేయాలి. ఓటుతోపాటు రానుపోనూ అన్ని ఖర్చులు ఇస్తాను" అని వ్యక్తి చెప్పాడు.

ముషీరాబాద్‌లో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాములు, ఆయన భార్యకు వరంగల్ నగరంలో రెండు ఓట్లు ఉన్నాయి. రెండు రోజుల క్రితం ఓ పార్టీకి చెందిన స్థానిక నాయకుడు ఫోన్ చేశారు. 'మా పార్టీ నుంచి పోటీ చేస్తున్న అన్నకు ఎంపీ ఎన్నికల్లో ఈసారి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తెలిసిన ఓట్లు పోకుండా మేమంతా బాగా కష్టపడుతున్నాం. ఓట్ల రోజు మీరిద్దరూ ఊరికి వచ్చి మాకు మద్దతు తెలపాలి. ఇక్కడికి వచ్చిన తర్వాత నేను అన్నీ చూసుకుంటాను' అని హామీ ఇచ్చారు. ఫోన్ పే ద్వారా ముందస్తుగా రూ.వెయ్యి పంపించి నమ్మకం కల్పించాడు.



హైదరాబాద్ సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పార్లమెంట్ ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. నామినేషన్ల పక్రియ ముగిసిన నేపథ్యంలో పోటీలో నిలబడిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో, గ్రామ, మండల స్థాయి నాయకులు హైదరాబాద్‌లో ఉండే గ్రామీణ ఓటర్లపై దృష్టి సారించారు. పోలింగ్‌కు మరో రెండు వారాల సమయం ఉన్నా.. తప్పకుండా రావాలంటూ ఇప్పటి నుంచే ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే ఊరికి వచ్చి ఓటు వేశారో.. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలకు కూడా అలాగే రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నికల రోజు కుటుంబంతో కలిసి రావాలని కోరుతున్నారు.

వలస ఓటర్లకు ప్రత్యేక బృందాలు..

గ్రామాలు, నగరాల్లో బూత్‌ల వారీగా ఉన్న ఓటర్లను నిత్యం కలుసుకుని ఓట్లు అడిగేందుకు ఇప్పటికే ఐదారుగురితో కలిసి పార్టీల నేతలు టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వారితో ప్రచారం చేయిస్తున్నారు. నమ్మకం కలిగిన ఓటర్లకు మద్యం బాటిళ్లను కూడా పంపిణీ చేస్తున్నారు. ఇదే సమయంలో దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఆకర్షించేందుకు.. ఎన్నికల రోజు వారిని సొంతూళ్లకు రప్పించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఓటర్ల జాబితా నుంచి వలస ఓటర్ల పేర్లు, వారి ఫోన్ నంబర్లను సేకరించి ఫోన్ చేయిస్తున్నారు. కొంతమందికి సెల్‌ఫోన్ మెసేజ్‌లు కూడా పంపిస్తున్నారు.

ఓటుకు రూ.1500-2000

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతోపాటు శివారు ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు నగదు అందజేసేందుకు సిద్ధమవుతున్నారు. పోలింగ్ రోజున స్వగ్రామానికి వచ్చి ఓటు వేస్తే రూ.1500-2000 వరకు ఇస్తామని హామీ ఇస్తున్నారు. కచ్చితంగా పడే ఓట్లకు సగం డబ్బులు ముందుగానే ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మిగతా మొత్తాన్ని ఇంటికి వచ్చిన తర్వాత, లేకుంటే పోలింగ్ కేంద్రం వద్ద చెల్లిస్తామని హామీ ఇస్తున్నారు. కాగా, నగరంలోని పలు బస్తీలు, కాలనీల్లో ఒకేచోట 30 నుంచి 50కి పైగా ఓట్లు ఉంటే వారిని ప్రత్యేక వాహనాల్లో కూడా తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొంత మంది డబ్బుల కంటే ఓటు హక్కును వినియోగించుకోవడం ముఖ్యమని భావిస్తూ.. పోలింగ్‌కు రెండు రోజుల ముందే కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వేలిపై సిరా చుక్క చూపిస్తేనే 'పెయిడ్ హాలిడే'

» 14, 15 తేదీల్లో మాల్స్, హోటళ్లలో రిబేటు ఇవ్వాలి

» వీటితో పోలింగ్ శాతం పెరగొచ్చంటూ ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలింగ్ శాతం పెరగడానికి కొన్ని సూచనలు పాటించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ), రాష్ట్ర ఎన్నిల ప్రధానాధికారి(సీఈవో)ని కోరింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి గురువారం సీఈవోకు ఓ లేఖ రాశారు. గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం వరకు పోలింగ్ నమోదవుతుండగా, హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 50 శాతానికి అటూ ఇటూగానే నమోదవుతుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనా, 17సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగినా, ఇంకా ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరాల్సి రావడం చాలా బాధాకరమని తెలిపారు. 13న జీతంతో కూడిన సెలవు(పెయిడ్ హాలిడే)గా ప్రకటించారని, కానీ ఓటు వేస్తేనే సెలవు వర్తిస్తుందని, లేకపోతే లాస్ ఆఫ్ పేగానే పరిగణిస్తామంటూ ప్రకటించాలని ఆయన సూచించారు. ఇందుకు చూపుడు వేలుపై సిరా చుక్క ఉందో లేదో యాజమాన్యాలు పరిశీలించాలన్నారు. వేలిపై సిరా చుక్క చూపించిన వారికి 14, 15 తేదీల్లో అన్ని మాల్స్, హోటళ్లు, సినిమా హాళ్లు, వైన్ షాపులు, పెట్రోలు బంకుల్లో పెట్రోలు, డీజిల్‌పై రిబేటు(డిస్కౌంట్) ఇస్తే బాగుంటుందని తెలిపారు. ఈ సూచనలతో సీఈవో ఒక ప్రకటన చేస్తే పోలింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయని పద్మనాభరెడ్డి పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు బీజేపీ కుట్ర

» 5న బీసీల రాజకీయ మేధోమదన సదస్సు: జాజుల

కవాడిగూడ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, అందులో భాగంగానే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. దోమలగూడలోని బీసీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చే ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు బీసీల రిజర్వేషన్లపై తమ వైఖరిని స్పష్టం చేసిన తరువాతే ప్రచారం చేయాలని డిమాండ్ చేశారు. కులగణన చేయాలని బీసీలు కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కులగణన చేస్తే బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధమైన హక్కులు వస్తాయని అన్నారు. జాతీయ స్థాయిలో ఓబీసీలపై క్రిమిలేయర్ విధించి ఓబీసీలు ఐఏఎస్, ఐపీఎస్‌లు కాకుండా కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. బీసీల ఓట్లు కావాలంటే తెలంగాణ పర్యటనలో ప్రధాని మోదీ.. బీసీ కులగణన చేసి బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీలంతా బీజేపీకి బుద్ధి చెబుతారని జాజుల హెచ్చరించారు. కాగా, ఈ నెల 5న హైదరాబాద్‌లో బీసీల రాజకీయ మేధోమదన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

ఓటుకు నోటు కేసు బదిలీపై నేడు సుప్రీంలో విచారణ

» మధ్యప్రదేశ్‌కు మార్చాలంటూ బీఆర్‌ఎస్ పిటిషన్

న్యూఢిల్లీ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు విచారణను తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం సుప్రీంకోర్టు ముందుకు రానుంది. న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించనుంది. ఈ కేసు విచారణ తెలంగాణలో కాకుండా మధ్యప్రదేశ్ లో జరిగేలా బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్‌ఎస్ నేతలు గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహ్మద్ అలీ, కల్వకుంట్ల సంజయ్‌లు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా ప్రతివాదులుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీనిపై శుక్రవారం మళ్లీ విచారణ జరపనుంది.

పోలీసుల తనిఖీల్లో రూ.22 లక్షల నగదు సీజ్

భువనగిరి టౌన్, ఖిల్లా (నిజామాబాద్), మే 2: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో గురువారం రూ. 22 లక్షల నగదు పట్టుబడింది. భువనగిరి పట్టణంలో రూ.13.48లక్షలు, వలిగొండలో రూ.1.66 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే యాదాద్రి జిల్లా వ్యాప్తంగా 28 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 19 మంది రౌడీ షీటర్ల నుంచి బైండోవర్ తీసుకున్నారు. కాగా, నిజామాబాద్‌లో రూ.7.44 లక్షల నగదును పట్టుకున్నారు. నగరంలోని గంజ్ ప్రాంతంలో వాహనాల తనిఖీల్లో నేతి శ్రావణ్ అనే వ్యక్తి వద్ద రూ.4లక్షలు లభించాయి. అలాగే శివాజీనగర్‌లో చెన్న శివ కుమార్ అనే వ్యక్తి వాహనాన్ని తనిఖీ చేయగా అతని వద్ద రూ.3లక్షల 44వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. నగదుకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

వాసవి ఇన్‌ఫ్రా నిర్మాణాల కొనసాగింపునకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వాసవి ఇన్‌ఫ్రా నిర్మాణాలు కొనసాగించడానికి హైకోర్టు నిరాకరించింది. నిర్మాణాల కొనసాగింపు.. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టారా లేదా అన్న అంశాన్ని పూర్తిస్థాయి వాదనలు విన్న తర్వాత తేలుస్తామని పేర్కొంది. ఈ మేరకు విచారణను జూన్ 4కు వాయిదా వేస్తూ అప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టంచేసింది. కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా వాసవి ఇన్‌ఫ్రా లిమిటెడ్ భారీ అపార్ట్‌మెంట్లు నిర్మించిందని పేర్కొంటూ హైకోర్టులో ఇటీవల ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఇటీవల దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. అపార్ట్‌మెంట్లకు సంబంధించిన 8, 9వ అంతస్థుల నిర్మాణాల ఫొటోలు, మండల రెవెన్యూ కార్యాలయం, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్వేయర్‌లతో కూడిన బృందం చేసిన సర్వే రిపోర్టు అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా ఈ పిటిషన్‌పై తాజాగా గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాసవి ఇన్‌ఫ్రా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పాత నివేదికలతో పిటిషనర్ దురుద్దేశపూర్వకంగా పిటిషన్ వేశారని పేర్కొన్నారు. వినియోగదారులకు నష్టం కలగకుండా నిర్మాణాలు కొనసాగించేందుకు అనుమతివ్వాలని కోరారు. వాదనలు పూర్తయిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఈసీదే తుది నిర్ణయం: కొండా పిటిషన్‌పై హైకోర్టు

బ్యాలెట్ పేపర్‌లో సీరియల్ నంబర్లు మార్చేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. బ్యాలెట్ పేపర్‌లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేరు కిందే అదే పేరు కలిగిన మరో అభ్యర్థి పేరు ఉంది. తనకు, తనలాంటి పేరే కలిగిన అభ్యర్థికి మధ్య కనీసం పది నంబర్లు తేడా ఉండేలా ఈసీని ఆదేశించాలని ఆయన కోరారు. ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ పిటిషనర్ దరఖాస్తుపై ఈ దశలో నిర్ణయం తీసుకోలేమని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం బ్యాలెట్ పేపర్‌లో మార్పుల విషయంలో ఈసీదే తుది నిర్ణయమని పేర్కొంటూ విచారణను ముగించింది.

ఫోన్ ట్యాపింగ్.. కేసీఆర్ కోసమే!

(మొదటి పేజీ తరువాయి)

రాధాకిషన్‌ను కస్టడీలోకి తీసుకుని, విచారించిన విషయం తెలిసిందే.! ఆ క్రమంలో గత నెల 9వ తేదీన సేకరించిన వాంగ్మూలంలో.. రాధాకిషన్ పలుమార్లు అప్పటి సీఎం కేసీఆర్ పేరును ప్రస్తావించారు. "పెద్దాయన(కేసీఆర్)కు చిన్న విమర్శ ఎదురైనా చిరాకు పడేవారు. అందుకే.. ఎక్కడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు జరగకుండా అణచివేసేవాళ్లం" అని వాంగ్మూలంలో రాధాకిషన్ పేర్కొన్నారు.

ప్రభాకర్‌రావు ద్వారా టాస్క్‌ఫోర్స్‌కు..

"2017లో నాకు ఎస్పీగా పదోన్నతి లభించింది. తర్వాత నన్ను హైదరాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు. ఎందుకంటే అప్పటి సీఎం కేసీఆర్.. పార్టీ సంబంధిత కార్యకలాపాలను చక్కబెట్టడానికి, హైదరాబాద్‌ను క్రమంగా టీఆర్‌ఎస్ అదుపులోకి తెచ్చుకోవడానికి ఒక నమ్మకస్తుడైన అధికారిని నియమించాలనుకున్నారు. సిటీ పోలీస్‌లో డీసీపీ టాస్క్‌ఫోర్స్ చాలా కీలకపాత్ర పోషిస్తారు కాబట్టి.. తన సామాజికవర్గానికి చెందిన, నమ్మదగ్గ వ్యక్తిని నియమించుకోవాలని ఆయన భావించారు. తద్వారా వారికి సంబంధించిన రహస్యమైన పనులన్నీ సరిగ్గా చేయించుకోవచ్చని అనుకున్నారు. ఈ క్రమంలోనే టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నా నియామకంలో నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు ప్రధానపాత్ర పోషించారు" అని రాధాకిషన్ రావు తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఆ పదవిలో ఉండగా ఎవరికీ అనుమానం రాకుండా ఒక పద్ధతి ప్రకారం సీఎం కేసీఆర్, ఆయన కుటుంబసభ్యుల కోసం ఎలా పనిచేసిందీ సవివరంగా తెలిపారు. "వారికి కావాల్సిందేంటో నేను అర్థం చేసుకుని సిటీ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశాను. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు, పార్టీలో కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులైన కొందరి రహస్య కార్యకలాపాలన్నింటినీ చక్కబెట్టేవాడిని. అందులో భాగంగా సివిల్ తగాదాల సెటిల్మెంట్లు, టీఆర్‌ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు, ఆయన కుటుంబసభ్యులకు ఇబ్బంది కలిగించే వ్యక్తులను బెదిరించడం, లొంగదీసుకోవడం, మా దారికి తీసుకురావడం వంటి పనులు చేసేవాడిని." అని రాధాకిషన్ వాంగ్మూలంలో స్పష్టం చేశారు.



2018 ఎన్నికల నుంచే..

తాను టాస్క్‌ఫోర్స్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించాక.. ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌రావు(2023లో డీఎస్పీగా యాక్సిలరీ పదోన్నతి పొందారు) నేతృత్వంలో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు తనకు తెలిపినట్లు రాధాకిషన్ వివరించారు. "ప్రతిపక్ష నేతల ఫోన్లపైన, నాటి సీఎం కేసీఆర్‌కు, టీఆర్‌ఎస్‌కు రాజకీయంగా ఇబ్బందులు కలిగించే రాజకీయ ప్రత్యర్థులు, వారి సన్నిహితులు, వారి మద్దతుదారులు, వారికి ఆర్థిక సహకారం అందించేవారి ఫోన్లపైన నిఘా పెట్టి ప్రణీత్ కుమార్ సేకరించిన సమాచారం నాకూ వచ్చేది. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు.. కొన్నికొన్నిసార్లు నేనే అలాంటి సమాచారాన్ని కమిషనర్ ద్వారా పంపాల్సిందిగా వారిని కోరేవాడిని. కొన్నిసార్లు మరీ ముఖ్యమైన పనులకు.. మా ప్రణాళిక ప్రకారం సీఎం నుంచిగానీ, ఎస్ఐబీ చీఫ్ నుంచిగానీ సమాచారం కమిషనర్‌కు వచ్చేది. ఆయన దాన్ని సాధారణంగా నాకు అప్పగించేవారు. నేను కమిషనర్ ఆదేశాల మేరకే పనిచేస్తున్నట్లుగా కనిపించేందుకు.. ఇతరులకు ఎలాంటి అనవసరమైన అనుమానాలు రాకుండా ఉండేందుకే అలా చేసేవాళ్లం" అని రాధాకిషన్ వివరించారు. ప్రతిపక్షాల నగదును స్వాధీనం చేసుకోవడం, అధికార పార్టీ నగదు సరఫరాకు సహకరించడం వంటి రాజకీయ పనులకు సంబంధించిన రహస్య సమాచారం కోసం ప్రణీత్ కుమార్‌తో సమన్వయం చేసుకోవాల్సిందిగా ప్రభాకర్ రావు తనకు మొదట్నుంచీ చెప్పేవారని ఆయన వివరించారు. అలాగే.. కేసీఆర్‌కు, పార్టీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చే ప్రత్యేకమైన పనులను కూడా తనకే అప్పగించేవారని వెల్లడించారు. ఆ ఆదేశాల మేరకు తాను ప్రణీత్ కుమార్‌తో టచ్‌లో ఉండి, ఎప్పటికప్పుడు తనకు అప్పగించిన పని పూర్తిచేసేవాడినని తెలిపారు. ఈ వ్యవస్థీకృత వ్యవహారం 2018లో అసెంబ్లీ ఎన్నికలకు ముందే మొదలైందని.. 2019 లోక్‌సభ ఎన్నికలతోపాటు, దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా కొనసాగిందని.. అన్నేళ్ల అనుభవంతో 2023 నాటికి తమ పనితీరు అత్యంత సమర్థవంతంగా తయారైందని వెల్లడించారు.

నాటి సీఎం పూర్తి సహకారంతో..

అప్పటి సీఎం కేసీఆర్ పూర్తి మద్దతుతో 2020లో ప్రభాకర్ రావు మళ్లీ ఎస్ఐబీ చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్‌గా.. పదవీ విరమణ తర్వాత ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులైనట్లు రాధాకిషన్ పేర్కొన్నారు. "అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు ప్రగతిభవన్‌లో సీఎంను కలిసే అవకాశం, ఎలాంటి సమాచారాన్నైనా సీఎంకు అందించే అవకాశం ఉండేది" అని పేర్కొన్నారు.

ఎన్నికల తర్వాత పార్ట్-2..!

ట్యాపింగ్ కేసులో లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్ట్-2 ఉంటుందని స్పష్టమవుతోంది. గత నెల భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌ల కస్టడీ, విచారణ పూర్తయ్యేసరికి ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అయితే.. వీరి వాంగ్మూలంలో పలువురు బీఆర్‌ఎస్ నేతల పేర్లు వెలుగులోకి వచ్చాయి. రాధాకిషన్ ఏకంగా తన వాంగ్మూలంలో కేసీఆర్ పేరును పదేపదే ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ కేసు రాజకీయ కోణంలో ముందుకుసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

బెయిల్ పిటిషన్ కొట్టివేత

చంచల్‌గూడ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావు బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని ఈ సమయంలో బెయిల్ మంజూరు చేయవద్దని దర్యాప్తు అధికారుల తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. దర్యాప్తు అధికారుల తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన కోర్టు.. రాధాకిషన్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

ప్రభాకర్‌రావుతో నాకు సంబంధం లేదు

» ఇప్పటి వరకూ ఆయనను ఎన్నడూ కలవలేదు

» బండి సంజయ్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

» కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



కరీంనగర్ అర్బన్, మే 2: ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతో తనకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు చెప్పారు. గురువారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కరీంనగర్ కాంగ్రెస్ టికెట్‌ను తనకు ఇప్పించేందుకు ప్రభాకర్‌రావు డబ్బులు సమకూర్చారని బండి సంజయ్ ఆరోపించటం హాస్యాస్పదమన్నారు. తన మిత్రుడు అశోక్‌రావుకు ప్రభాకర్‌రావు వియ్యంకుడని, తాను అశోక్‌రావు ఇంటికి వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు. ప్రభాకర్‌రావుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తన జీవితంలో ఆయనను ఏనాడూ కలవలేదన్నారు. అశోక్‌రావు తనకు 40 ఏళ్ల నుంచి మిత్రుడని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పారదర్శకంగా విచారణ జరుగుతుందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు.

నామినేషన్ తిరస్కరణలో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరిలో తన నామినేషన్‌ను తిరస్కరిస్తూ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) తీసుకున్న నిర్ణయాన్ని కొట్టేయాలని కేవీ గీత కుమారి అనే స్వతంత్ర అభ్యర్థి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రత్యేక బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వలేదని, ఫొటోగ్రాఫ్స్ సమర్పించలేదని, ఫారం-ఏ అసంపూర్ణంగా వదిలేశారనే మూడు కారణాలతో ఆర్వో.. పిటిషనర్ నామినేషన్‌ను తిరస్కరించారని ఈసీ తరఫు న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. ఈ విషయంలో ఆర్వో ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది.



ట్యాపింగ్ కేసును మాకు ఆపాదిస్తున్నారు

» బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు చేయకుండా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను అడ్డుకోండి

» మా ఫిర్యాదుపై స్పందించని ఈసీ

» హైకోర్టులో బీఆర్‌ఎస్ పిటిషన్ దాఖలు

» నేడు నిర్ణయం తీసుకుంటామన్న ఈసీ

హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆధారాలు లేకుండా ఫోన్ ట్యాపింగ్ కేసును తమ పార్టీకి, పార్టీ నాయకులకు అంటగట్టాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టే, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవాలని కోరుతూ తాము అందజేసిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ణయం తీసుకోవడం లేదని తెలిపారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఏయే పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ నాయకులపై ఎలాంటి వ్యాఖ్యలు చేశారో పిటిషనర్ వివరించారు. 'మార్చి 29న సీఎం రేవంత్ ఫోన్ ట్యాపింగ్ కేసుతో కేటీఆర్‌కు సంబంధం ఉందని, దర్యాప్తును ప్రభావితం చేసేలా, ఆయనను కేసులో ఇరికించేలా వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ ఏప్రిల్ 1న నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఫోన్ ట్యాపింగ్ కేసును కేటీఆర్‌కు అంటగడుతూ పరువుకు భంగం కలిగించేలా మాట్లాడారు. ఏప్రిల్ 6న తుక్కుగూడ సభలో కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ.. కేటీఆర్ సహా బీఆర్‌ఎస్‌కు కేసులు అంటగడుతూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ డ్రగ్స్ వినియోగిస్తాడని అర్థం వచ్చేలా.. వ్యక్తిగతంగా పరువు నష్టం కలిగేలా ఉన్న పాటలను బీజేపీ ట్విట్టర్ సహా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిందని పిటిషనర్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు మాట్లాడకుండా అడ్డుకోవడంతోపాటు రెచ్చగొట్టే నాయకులపై చర్యలు తీసుకునేలా ఈసీని ఆదేశించాలని కోరారు. దర్యాప్తులో ఉన్న కేసుపై వ్యాఖ్యలు చేయడం ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఈసీ మార్గదర్శకాలు, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 123 (4)కు విరుద్ధమని పేర్కొన్నారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్ రెడ్డి వాదనలు వినిపించారు. బీఆర్‌ఎస్ ఏప్రిల్ 28 ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం నిర్ణయం తీసుకుంటామని ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ తెలపడంతో విచారణను ముగిస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది.

కేసీఆర్‌కు ఎందుకు నోటీసులివ్వరు?

ట్యాపింగ్ కేసులో స్పష్టంగా ఆయన పాత్ర.. ఇది రాధాకిషన్ రావు స్టేట్‌మెంట్‌లో ఉంది

» కేసీఆర్‌ను కాపాడేందుకు ఓ మంత్రి చీకటి ఒప్పందం

» నేను, సీఎం రేవంత్, హరీశ్ రావు ట్యాపింగ్ బాధితులం: సంజయ్



హైదరాబాద్, మే 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక మంత్రి, బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడేందుకు ఆయన చీకటి ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలువురు కాంగ్రెస్ అభ్యర్థులకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావే నిధులు సమకూర్చారని, ప్రస్తుతం క్యాబినెట్‌లో ఉన్న కరీంనగర్ జిల్లా మంత్రి ఇందులో మధ్యవర్తిగా వ్యవహరించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలియకుండా సదరు మంత్రి బీఆర్‌ఎస్ నాయకత్వంతో చీకటి ఒప్పందం చేసుకుని ఈ వ్యవహారం నడిపారని చెప్పారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. 'ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రభాకర్‌రావు మీ పార్టీ నాయకులకు నిధులు ఇచ్చిన విషయం మీకు తెలుసా? కేసీఆర్ ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేసినట్లు ప్రధాన నిందితుల్లో ఒకరైన రాధాకిషన్‌రావు తన స్టేట్‌మెంట్‌లో స్పష్టం చేశారు. ఆ విషయాన్ని ఎందుకు బహిర్గతం చేయటం లేదు? ఎందుకు క్రిమినల్ చర్యలు చేపట్టడం లేదు? కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? కనీసం 41ఏ నోటీసు ఎందుకు ఇవ్వడం లేదు?' అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ నిలదీశారు. కుమ్మక్కు రాజకీయాల్లో భాగంగానే ఈ వాస్తవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించలేదని ఆరోపించారు. కేసును మూసివేయడంలో భాగంగానే కేసీఆర్, కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ అనే నాణేనికి కరీంనగర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు బొమ్మా బొరుసులాంటి వాళ్లని విమర్శించారు. నాటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు రాధాకిషన్‌రావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో స్పష్టంగా ఉందని పేర్కొంటూ, ఇందుకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీని మీడియా సమావేశంలో సంజయ్ ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, తక్షణం ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి, ఎన్ఐఏకు అప్పగించాలన్నారు. కీలక ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు కలిసి డ్రామాలాడుతున్నారని, గతంలో కేసీఆర్ అనుసరించిన పంథానే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు... విచారణలు.. అరెస్టులు.. రిమాండ్‌లు జరిగాయి. అంత తీవ్రమైన కేసుపై ఇప్పుడు చర్చ కూడా లేదు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుమ్మక్కై ఈ కేసును పక్కదారి పట్టించాయి. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయి. కేసీఆర్ హయాంలో నయీం కేసు, డ్రగ్స్, వియాపూర్ భూ కుంభకోణం, ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యల కేసుల్లో సిట్‌లు వేసి మూసివేశారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసును కూడా అదే విధంగా మూసివేయబోతున్నారు' అని పేర్కొన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, ప్రణీత్‌రావు అక్కడ వార్ రూం ఏర్పాటు చేసుకుని ట్యాపింగ్ చేశారని ఆరోపించారు.

రేవంత్, హరీశ్ కూడా బాధితులే

ఫోన్ ట్యాపింగ్‌కు తనతోపాటు సీఎం రేవంత్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా బాధితులేనని బండి సంజయ్ తెలిపారు. కేసీఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసింది తానే కాబట్టి తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారన్నారు. ఇటీవల ఒక పోలీసు అధికారి తనకు తెలిపిన వివరాల ప్రకారం తమ ఇంటి సమీపంలోని పెట్రోలు బంకులో రెండు వాహనాలు ఏర్పాటు చేశారని, మా కుటుంబ సభ్యులు, సిబ్బంది వాడే అన్ని ఫోన్లనూ ఇజ్రాయెల్ టెక్నాలజీతో ట్యాపింగ్ చేశారని తెలిపారు.

ప్రభాకర్‌రావు ప్లాన్ ప్రకారం..

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోతోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు గుర్తించారని, కాంగ్రెస్ ముఖ్య నేతలతో సన్నిహిత సంబంధాలు లేకపోతే ఇబ్బందులొస్తాయని గుర్తించారని బండి సంజయ్ పేర్కొన్నారు. 'ప్రభాకర్‌రావుతోపాటు రాధాకిషన్‌రావు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ వచ్చారు. ప్రతిమ హోటల్‌లో రూం నెంబరు 314లో రాధాకిషన్ రావు ఉన్నరు. హోటల్ బిల్లులు చెల్లించకుండా, రికార్డుల్లో పేరు నమోదు చేయించకుండా అక్కడే మకాం వేసి అవసరమైన వాళ్ల ఫోన్లను ట్యాప్ చేయించారు. ప్రభాకర్‌రావు వియ్యంకుడు అశోక్‌రావు కరీంనగర్ వాసి. ప్రస్తుతం, కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఆర్థిక వ్యవహారాలను చూసేది ఈ అశోక్‌రావే. రాజేందర్‌రావు ఉంటున్నది కూడా అశోక్‌రావు ఇంట్లోనే. ఈ అశోక్‌రావును కరీంనగర్ జిల్లాకు చెందిన క్యాబినెట్ మంత్రి, సీఎం రేవంత్‌కు పరిచయం చేయించారు. మరికొంతమంది సహచర మంత్రులకు కలిపించారు. కాంగ్రెస్‌లో కార్యకర్త కూడా కాని రాజేందర్‌రావుకు ఆ పార్టీ ఎంపీ టికెట్ రావడానికి ప్రధాన కారకుడు ప్రభాకర్‌రావే. ఈ సందర్భంగా పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయి. అంతేకాదు.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలువురు కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రభాకర్‌రావే డబ్బులు పంపించారు. ఇందులో సదరు మంత్రికి కొంత ఎక్కువ ఇచ్చారు' అని సంజయ్ వివరించారు. డబ్బులు పంపించింది ప్రభాకర్‌రావు అన్న సంగతి కూడా చాలామంది కాంగ్రెస్ అభ్యర్థులకు అప్పట్లో తెలియదన్నారు. 'కాంగ్రెస్ నాయకులకు గల్లీ నుంచి ఢిల్లీ దాకా, జాతీయ స్థాయి నాయకులకు కూడా అమెరికా నుంచి డబ్బులు వచ్చే ఏర్పాట్లు చేశారు ప్రభాకర్‌రావు. అందుకే, సీఎం రేవంత్ ఎంత పోరాడినా తాను కరీంనగర్‌లో ప్రతిపాదించిన అభ్యర్థికి టికెట్ ఇప్పించుకోలేకపోయారు. సీఎం చెప్పిన అభ్యర్థికి టికెట్ రాలేదంటే ఎంత భారీఎత్తున డబ్బులు చేతులు మారాయో ఊహించుకోవచ్చు. ఈ విషయం రేవంత్‌కు తెలుసని అనుకోవడం లేదు' అని సంజయ్ పేర్కొన్నారు.

అశోక్‌రావు ఇంట్లో కాంగ్రెస్ అభ్యర్థి

కరీంనగర్‌లోని ప్రభాకర్‌రావు వియ్యంకుడు అశోక్‌రావు ఇంట్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉంటున్నారని, అమెరికాలో అశోక్‌రావు కూతురి ఇంట్లో ప్రభాకర్‌రావు ఉంటున్నారని సంజయ్ తెలిపారు. ప్రభాకర్‌రావుకు ఇంకా పదేళ్ల వీసా గడువు ఉందని, ఆయన ఇప్పట్లో రారని చెప్పారు. ఆయన రావొద్దనే కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారని.. ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో, ఎక్కడ నోటీసులు వస్తాయోనన్న భయంతో డబ్బులు తీసుకోవడానికి కరీంనగర్‌లో కాంగ్రెస్ స్థానిక నాయకులు భయపడుతున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్, ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తెచ్చారని ఆరోపించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పెడుతున్న ఖర్చంతా అమెరికా నుంచి ప్రభాకర్‌రావు పంపించిందేనన్నారు. ట్యాపింగ్‌తో సంబంధం లేదని భావిస్తే.. సీబీఐ విచారణ కోరాలి అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్‌తో కుమ్మక్కైనట్లు అంగీకరించినట్లేనన్నారు.

ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్!

ఫోన్‌ట్యాపింగ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న పట్టుదల సీఎం రేవంత్‌కు ఉన్నా, కాంగ్రెస్ అధినాయకత్వం అంగీకరించకపోవచ్చని సంజయ్ వ్యాఖ్యానించారు. ఆ పార్టీ జాతీయ నేతలకు సైతం ఇక్కడి మంత్రి ద్వారా డబ్బులు అందడమే దానికి కారణమన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని.. చాలామంది అధికారులు ఫోన్లలో మాట్లాడుకోవడం లేదని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84.
RNI No:APTEL/2003/9741, Managing Director: Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 3 మే 2024

పీజీ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్

సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని యూనిట్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ప్రొడక్ట్స్(సీఎస్ఐఆర్-యూఆర్‌డీఐపీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో 12 మాడ్యూల్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా థియరీ క్లాసెస్, ప్రాక్టికల్ సెషన్స్, డెయిలీ అసైన్‌మెంట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

మాడ్యూల్స్


- ఇంట్రడక్షన్ టు ఐపీఆర్ అండ్ పేటెంట్స్ అండ్ పేటెంట్ లెజిస్లేషన్
- ఇంటర్నేషనల్ ఫ్రేంవర్క్స్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ అండ్ బేసిక్స్ ఆఫ్ పేటెంట్ సెర్చింగ్
- సెర్చింగ్ ఆన్ పేటెంట్ డేటా బేసెస్
- అండర్‌స్టాండింగ్ డేటాబేస్ ఫీచర్స్
- అడ్వాన్స్‌డ్ పేటెంట్ సెర్చింగ్
- ఇన్ఫర్మేషన్ సెర్చింగ్ ఇన్ వేరియస్ డొమైన్స్
- పేటెంట్ అనలిటిక్స్ అండ్ మాపింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్
- పేటెంట్ ఇన్ఫర్మేషన్ ఫర్ టెక్నాలజీ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ వాల్యుయేషన్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ ఆర్ అండ్ డీ ప్లానింగ్, స్ట్రాటజిక్ పేటెంటింగ్ అండ్ పర్ఫార్మెన్స్ బెంచ్ మార్కింగ్
- పేటెంట్ ఇన్ఫర్మాటిక్స్ ఫర్ పేటెంట్ స్ట్రాటజీ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(సైన్స్/టెక్నాలజీ)/ఎంఫార్మసీ/ బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్స్ డిగ్రీతోపాటు ఎల్ఎల్‌బీ/మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్/ఎంబీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** 62,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 4
- **ఇంటర్వ్యూ కేంద్రం:** పుణె
- **ఇంటర్వ్యూలు:** జూన్ 27, 28
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 10
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 19
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** pgdp.urdip.res.in

సరోజినీ దామోదర్ ఫౌండేషన్- 'విద్యాధన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ఇంటర్, పదకొండు- పన్నెండు తరగతులు చదివే అభ్యర్థులకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు సంస్థ తరఫున మెంటారింగ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉంటాయి. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తిగల అభ్యర్థులు రాష్ట్రానికి నిర్దేశించిన ఈ-మెయిల్‌కు దరఖాస్తులు పంపాలి.



తెలుగు రాష్ట్రాల్లో విద్యాధన్ స్కాలర్‌షిప్

అర్హత: ఏపీ/తెలంగాణలో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి కనీసం 90 శాతం మార్కులతో/9 సీజీపీఏ స్కోర్‌తో పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులకు 75 శాతం మార్కులు/7.5 సీజీపీఏ స్కోర్ చాలు. కుటుంబ వార్షికాదాయం రెండు లక్షలు మించకూడదు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి మాత్రమే ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. పరీక్ష కేంద్రాల సమాచారాన్ని అభ్యర్థులకు ఈ-మెయిల్/ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.10,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. అత్యధిక స్కోర్‌తో కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఉన్నత చదువుల కోసం ఏడాదికి రూ.10,000 నుంచి రూ.75,000 వరకు స్కాలర్‌షిప్ అందిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 7; తెలంగాణలో జూన్ 16
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి లేదా తత్సమాన కోర్సు మార్కుల పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అభ్యర్థి ఫొటో, ఇంటర్/పన్నెండోతరగతి అడ్మిషన్ పొందిన కళాశాల వివరాలు.
- **అభ్యర్థుల స్క్రీనింగ్:** ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 23న; తెలంగాణలో జూలై 7
- **ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** ఆంధ్రప్రదేశ్‌లో జూలై 7 నుంచి 20 వరకు; తెలంగాణలో ఆగస్టు 1 నుంచి 10 వరకు
- **ఆంధ్రప్రదేశ్ ఈ-మెయిల్:** vidyadhan.andhra@sdfoundationindia.com
- **తెలంగాణ ఈ-మెయిల్:** vidyadhan.telangana@sdfoundationindia.com
- **వెబ్‌సైట్:** www.vidyadhan.org/apply

Vidyadhan
Transforming lives through education

కల్యాణి ఐఐఐటీ

కల్యాణి(పశ్చిమ బెంగాల్)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ)- పీహెచ్‌డీ 2024 ఆటమ్ సెమిస్టర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. గుర్తింపు పొందిన ఫండింగ్ ఏజెన్సీల నుంచి ఫెలోషిప్స్ పొందినవారు రీసెర్చ్ కేటగిరీలో; ప్రముఖ పరిశోధన/బోధన సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు ఫుల్ టైం స్పాన్సర్డ్ కేటగిరీలో; పరిశోధన సంస్థలు/పారిశ్రామిక సంస్థలు/విద్యా సంస్థల్లో పనిచేస్తున్నవారు ఎక్స్‌టర్నల్ కేటగిరీలో; ఐఐఐటీ కల్యాణి సహా ప్రముఖ సంస్థల్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు పార్ట్ టైం కేటగిరీలో; సంస్థ స్పాన్సర్ చేసిన ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్నవారు ప్రాజెక్ట్ స్టాఫ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎటువంటి ఫెలోషిప్ లేనివారు ఇన్‌స్టిట్యూట్ టీచింగ్ అసిస్టెంట్‌షిప్ లేదా విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కేటగిరీ కింద అప్లయ్ చేసుకోవాలి. ఇన్‌స్టిట్యూట్ టీచింగ్ అసిస్టెంట్‌షిప్ కేటగిరీలో చేరినవారికి నెలకు రూ.25,000 చొప్పున అయిదేళ్లపాటు ఫెలోషిప్ ఇస్తారు. వీరు థియరీ, ల్యాబొరేటరీ తరగతుల్లో వారానికి ఆరు గంటలపాటు టీచింగ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కేటగిరీ కింద ముగ్గురికి అవకాశం కల్పిస్తారు. వీరికి మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750 చొప్పున ఫెలోషిప్ అందిస్తారు. వీరికి హెచ్‌ఆర్‌ఏతోపాటు నిబంధనల ప్రకారం రీసెర్చ్ కంటింజెన్సీ గ్రాంట్ కూడా ఇస్తారు.



పీహెచ్‌డీ

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, ఫిజిక్స్.

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి గేట్/నెట్ అర్హత పొందినవారు కూడా అర్హులే. సైన్స్ విభాగాలకు సంబంధిత స్పెషలైజేషన్‌తో కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు గేట్/నెట్ అర్హత తప్పనిసరి.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 4
- **టెస్ట్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 10
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 18 నుంచి 21 వరకు
- **వెబ్‌సైట్:** www.iiitkalyani.ac.in

నిట్ రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్ ఆర్‌కేఎల్)- పీహెచ్‌డీ 2024 ఆటమ్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. రిటెన్ టెస్ట్/పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్స్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ డిజైన్, లైఫ్ సైన్స్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ, మేనేజ్‌మెంట్.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి ఇంజనీరింగ్, సైన్స్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్పెషలైజేషన్లతో ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ ఇంజనీరింగ్/ఎంఫార్మసీ/ఎంఆర్క్/ఎంప్లాన్/ఎండిజైన్/ఎమ్మెస్సీ/ఎంబీఏ/ఎంకాం/ఎంఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత డిగ్రీ లేదా 60 శాతం మార్కులతో ఎంబీబీఎస్/బీవీఎస్సీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి గేట్/నెట్/జీప్యాట్ స్కోర్ ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. విభాగానికి నిర్దేశించిన ఇతర అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సీఎస్ఐఆర్ నెట్/యూజీసీ నెట్/డీఎస్‌టీ- ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్ఎఫ్/ఐసీఎస్ఎస్ఆర్/ఉమెన్ సైంటిస్ట్ ఫెలోషిప్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు 2024 జూన్ 9 నాటికి కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు. 32 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులకు ఫెలోషిప్ ఇవ్వరు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 9
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూన్ 28, 29
- **ఫలితాలు విడుదల:** జూలై 3
- **అడ్మిషన్స్:** జూలై 17 నుంచి 19 వరకు
- **సెమిస్టర్ రిజిస్ట్రేషన్:** జూలై 22
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.nitrkl.ac.in

జాబ్ కార్నర్

సెయిల్‌లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 108

ఝార్ఖండ్ రాష్ట్రంలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బొకారో స్టీల్ ప్లాంట్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఎగ్జిక్యూటివ్ పోస్టులు

1. సీనియర్ కన్సల్టెంట్
2. కన్సల్టెంట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్
3. మెడికల్ ఆఫీసర్
4. అసిస్టెంట్ మేనేజర్

నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

5. ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(బాయిలర్)
6. అటెండెంట్ కమ్ టెక్నీషియన్(బాయిలర్)
7. మైనింగ్ ఫోర్‌మన్
8. సర్వేయర్
9. ఆపరేటర్ కమ్ టెక్నీషియన్(మైనింగ్/ఎలక్ట్రికల్)
10. అటెండెంట్ కమ్ టెక్నీషియన్ ట్రెయినీ

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7

వెబ్‌సైట్: https://sail.co.in/

సెల SAIL

టీఎంసీలో వివిధ ఖాళీలు

ఖాళీలు 87

టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన టాటా మెమోరియల్ హాస్పిటల్...ముంబయి, గువహటి, విశాఖపట్నంలోని టీఎంసీ ఆసుపత్రుల్లో మెడికల్, నాన్-మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఆఫీసర్ 'ఇ': 8 పోస్టులు
2. మెడికల్ ఫిజిసిస్ట్: 2 పోస్టులు
3. ఆఫీసర్ ఇన్‌చార్జ్: 1 పోస్టు
4. సైంటిఫిక్ అసిస్టెంట్: 2 పోస్టులు
5. అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్: 1 పోస్టు
6. ఫిమేల్ నర్స్: 58 పోస్టులు
7. కిచెన్ సూపర్‌వైజర్: 1 పోస్టు
8. టెక్నీషియన్ 'సి': 1 పోస్టు
9. టెక్నీషియన్ 'ఎ': 4 పోస్టులు
10. స్టెనోగ్రాఫర్: 6 పోస్టులు
11. లోయర్ డివిజన్ క్లర్క్: 3 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, 12వ తరగతి, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7

వెబ్‌సైట్: tmc.gov.in/



నైపర్, మొహాలీలో టీచింగ్ స్టాఫ్

ఖాళీలు 32

పంజాబ్ మొహాలీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న విభాగాల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ప్రొఫెసర్: 13
2. అసోసియేట్ ప్రొఫెసర్: 12
3. అసిస్టెంట్ ప్రొఫెసర్: 7

విభాగాలు: ఫార్మాకోఇన్ఫర్మేటిక్స్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ - ఫార్ములేషన్స్, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్, మెడిసినల్ కెమిస్ట్రీ, క్లినికల్ రీసెర్చ్.

అర్హత: పీహెచ్‌డీతో పాటు బోధన/రీసెర్చ్/ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి.

జీతం: ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100 - రూ.2,20,000; అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,39,600 - రూ.2,11,300; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 - రూ.1,67,400.

వయోపరిమితి: 50 ఏళ్లు మించరాదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: ద రిజిస్ట్రార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెక్టార్-67, ఎస్.ఎ.ఎస్.నగర్(మొహాలీ), పంజాబ్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 6

వెబ్‌సైట్: https://niper.gov.in/


లిటిల్స్



బీర్బల్ కిచిడీ


అక్బర్, బీర్బల్ ఒక రోజు ఓ కొలను దగ్గరికి వచ్చారు. ఆ సమయంలో బాగా చలికాలం. మంచులా చల్లగా ఉన్నాయి ఆ కొలనులోని నీళ్లు. అక్బర్ ఆ కొలను దగ్గరకు వచ్చి చేయి పెట్టాడు నీళ్లలో. ఇంత చల్లగా ఉండే కొలనులో డబ్బుకోసం దిగి రాత్రంతా ఉండేవాళ్లు ఉంటారా? అని అడిగారు అక్బర్. 'అవును ఉంటారు. ఎంతో మంది ఉంటారు' అన్నారు బీర్బల్. 'రాత్రంతా చల్లని నీళ్లలో ఉంటారా? వారికి ఒక్క బంగారు నాణెం ఇస్తాం' అని దండోరా వేశారు.

ఓ పేదవాడు వచ్చాడు. ఆ బంగారు నాణెం చాలు అంటూ వచ్చాడు. కొలనులో ఉన్నాడు. రాత్రంతా కొలనులో ఉంటే నాలుగైదు బంగారు నాణేలు ఆ పేదవాడికి ఇవ్వండి అన్నాడు మరోసారి అక్బర్. దీంతో పేదవాడు ఆ విషయం తెలిసి పొంగిపోయాడు. ఉదయాన్నే పేదవాడిని చూడటానికి రాజు వచ్చాడు. విచిత్రం పేదవాడికి ఏమీ కాలేదు. 'ఈ పేదవాడు నిజంగా నీళ్లలో ఉన్నాడా?' అని సైనికులను, అక్కడ తిరిగేవాళ్లను వాకబు చేశాడు. పేదవాడు నిజాయితీగా రాత్రంతా ఆ నీళ్లలో ఉన్నాడు కాబట్టి భయపడలేదు. 'ఇంత ఆశ్చర్యమేమిటి? ఎలా ఉన్నావు?' అనడిగాడు రాజుగారు. ఆ పేదవాడు ఇలా అన్నాడు.. 'అయ్యా.. దూరంగా ఓ కాంతి కనపడింది. దాన్ని చూస్తూ వెచ్చదనంగా అనుకున్నా. అందుకే చల్లని నీళ్ల గురించి మర్చిపోయాను' అన్నాడు. 'అదేంటీ ఆ వెలుతురును తీసుకున్నావు. ఇది మోసం. దీనికి నాణేలు రావు. కారాగార శిక్ష తప్పదు' అన్నాడు అక్బర్.




అక్బర్ చెప్పిన మాటలు బీర్బల్‌కు నచ్చలేదు. ఏమాత్రం భయపడకుండా 'ఇలా ఉండటం అతని గొప్పతనం కాక ఏమవుతుంది? అతని మెదడును నియంత్రించాడు' అన్నాడు. అయినా అక్బర్ ఒప్పుకోలేదు. ఒకరోజు బీర్బల్ తన ఇంటికి భోజనానికి రమ్మన్నాడు. 'కిచిడీ బావుంటుంది' అన్నాడు. అలానే బీర్బల్ ఇంటికి అక్బర్ వెళ్లారు. పావు గంట గడిచింది. ఇంకా కిచిడీ తయారు కాలేదు అన్నాడు బీర్బల్. ఆ తర్వాత లోపలకు రాజుగారిని తీసుకెళ్లాడు. కట్టెలున్నాయి. దానికి ఓ పాత్ర కట్టి ఉంది. కింద మంట ఉంది. 'ఈ కిచిడీ అయ్యేంతవరకూ ఉండటం కష్టం. ఇది కాదేమో' అన్నాడు. 'ఎలా?' అని అడిగాడు. 'మంట తగిలితే అదే అవుతుంది కొన్ని గంటలకైనా మహాప్రభూ' అన్నాడు. అక్బర్ కోప్పడ్డాడు. ఈ పరాచకాలేంటీ? అన్నాడు. 'ఈ మంటనే కిచిడీకి అందకుంటే.. దూరంగా ఉండే వెలుగు ఆ కొలనులో చలికి వణికే ఆ పేదవాడికి ఎలా తెలుస్తుంది.' అనడిగాడు బీర్బల్. వెంటనే అక్బర్‌కు విషయం అర్థమైంది. ఆ పేదవాడిని ఖైదీ నుంచి విముక్తి కల్పించమన్నాడు. చెప్పిన బంగారు నాణేలతో మరిన్ని బంగారు నాణేలను ఇచ్చాడు. రాజు కాళ్లమీద పడ్డాడు. ఆ పేదవాడు తన పేదరికం పోయినట్లే అని మనసులో అనుకున్నాడు. ఆ పేదవాడు విషయం తెలుసుకుని బీర్బల్‌కు కృతజ్ఞత చెప్పాడు పేదవాడు.

దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 297

1					7		5	
4	3		1					6
		6	9			3		
				6			4	2
		2				1		
3	4			1				
		5			6	9		
6					1		7	4
	9		3					5

సుడోకు - 296 సమాధానం

4	7	8	3	1	9	2	6	5
3	6	1	5	2	7	4	8	9
9	5	2	4	8	6	3	1	7
5	4	6	7	9	3	8	2	1
7	8	3	1	6	2	9	5	4
2	1	9	8	4	5	7	3	6
6	9	4	2	3	1	5	7	8
1	2	5	9	7	8	6	4	3
8	3	7	6	5	4	1	9	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.